thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 9   కరీంనగర్ గురువారం, 20 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్   పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కోస్తా రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేయాలి

న్యూఢిల్లీ : 'అన్నవరం నుంచి బాపట్ల వరకు ప్రధాన తీరప్రాంత జిల్లాలు, ఓడ రేవులను కలుపుతూ కోస్తా రైల్వే కారిడార్‌ను తక్షణమే అభివృద్ధి చేయాలి' అని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. లోక్‌సభలో రైల్వే డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రానికి ఈ సారి రైల్వే బడ్జెట్‌లో రూ.9,417 కోట్లు కేంద్రం కేటాయించింది.

ఈ కేటాయింపులు రాష్ట్ర పురోగతికి కేంద్ర నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. కోస్తా కారిడార్ పూర్తి చేయడానికి 30కి.మీ. కొత్త రైల్వే ట్రాక్, గేట్ వే పోర్టు, కాకినాడ పోర్టుల మధ్య లింక్ అవసరమవుతుంది. రైల్వే మంత్రి వెంటనే ఈ కారిడార్ సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని చేపట్టాలి' అని తంగెళ్ల విజ్ఞప్తి చేశారు.

# ఇచ్చినమాటకు కట్టుబడి...!

## బడ్జెట్ లో ఆరు గ్యారెంటీలకు.... పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం






హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం 2025-26 వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సారి పూర్తి స్థాయి బడ్జెట్ ను ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. తెలంగాణ 2025-26 వార్షిక బడ్జెట్ రూ.3,04,965 కోట్లు కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉందని భట్టి తెలిపారు.

ఈ సందర్భంగా భట్టి బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన నిధుల వివరాలను వెల్లడిస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలకు ప్రత్యేక నిధులను కేటాయించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఏకంగా రూ. 56,084 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో.. మహాలక్ష్మి పథకానికి రూ. 4,305 కోట్లు. గృహ జ్యోతి పథకానికి రూ. 2,080 కోట్లు. సన్న బియ్యంకు రూ.500 బోనస్ పథకానికి రూ.1800 కోట్లు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి రూ. 1,143 కోట్లు. గ్యాస్ సిలిండర్ సబ్సీడీ పథకానికి రూ. 723 కోట్లు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ. 600 కోట్లు. రైతు భరోసా పథకానికి రూ.18,000 కోట్లు. చేయుత పథకానికి రూ. 14,861 కోట్లు. ఇందిరమ్మ ఇళ్లు పథకానికి రూ. 12,571 కోట్లు కేటాయించడం జరిగింది.

## నెల రోజుల పాటు.. ఊరూరా కాంగ్రెస్ పండుగ !

హైదరాబాద్ : నెల రోజుల పాటు.. ఊరూరా కాంగ్రెస్ పండుగ అని... గ్రామ గ్రామాన సంబరాలు .. నెల రోజుల పాటు సంబరాలు చేయాలని పిలుపునిచ్చారు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. బిసి కులఘనన, ఎస్సీ వర్గీకరణ లపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని.... టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం నిర్వహించి ఆదేశించారు. ఇందులో ఎంపీ లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్.. పాల్గొన్నారు. గత రెండు రోజులుగా అసెంబ్లీలో బిసి కులఘనన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించుకున్నామని తెలిపారు. ఇవి చరిత్రలోనే నిలిచిపోయే ఘట్టాలు.. స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలో కుల ఘనన జరపలేదని వివరించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు, ఎస్సి వర్గీకరణ కు ఆమోదం తెలిపామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్, చేవెళ్ల డిక్లరేషన్ లను ప్రకటించి ఇప్పుడు ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పుడు మనం చేసుకున్న రెండు తీర్మానాలు సామాజిక విప్లవానికి పునాదులు పడ్డాయని వెల్లడించారు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ గారి పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు మంత్రి వర్గం అంత కృషి చేసి బిల్లులను ఆమోదింప జేయడం హర్షించదగ్గ విషయం అన్నారు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడినపుడు ఎంత సంతోషపడ్డమో ఇప్పుడు



అంత సంతోషంగా ఉన్నామన్నారు. ఇంత సంతోషాన్ని పల్లెల్లో ఇంటికి పంచాలి..పెద్ద ఎత్తున సంబరాలు చేయాలి . నెల రోజుల పాటు ఈ సంబరాలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. అలాగే ఏఐసీసీ ఆదేశాల మేరకు జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని తెలిపారు. ఈ అభియాన్ కార్యక్రమాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందిస్తామన్నారు. బాణాసంచా కాల్చి, ప్లెక్సీలు పెట్టి, ఇంటింటికి కరపత్రాలు పంచి, ఊర్లలో పండగలాగా సంబరాలు నిర్వహించాలి. స్టేజి మీటింగ్ లు, ప్రెస్ మీట్ లు నిర్వహించాలని స్పష్టం చేశారు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. వీటి ప్రాముఖ్యత ను అందరికి తెలియజేయాలి.. ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని వెల్లడించారు.

## బడ్జెట్ రోజు కూడా అసెంబ్లీకి రాని కేసీఆర్.. ఇక అంతేనా!



హైదరాబాద్ : ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికైనప్పటికీ, కేసీఆర్ అసెంబ్లీలో కనిపించడం చాలా అరుదు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన కేవలం రెండు మూడు సార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారు, అవి కూడా పరిమిత సమయం కోసం. మార్చి 12, 2025న జరిగిన బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరైనప్పటికీ, ఆయన గవర్నర్ ప్రసంగం సమయంలో కేవలం 40 నిమిషాలు మాత్రమే అక్కడ ఉండి వెళ్లిపోయారు. ఆ తర్వాతి రోజుల్లో ఆయన మళ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయన్ను అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు, అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) మాత్రం "కేసీఆర్ స్థాయి అసెంబ్లీలో కూర్చోవడానికి సరిపోదు" అని సమాధానమిచ్చారు.

**బడ్జెట్ రోజు డుమ్మా..** కేసీఆర్ గతంలో బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చారు. బుధవారం(మార్చి 19న) 2025-26 బడ్జెట్ ను భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టా రు. ఐనా కేసీఆర్ రాలేదు. హాజరు కాకపోవడం వెనుక ఆయన ఆరోగ్యం, రాజకీయ వ్యూహం లేదా ప్రభుత్వంపై విమర్శలను నేరుగా ఎదుర్కోవాలని లేని ఉద్దేశ్యం ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేసీఆర్ హాజరు కాకపోవడంపై ప్రశ్నలు సంధించారు మరియు ఆయన బాధ్యతలను నిర్వర్తించకపోతే ప్రతిపక్ష నాయకుడి పదవిని కేటీఆర్ లేదా హరీష్ రావుకు అప్పగించాలని సూచించారు. అంతేకాక, ఆయన గైర్హాజరీపై హైకోర్టులో పిల్ కూడా దాఖలైంది, దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి. మొత్తంగా, కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం రాజకీయంగా వివాదాస్పదంగా మారింది, ఇది రాష్ట్ర ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచే అవకాశాన్ని కోల్పోతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




# రూ.3,04,965 కోట్లతో... రేవంత్ సర్కార్‌తో భారీ బడ్జెట్!

## సభలో ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్: శాసనసభలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. 2025-26 ఏడాదికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను సభకు సమర్పిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం 2 పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చింది.

**రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు 'మెగా మాస్టర్ ప్లాన్ 2050'...** రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాం. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తాం. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం.

ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ.

**దేశానికే తలమానికంగా ఉండేలా 'ఫ్యూచర్ సిటీ'...** ఓఆర్ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. ఫేజ్-2 ద్వారా హెచ్ఎండీఏలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం. హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.5,942 కోట్లు కేటాయిస్తాం. దేశానికి తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. శ్రీశైలం- నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఇది ఉంటుంది. 56 గ్రామాలు, 765 చదరపు కి.మీ విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ, ఇన్నోవేషన్ జోన్లు, మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉంటాయి. ఈ ప్రాజెక్టును ఎఫ్‌సీడీఏ పర్యవేక్షిస్తుంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులిలా..** పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు. వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు. విద్యాశాఖ- రూ.23,108కోట్లు. మహిళా శిశుసంక్షేమశాఖ- రూ.2,862 కోట్లు. పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు. పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు. కార్మికశాఖ- రూ.900 కోట్లు. ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు. ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు. బీసీ సంక్షేమం- 11,405 కోట్లు. చేనేత రంగానికి- రూ.371 కోట్లు. మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు. పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు. ఐటీ రంగం- రూ.774 కోట్లు. విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు. వైద్య రంగం- రూ.12,393 కోట్లు. పురపాలక రంగం- రూ.17,677 కోట్లు. నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు. రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు. పర్యాటక రంగం- రూ.775 కోట్లు. క్రీడలు- రూ.465 కోట్లు. అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు. దేవాదాయశాఖ- రూ.190 కోట్లు. ఆరు గ్యారంటీలు- రూ.56,084 కోట్లు. రైతు భరోసా- రూ.18వేల కోట్లు. చేయూత పింఛన్లు రూ.14,861 కోట్లు. ఇందిరమ్మ ఇళ్లు రూ.12,571 కోట్లు. మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు. గృహజ్యోతి- రూ.2,080 కోట్లు. సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు. రాజీవ్ ఆరోగ్యశ్రీ- రూ.1,143 కోట్లు. గ్యాస్ సిలిండర్ రాయితీ- రూ.723 కోట్లు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా- రూ.600 కోట్లు. రాజీవ్ యువ వికాసం- రూ.6వేలకోట్లు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు.




హైదరాబాద్:అసెంబ్లీలో మూడోసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రేవంత్ సర్కార్ రైతులకు శుభవార్త చెప్పింది. బడ్జెట్?లో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లను కేటాయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.రైతులకు ఏడాదికి ఎకరానికి 12 వేల రూపాయలు అందుతాయని ఈ సందర్భంగా భట్టి తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అవకతవకలకు అడ్డుకట్ట వేసి.. రైతు భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్?లో పెద్ద పీట వేసింది. వ్యవసాయ శాఖకు బడ్జెట్‌లో 24 వేల 439 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో మూడెకరాల భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేసిన సంగతి తెలిసిందే. రూ.1,230.98 కోట్లను రైతుల అకౌంట్లలో వేసింది. దీంతో ఇప్పటి వరకు మొత్తం 44.82 లక్షల మంది రైతులకు రూ.3,487.82 కోట్ల రైతు భరోసా నిధులు అందాయి. జనవరి 26న పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి మండలంలో ఒక గ్రామానికి రూ.568.99 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసి ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఫిబ్రవరి 5న రాష్ట్రవ్యాప్తంగా ఒక ఎకరం వరకు ఉన్న 17 లక్షల మంది రైతులకు చెందిన 9.29 లక్షల ఎకరాల భూమికి గాను రూ.557.54 కోట్లు జమ చేశారు. రెండెకరాల వరకు ఉన్న రైతులకు ఫిబ్రవరి 10న 13.23 లక్షల మందికి, ఫిబ్రవరి 12న రికార్డులు అప్‌డేట్ చేసిన 56 వేల మంది రైతులకు రూ.38.34 కోట్లతో కలిపి మొత్తం రూ.1,130.29 కోట్లు నిధులు జమ చేశారు. అదే రోజు మూడెకరాల వరకు ఉన్న 9.56 లక్షల మంది రైతులకు చెందిన 20.51 లక్షల ఎకరాలకు రూ.1,230.98 కోట్లు నిధులను డైరెక్ట్? బెనిఫీషియరీ ట్రాన్స్‌ఫర్ ద్వారా రైతు ఖాతాల్లో వేశారు. దీంతో ఇప్పటి వరకు 44.82 లక్షల మంది రైతులకు చెందిన 58.13 లక్షల ఎకరాలకు రైతు భరోసా కింద రూ.3,487.82 కోట్ల నిధులను ప్రభుత్వం జమ చేసింది. మిగతా వారికి త్వరలో నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

బడ్జెట్‌లో రైతు భరోసాకు 18 వేల కోట్లు కేటాయించడంతో రేపోమాపో రైతు భరోసా అర్హులైన లబ్దిదారులకు అందనుంది.




హైదరాబాద్ : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కంటే అదనంగా 4నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. పది దాటితే బయటికి వెళ్లాలంటే జనం భయపడిపోతున్నారు. అయితే ఎండలు,తీవ్రమైన వేడితో సతమతమవుతున్న తెలంగాణ వాసులకు కొంత ఊరట. రాష్ట్రంలో పలుచోట్ల మరో మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు, తుఫాను సంభవించే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా హైదరాబాద్ లో మార్చి 22 నుంచి మూడు రోజుల పాటు వాతావరణం పూర్తిగా మారిపోతుంది..వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావారణ శాఖ తెలిపింది. ఇక తెలంగాణలోని మిగతా ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణలో ఉరుములు, బలమైన ఈదురుగాలులు, వడగళ్ల తుఫానులు సంభవించే అవకాశం ఉంది. మార్చి 22న సెంట్రల్, నార్త్ తెలంగాణతో ప్రారంభమై మార్చి 23, 24న దక్షిణ, తూర్పు తెలంగాణ వరకు విస్తరించే అవకాశం ఉంది. తూర్పు తెలంగాణలో తీవ్రమైన తుఫానులు సంభవించే అవకాశం ఉంది. మార్చి 22, 23 తేదీల్లో తెలంగాణలోని మంచిర్యాలు, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, దిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, గద్వాల్‌లలో కూడా ఈదురు గాలులుతో కూడిన తుఫానుకు అవకాశం ఉంది. మరోవైపు ఇదే 22, 23తేదీల్లో హైదరాబాద్ నగరంతో పాటు మరో 17 జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నిర్మల్, ఆసిఫాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, జనగాం, మేడ్చల్, యాదాద్రి, సూర్యాపేట, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, వనపర్తి , నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వడగండ్ల వానలు, బలమైన గాలులు కూడా వీచే అవకాశం ఉంది.

## తొండ ముదిరితే ఊసరవెల్లి.. ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి: కేటీఆర్..

హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్-2025పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదని, ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్ అంటూ ఆరోపించారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందని, ఊసరవెల్లి ముదిరితే సీఎం రేవంత్ రెడ్డి అవుతారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ అందమే సక్కగా లేదని, కానీ అందాల పోటీలు పెట్టేందుకు సిద్ధమవుతోందంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ..''రేవంత్ రెడ్డీ.. రంకెలు వేయడం కాదు బడ్జెట్ అంకెలు ఎటు పోయాయ్. ఆకాశం నుంచి పాతాళానికి బడ్జెట్ పోతోంది. పరిపాలన చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్. ఈ బడ్జెట్?లో ఆరు గ్యారంటీలు గోవిందా. వాటికి పాతర వేశారు. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలను బడ్జెట్?లో ప్రస్తావించలేదు. తులం బంగారానికీ దిక్కు లేదు. చేనేతకు బీఆర్ఎస్ హయాంలో రూ.1,200 కోట్లు కేటాయించాం. కానీ ఇవాళ చేనేత కార్మికులను రూ.300 కోట్లు పరిమితం చేశారు. ఆటో కార్మికుల గురించి ప్రస్తావనే లేదు. యాదవ సోదరుల ప్రసక్తే లేదు.

వైన్స్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ గౌడన్నలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అదీ కనిపించడం లేదు. చివరికి దళిత సోదరులనూ మోసం చేశారు. నిరుద్యోగులకు ఒక్క హామీ ఇవ్వలేదు. ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్, కానీ నియామక పత్రాలు ఇచ్చింది మాత్రం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి గురించి ఒక్క మాటా లేదు. విద్యా భరోసా గురించీ ప్రస్తావన లేదు. గురుకుల పాఠశాలల్లో




పిల్లల చనిపోతే పట్టించుకోలేదు. హైదరాబాద్ మహానగరం పెండింగ్ నగరంగా మారిపోయింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పేక మేడలా కుప్ప కూల్చారు. ఎన్ని సున్నాలు ఉంటాయో తెలియదు కానీ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని అంటున్నారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ ప్రభుత్వం. ఇది తెలంగాణ ప్రజల బడ్జెట్ కాదు.. కాంగ్రెస్ వికాస్ బడ్జెట్. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంట్ ఉండదు. ప్రజల సొత్తును కాంగ్రెస్ కార్యకర్తలకు పంచితే ఊరుకోం. వారికి రూ.6వేల కోట్లు పప్పు, బెల్లం మాదిరి పంచిపెట్టబోతున్నారు. తెలంగాణలో పంటలు ఎండుతుంటే.. హైదరాబాద్‌లో అందాల పోటీలు అవసరమా?" అని ప్రశ్నించారు.

## స్మితా సభర్వాల్‌కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం

హైదరాబాద్: తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులు తిరిగి యూనివర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనుంది. ఒకటి రెండు రోజుల్లో ఆమెకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో సీఎంఓలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితా సభర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. నెలకు రూ.63 వేల చొప్పున అద్దె రూపంలో యూనివర్సిటీ నుంచి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. స్మితా సభర్వాల్ అద్దెకు తీసుకున్న టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో ప్లేట్ వాహనం కాదు. ప్రైవేటు వ్యక్తిగత వాహనం పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో వెల్లడైంది. సీఎంవో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో యూనివర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పనితీరుపై ఇటీవల ఏజీ జరిపిన విచారణలో కొన్ని తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు వెల్లడయ్యాయి. అందులో ఈ అంశం కూడా ఉంది. ఈ విషయంపై వివరణ కోరగా... స్మితా సభర్వాల్ వాహన అద్దెపై ఆడిట్ అభ్యంతరం నిజమేనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్దాస్ జానయ్య అన్నారు.

ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ, విశ్లేషణ జరిపించామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి తీసుకురావడం ద్వారా సమావేశంలో కూడా విస్తృతంగా చర్చించామని, ఈ విషయంపై సమగ్ర నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, న్యాయనిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వర్సిటీ వీసీ పేర్కొన్నారు.




గ్రేటర్ హైదరాబాద్ సిటీ డెవలప్ మెంట్ పై తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. గ్రేటర్ వ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు బడ్జెట్ లో ప్రకటించింది. హైదరాబాద్ సిటీలో మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా H-..CITI ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క. ఈ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా 31 ఫ్లై ఓవర్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా 17 అండర్ పాస్ లు కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. వీటితోపాటు నగరంలోని 10 రహదారులను విస్తరించి.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయబోతున్నట్లు స్పష్టం చేశారాయన. వీటన్నింటికీ 7 వేల 032 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించబోతున్నాం అని వివరించిన మంత్రి భట్టి.. మరో 150 కోట్ల రూపాయలతో హైదరాబాద్ సిటీ సుందరీకరణ పనులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ సిటీ భవిష్యత్ అవసరాలు, రాబోయే రోజుల్లో పెరగనున్న బైక్స్, కార్లు, ఇతర వాహనాల రద్దీకి అనుగుణంగా హై సిటీ ప్రణాళికలో భాగంగా కొత్త ఫై ఓవర్లు, అండర్ పాస్ లను నిర్మాణం చేపట్టనున్నట్లు తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారాయన.




బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ యుగానికి తగ్గట్టు కీలక నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా 200 ఎకరాల్లో ఏఐ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని నిర్మించనున్నట్లు తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క. ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో నిర్మించనున్న AI సిటీ ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజ కంపెనీలకు కేంద్రంగా మారుతుందన్నారు. ఈ ఏఐ సిటీలో గూగుల్ కంపెనీ తన AI ఆధారిత యాక్సిలరేటర్ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు కీలక ప్రకటన చేశారాయన. ఈ ఏఐ సిటీ కోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖకు బడ్జెట్ లో 774 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నట్లు వెల్లడించారాయన. సేవా రంగంలో అభివృద్ధికి దోహదపడే సానుకూల ప్రభుత్వ కీలక నిర్ణయాల ఫలితంగా.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో గత సంవత్సర కాలంగా ఎంతో అభివృద్ధి చెందిందని.. కృత్రిమ మేథ, బ్లాక్ చైన్ వంటి కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక ప్రక్రియల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు మంత్రి భట్టి విక్రమార్క.

## రేవంత్‌రెడ్డిపై కేసును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. జన్వాడలో డ్రోన్ ఎగురవేసిన ఘటనకు సంబంధించి 2020 మార్చిలో నార్సింగి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. దీంతో రేవంత్‌రెడ్డిని అప్పట్లో నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఈక్రమంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనల సందర్భంగా జన్వాడ నిషిద్ధ ప్రాంతమేమీ కాదని రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది పేర్కొన్నారు. తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని చెప్పారు.

**కేటీఆర్‌పై నమోదైన కేసు కొట్టివేత...** మరోవైపు సైఫాబాద్ పీఎస్‌లో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని కించపర్చే విధంగా మాట్లాడారని.. ఎంపీ అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కేసును కొట్టేయాలని కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనల సందర్భంగా.. బాధ్యత గల హోదాలో ఉన్న కేటీఆర్ ఇష్టారీతిన మాట్లాడారని పీపీ చెప్పారు. సీఎంను కించపరిచే విధంగా మాట్లాడారని పేర్కొన్నారు. మరోవైపు రాజకీయ కక్షలతో కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది అన్నారు. ఇరువైపులా వాదనలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను కొట్టేసింది.




మర్చంట్ నావీ ఆఫీసర్ సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో కొత్త కొత్త విషయాలు బయటపడుతున్నాయి. అతడి భార్య ముస్కాన్ కన్నింగ్ ప్లాన్లన్నీ వెలుగు చూస్తున్నాయి. ముస్కాన్ భర్తను చంపిన తర్వాత అతడి మొబైల్ ఫోన్ వాడటం మొదలెట్టింది. మార్చి 6వ తేదీన సౌరభ్ చెల్లెలికి వాట్సాప్ ద్వారా మెసేజ్ పెట్టింది. వారిద్దరి మధ్యా ఈ విధంగా వాట్సాప్ ఛాటింగ్ జరిగింది. 'నువ్వు హోలీకి మీరట్‌లోనే ఉంటావా?..' అని ముస్కాన్ అడిగింది. దానికి సౌరభ్ చెల్లెలు ' అవును' అని సమాధానం ఇచ్చింది. తర్వాత ముస్కాన్ సౌరభ్ చెల్లెలికి మెసేజ్ చేయలేదు. హోలీ రోజు సౌరభ్ చెల్లెలు 'హ్యాపీ హోలీ' అంటూ మెసేజ్ పెట్టింది. దానికి కూడా రిప్లై రాలేదు. శనివారం రోజున సౌరభ్ చెల్లెలు అన్న వాట్సాప్‌కు మళ్లీ మెసేజ్లు చేసింది. సౌరభ్ నువ్వు ఎప్పుడు వస్తావు? ' అని అడిగింది. దానికి ముస్కాన్ ' చెప్తాను' అంటూ సమాధానం ఇచ్చింది. 'రేపు నేను వెళ్లిపోతున్నాను. అందుకే అడుగుతున్నాను' అంటూ సౌరభ్ చెల్లెలు బాధపడింది. దానికి ముస్కాన్ సమాధానం ఇస్తూ.. ' ఓ పార్టీ ఉంది. నేను అక్కడికి వెళుతున్నాను. ఎప్పుడొస్తానో తెలీదు' అని అంది. సౌరభ్ చెల్లెలు కోపంగా ' చల్ .. నువ్వు ఎంజాయ్ చేసుకో..' అని అంది. ముస్కాన్ సౌరభ్ చెల్లెలికి అనుమానం రాకుండా చాలా నేర్పుగా, ఓర్పుగా చాటింగ్ చేసింది. అంతేకాదు.. జనాలను నమ్మించడానికి భర్త ఫోన్‌ను తీసుకుని ప్రియుడితో కలిసి మనాలి వెళ్లింది. అక్కడ ఫొటోలు తీసి సౌరభ్ సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేయటం మొదలుపెట్టింది. ఎంత పక్కాగా ప్లాన్ చేసినా చివరకు పోలీసులకు దొరికిపోయింది.

**ప్రేమ పెళ్లి.. స్నేహితుడితో అక్రమ సంబంధం...** ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన సౌరభ్ రాజ్‌పుత్, ముస్కాన్ రస్తోగి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సౌరభ్ మర్చంట్ నావీలో పని చేస్తూ ఉండేవాడు. పెళ్లి తర్వాత భార్యతో గడపడానికి ఉద్యోగం మానేశాడు. ఇక అప్పటినుంచి కుటుంబంలో అలజడి మొదలైంది. ఇంట్లో వాళ్లు మళ్లీ జాబ్‌లో జాయిన్ అవ్వమని గొడవపెడుతూ ఉండేవారు. దీంతో భార్యతో కలిసి బయటకు వచ్చేశాడు. వేరు కాపురం పెట్టాడు. 2019లో వీరికి ఓ ఆడబిడ్డ పుట్టింది. బిడ్డ పుట్టిన తర్వాత అతడికి ఓ షాకింగ్ విషయం తెలిసింది. ముస్కాన్ ఆమె స్నేహితుడు సాహిల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసింది.

భార్యాభర్తలు గొడవలు పడ్డారు. విడాకులు తీసుకోవాలనుకున్నారు. అయితే, బిడ్డ కోసం సౌరభ్ ఆగిపోయాడు. మళ్లీ ఉద్యోగంలో జాయిన అయ్యాడు. 2023లో విదేశాలకు వెళ్లిపోయాడు. 2025 ఫిబ్రవరి నెలలో కూతురి పుట్టిన రోజు ఉండటంతో ఇండియాకు వచ్చాడు. ఇది నచ్చని ముస్కాన్.. ప్రియుడితో కలిసి అతడ్ని చంపేసింది. ఇద్దరూ శవాన్ని 15 ముక్కలు చేసి, డ్రమ్‌లో పడేశారు. తర్వాత డ్రమ్మును సిమెంట్‌తో కప్పేశారు. సౌరభ్ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో మర్డర్ విషయం బయటకు వచ్చింది.

## నిరుద్యోగులకు భారీ గుడ్ న్యూస్.. బడ్జెట్‌లో ఊహించని విధంగా కేటాయింపులు

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.3,04,965 కోట్లని తెలిపారు. అందులో రెవెన్యూ మూలధనం రూ.2,26,982 కోట్లు ఉందని అన్నారు. మూలధన వ్యయం రూ.36,504 కోట్లుని పేర్కొన్నారు. గతేడాదిలో పోలిస్తే వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైందని అన్నారు. 2024-25లో స్థూల ఉత్పత్తి రూ.16,12,579 కోట్లని, తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,79,751 కోట్లుగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభలో ప్రస్తావించారు. ముఖ్యంగా రాష్ట్రంలో నిరుద్యోగ రేటును 22.9 శాతం నుంచి 18.1శాతానికి తగ్గించేందుకు, యువతకు ఉపాధి కల్పించమే లక్ష్యంగా ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. సిటీ శివారు ప్రాంతమైన ముచ్చర్లలో యంగ్ ఇండియా టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా %ూా×% సిటీగా 200 ఎకరాల్లో ప్రత్యేక టెక్ హబ్‌కు ఏర్పాటు కూడా శ్రీకారం చుట్టబోతోంది. త్వరలోనే వివిధ నోటిఫికేషన్ల ద్వారా 57,946 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టనుంది. ఐటీఐఎస్‌ను మోస్ట్ అడ్వన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చి తెలంగాణ డిజిటల్ ఉపాధి కేంద్రం పునరుద్ధరించనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి రూ. 6,000 కోట్లు కేటాయించారు. %దీఖీా×% రంగంలో విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను అమలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 38 కళాశాలల్లో అమలు చేయనున్నారు.

# సంతోషమే సంపూర్ణ బలం

**(మార్చి 20 అంతర్జాతీయ సంతోషి దినోత్సవం సందర్భంగా)నేడు ప్రపంచ మానవాలిని ప్రపంచీకరణ' కార్పోటీకరణ**

శాసిస్తుంది. ఆధునిక రోజుల్లో హైటెక్ కల్చర్ పెరిగి పోయి జీవితంలో ఒత్తిడి పెరిగిపోయి మానవ సంబంధాలు కనుమరుగైనాయి.

ప్రపంచంలో ఆకలి' పేదరికం' నిరక్షరాస్యత' మానవ హక్కుల ఉల్లంఘన అంతం చేయడానికి ఆనందం సంతోషం కోసం మార్గాలు అన్వేషించాలని మానసిక నిపుణులు సూచించారు. ఉరుకుల పరుగుల జీవితంలో మానవుల్లో సంతోషం కనుమరుగ వుతున్న వేళ సమాజంలో

సంతోషం యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తూ

సంతోషాన్ని ఒక ప్రాథమిక హక్కుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు సంతోషంగా జీవించేలా ప్రోత్సహించడానికి

అంతర్జాతీయ సంతోష దినం ప్రతి ఏటా మార్చి 20న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండడానికి సరళమైన దైనందిన జీవనశైలి అవలంబించే విధానాలను ప్రోత్సహిస్తారు. ఆరోగ్యకరమైన ఆనంద పరమైన జీవన విధానాలను ప్రోత్సహించడం ద్వారా సంతోషకరమైన ప్రపంచాన్ని

సృష్టించడమే లక్ష్యంగా సంతోష దినోత్సవం జరుపాలని భూటాన్ ప్రతిపాదించిన తీర్మానం మేరకు సంతోషాన్ని అంతర్జాతీయ దినోత్సవంగా ఐ'రా'స లోని 193 సభ్యదేశాలు సంతోషానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాయి ..

**సంతోషం మానవుని ప్రాథమిక లక్ష్యం ఐ'రా'స**

2011లో ఐక్యరాజ్యసమితి తీర్మానాన్నిఆమోదించింది .సంతోషాన్ని ప్రాథమిక మానవ లక్ష్యంగాగుర్తించింది .ప్రజలందరికి ఆనందం శ్రేయస్సు ప్రోత్సహించే ఆర్థిక వృద్ధికి సమ్మిళిత సంతులిత సుస్థిరాభివృద్ధికి పిలుపునిచ్చింది. 2013'వ'సం"లో ఐక్య రాజ్య సమితి మొదటి సంతోష సదస్సు జరిగింది. జాతీయ ఆదాయంపై జాతీయ ఆనందాల ప్రాముఖ్యత గుర్తింపుజాతీయాదాయంపై జాతీయ ఆనందాల ప్రాముఖ్యత

1970 నుండి జాతీయ ఆదాయం పై జాతీయ ఆనందాల ప్రాముఖ్యత గుర్తించబడింది

**స్థూల జాతీయ సంతోషం ముఖ్యం**

1972 లో భూటాన్ రాజు జిగ్మే సింగ్లె వాంగుచుక్ స్థూల జాతీయోత్పత్తి కంటే స్థూల జాతీయ సంతోషం ముఖ్యమని ప్రకటించారు. భౌతిక శ్రేయస్సు కంటే సంపూర్ణ శ్రేయస్సును పెంచే సంతోషం ప్రాముఖ్యతను చెప్పాడు.స్థూల జాతీయ సంతోషం అభివృద్ధికి సూచికస్థూల జాతీయ సంతోషాన్ని స్థిరమైన అభివృద్ధికి సూచికగా ఐ'రా'స స్వీకరించింది.ప్రపంచ సంతోష సూచీలో భారత్ స్థానం

ప్రపంచంలో 146 దేశాలలో వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్స్ సూచీ ప్రకారం దేశాల్లో ఎంత మేరకు సంతోషంగా ఉన్నారో తెలుసుకోవడానికి ఐరాసకు చెందిన సస్టైన్బుల్ సొల్యూషన్స్ నెట్వర్క్ సంస్థ ఈసంవత్సరం సూచీలు విడుదల చేసింది .

సంతోష సూచిలో భారత్ స్థానం

సంతోష సూచీలోప్రపంచంలోని 146 దేశాల్లో భారత్ 136వ స్థానంలో ఉంది. మన పొరుగు దేశాలైన శ్రీలంక 'పాకిస్తాన్' నేపాల్ బంగ్లాదేశ్ ప్రజలు మనకంటే ఎక్కువ సంతోషంలో ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు.

ఫిన్లాండ్ డెన్మార్క్ స్విజర్లాండ్నెదర్లాండ్ సంతోష సూచీలు మొదటి 5 ర్యాంకుల్లో ఉండడం గమనార్హం.

**ప్రపంచ వ్యాప్తంగా మార్పులు**

ప్రపంచవ్యాప్తంగా చాలా మార్పులుచోటుచేసుకున్నాయి. పురోగతి అంటే కేవలం ఆర్థికాభివృద్ధి పెంచడమే కాదని మానవ సంతోషం శ్రేయస్సును పెంచడం అని ఇప్పుడు గుర్తిస్తున్నారు.

సంతోషం ప్రాథమిక మానవ లక్ష్యం ఐ 'రా'స గుర్తింపు

సంతోష దినోత్సవానికి అనుకూలంగా 193 దేశాలు తీర్మానించాయి. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు సంతోషానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. 160 దేశాలకు చెందిన ప్రజలు లాబాపేక్ష లేని ఉద్యమం యాక్షన్ ఫర్ హ్యాపీనెస్ బావస్వారూప్య సంస్థలు భాగస్వామ్యంతో సంతోష దినోత్సవాన్ని నిర్వహిస్తారు.ఐ'రా'స సంతోషం ప్రాథమిక మానవ లక్ష్యంగా గుర్తించింది.

**సంతోషంవలన కలిగే ప్రయోజనాలు**

మానవ ఆరోగ్యానికి సంతోషం కీలకం . సంతోషం వల్ల బలమైన సామాజిక సంబంధాలు బలపడతాయి. ఆనందంగా సంతోషంగా ఉ ఒడటం అనేది మానవాళికి గొప్ప మేలు చేసే పనుల్లో ఇమిడివుంటుంది. పరోపకారం ఇతరులకు సహాయపడటం. సమాజాన్ని మెరుగుపరచడం ఇతరులతో కలిసి పనిచేయడం.

ఆధ్యాత్మికత వంటి మతపరమైన కార్యక్రమాలను ప్రోత్సహించడం.

సంతోషంగా ఉన్న వారు ఎక్కువకాలం జీవిస్తారని ఆరోగ్య సమస్యలు తక్కువ ఉంటాయని అధిక రక్తపోటు గుండె సమస్యలు లాంటివి ఉ ఒడవని వైద్య ఆరోగ్య అధ్యయనాలు తెలుపు తున్నాయి.

అయినప్పటికీ ఆనందం ఆనంద స్థాయిలను ఎలా కనుగొనాలి లేదా పెంచాలని అనే అంశాల పైపరిశోధనలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ దినోత్సవం ఇతరుల సంతోషానికి విలువ ఇచ్చి ప్రజలను సంతోషపెట్టే రోజు. జీవితంలో సంతోషానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం. జీవితంలో ఇతరుల శ్రేయస్సుకు పాటు పడడం.

**సంతోషంగా ఉండడానికి సలహాలు**

పోషకాహారం తీసుకోవడం తేలికపాటి వ్యాయామం చేయడం. మెదడు ఫీల్ గుడ్ రసాయనాలు విడుదల చేస్తుంది. తగినంత విశ్రాంతి తీసుకోవడం. ఒత్తిడితగ్గించడం మనసులో బాధలు ఇతరులతో షేర్ చేసుకోవడం . అనవసర విషయాలు మాట్లాడకుండ వదిలించుకోవడం. సోషల్ కౌన్సలింగ్ లో భాగస్వామ్యం కావడం . స్నేహితులతో గడపడం . మానవత్వం నీతి నిజాయితీ విలువలతో కూడిన సంతోషకరమైన జీవితాన్ని గడపడం చాలా ముఖ్యం. జీవితంలో జరిగిన సంఘటనలపై కోపంగా ఉండకూడదు. తప్పు చేసిన వారిని క్షమించడం ద్వారా సంతోషాన్ని ఆనందాన్ని పొందవచ్చు.సంతోషంగా ఉండడం అంటే ఏమిటి జీవితంలో లోతైన సంతృప్తి పొందడం ఇది కేవలం క్షణికమైన ఉత్సాహ భరితమైన క్షణాలకు మించి క్రమం తప్పకుండా ఆనందం మరియు సానుకూలతను అనుభవించడం ద్వారా వస్తుంది. ఆనందం అంటే మనం చేసే పనిలో ఉద్దేశం అర్థాన్ని కనుగొనడం అర్థవంతమైన సంబంధాలను కాపాడు కోవడం. సవాలు ఎదుర్కొనేటప్పుడు స్థితిస్థాపకంగా ఉండడం. జీవితంలో వచ్చిన చిన్న ఆనందాలు అభినందించడం. మీకు ఉన్నదానితోసంతృప్తి పడి కృతజ్ఞతతో ఉండడం. మీ విలువల ప్రకారం నిజాయితీగా జీవించడం. అంతిమంగా ఆనందంగా ఉంటే మీకు శాంతి ఆనందం మరి మీతో మరి ఇతరులతో సంబంధాన్ని సంతృప్తికరమైన జీవితాన్ని గడపడం.

**ఆనందం వల్ల కలిగే శారీరక మానసిక ఆరోగ్య ప్రయోజనాలు**

ఆనందానికి శారీరక మానసిక ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉంది. నిరంతరంగా ఆనందాన్ని అనుభవించినప్పుడు అది వారి శ్రేయస్సును అనేక విధాలుగా సానుకూలంగా ప్రభావితం చేస్తుంది.

ఆనందం మెరుగైన మానసిక ఆరోగ్యానికి దగ్గర సంబంధం ఉంటుంది. సంతోషంగా ఉండే వ్యక్తులు ఒత్తిడి ఆందోళన నిరాశా స్థాయికి తక్కువ అనుభవిస్తారు. మెరుగైన విధానాలు కలిగి ఉంటారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉంటారు.

**భావోద్వేగ స్థితి స్థాపకత**

ఆనందం భావోద్వేగ స్థితిస్థాపకతను పెంచుతుంది. అంటే వ్యక్తులు ఎదురు దెబ్బలు ఒత్తిళ్లతో కూడిన పరిస్థితుల నుండి సులభంగా కోలుకోవడానికి జీవితంలో సానుకూల దృక్పథం కలిగేట్లు ప్రభావాన్ని కలిగి వుంటుంది.

**శారీరక ఆరోగ్యం**

సంతోషంగా ఉన్న వ్యక్తులు తరచుగా మెరుగైన శారీరక ఆరోగ్య సంరక్షణ ఫలితాలను పొందుతారు.

క్రమం తప్పకుండా వ్యాయామం సమతుల్య ఆహారం తగినంత నిద్ర వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని కలిగి ఉండడం. వల్ల సంతోషం ఆనందం స్థాయిలు పెరుగుతాయి. మానసిక స్థితి శ్రేయస్సు మెరుగుపడుతుంది.

రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది

ఆనందం 'సంతోషం రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుందని అనేక వైద్య ఆరోగ్య అధ్యయనాలు తెలిపాయి. సానుకూల భావోద్వేగాలు అంటూ వ్యాధులు మరియు అనారోగ్యాలతో పోరాడే శరీర సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇది మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

హృదయ సంబంధ ఆరోగ్యం

ఆనందం హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అధిక రక్తపోటు తగ్గిస్తుంది. కాలక్రమేణ గుండె ఆరోగ్య ఫలితాలను మెరుగు పరుస్తుంది.

**దీర్ఘాయువు**

సంతోషంగా ఉండే వ్యక్తులు ఎక్కువ కాలం జీవిస్తారని పరిశోధనలు తెలుపు తున్నాయి .సానుకూల భావోద్వేగాలు మరియు శ్రేయస్సు యొక్క భావన ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా శరీరంపై దీర్ఘకాలిక ఒత్తిడి ప్రభావాన్ని తగ్గిస్తుంది. తద్వారా దీర్ఘాయువుకు దోహదం చేస్తుంది.

**జీవన నాణ్యత**


ఆనందం మొత్తం జీవన నాణ్యతను పెంచుతుంది. సంబంధాలను మెరుగు పరుస్తుంది. సామాజిక సంబంధాలను పెంచుతుంది . జీవిత పరిస్థితులతో సంతృప్తిని పెంచుతుంది. జీవితంపై సానుకూల దృక్పథం పెరిగి శ్రేయస్సు యొక్క ఉన్నత భావనకు దోహదం చేస్తుంది.

**గ్రహణ శక్తి పై సంతోషం ఆధారపడి ఉంటుంది**

సంతోషం అనేది వ్యక్తిగతమైనది అంతర్గత వైఖరులు బాహ్య విషయాలు వాటి మిశ్రమం ద్వారా సంతోషం ప్రభావితం అవుతుంది. మన అనుభవాలు సంబంధాలు చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మనం ఎలా గ్రహిస్తాం అనే దాని మీద సంతోషం ఆధార పడి ఉంటుంది.

ఒడు దొడుకులు ఎదుర్కునేసంతృప్తికర జీవితం

ఆనందం అంటే ప్రతికూల భావోద్వేగాలను నివారించడం మాత్రమే



కాదు వాటిని అంగీకరించడం వాటి ద్వారా నేర్చుకోవడం ముఖ్యం. జీవితంలోని ఒడు దొడుకుల మధ్య స్థితిస్థాపకతను పెంపొందించుకోవడం కోసం ఆనందాన్ని కనుగొనడం సంతృప్తికరమైన జీవితాన్ని కొనసాగించడం ముఖ్యం.

**సంతోషకరమైన జీవితానికి అవలంభించాల్సిన వ్యూహాలు**

1)సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి సానుకూల మనస్తత్వాన్ని పెంపొందించు కోవాలి 2)ఆచరణాత్మక దశలను కార్యాచరణగా రూపొందించుకోవాలి. 3)ప్రతిరోజు కృతజ్ఞతా భావాన్ని అలవర్చుకోవాలి. 4)సూర్యోదయం' స్నేహితం విజయాలు వీటి పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి.

5)సానుకూల అంశాలపై దృష్టి పెట్టండి.సవాళ్లు ఎదురైనప్పుడు అందులోని సాను కూలతలను కనుగొనడానికి ప్రయత్నించాలి. ఏమి తప్పు జరిగిందో అని ఆలోచించే బదులు అనుభవం నుండి మీరు ఏమి నేర్చుకోవచ్చు అది మీకు ఎలా సహాయపడుతుందనే దానిపై దృష్టి పెట్టండి.

6)సమస్యలను విస్మరించడ కాదు మంచి చెడులను అంగీకరించి సమతౌల్య దృక్పథాన్ని స్వీకరించాలి.

7)నిర్మాణాత్మక ఆలోచనలు మన ఆలోచనలు భావోద్వేగాలు సంతోషంపై గణనీయ ప్రభావాన్ని కలిగి ఉంటాయి .ప్రతికూలంగా ఆలోచనలు చేయడం మానండి. పరిస్థితిని అర్థం చేసుకోవడానికి మరింత సానుకూల స్థితిని వాస్తవికతను అలవాటు చేసుకోవాలి. ప్రతికూల ఆలోచనలను నిర్మాణాత్మక పరిష్కార ఆధారిత ఆలోచనలతో భర్తీ చేయడం వల్ల మానసిక స్థితి మరియు దృక్పథం మెరుగుపడుతుంది.


మహిళా సంఘాలు మాతృ సంఘాలు స్వచ్ఛంద సంస్థలు ధార్మిక సంస్థలు డ్వాక్రా గ్రూపులు పౌర సమాజం సమాజములో మెరుగైన సామాజిక సంబంధాల బలోపేతానికి కృషి చేయాలి.

అంతరిస్తున్న కుటుంబ వ్యవస్థ పునర్జీవనానికి సామాజిక ఉద్యమాన్ని ఉదృతం చేసి సంతోష సమాజ స్థాపన ద్వారా హింసా రహిత సమాజ స్థాపనకు ముందుకు రావాలి.

పురోగతి అంటే కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాదు మానవ శ్రేయస్సును పెంపొందించే సంతోషాన్ని సమాజంలో విస్తృత పరచాలి.ప్రతి క్షణాన్ని ఆనందమయం చేసుకోవడానికి అనువైన జీవనశైలిని అవలంబించాలి.

సర్వేజనా సుఖినోభవంతు అన్నట్లు సంతోషమే సంపూర్ణ సౌభాగ్యంగా మానవాళి తగు కార్యాచరణతో ముందుకు సాగాలి. సంతోషమే సంపూర్ణ బలం నినాదమే కాకుండ సమాజ జీవన విధానంగా వర్ధిల్లాలి.

**నేదునూరి కనకయ్య అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం కరీంనగర్9440245771**



**మనతెలుగు మనవెలుగు – మనపలుకు మనకులుకు**
**అమ్మభాష ఆంధ్రము చిమ్ముతుంది ప్రకాశము**
**అమ్మభాష మధురము చిందుతుంది మరందము**
**అమ్మభాష అమృతము నిలుస్తుంది కలకాలము**
**అమ్మభాష సుమము చల్లుతుంది సౌరభము**
**అమ్మభాష అందలము ఆరోహణము అవశ్యము**
**అమ్మభాష మార్గదర్శకము కనబరుస్తుంది మంచిపథము**
**అమ్మభాష పండినఫలము పదాలు పనసతొనలు**
**అమ్మభాష పఠనీయము ఇస్తుంది విజ్ఞానము**
**అమ్మభాష ప్రియము పెంచుతుంది బాంధవ్యము**
**అమ్మభాష సాధనము చేకూరుస్తుంది సౌభాగ్యము**
**అమ్మభాష భండారము వజ్రవైఢూర్యాలకు నిలయము**
**అమ్మభాష అమరము అమృతముతో సమానము**
**అమ్మభాష అమూల్యము గౌరవానికి ప్రతీకము**
**అమ్మభాష అజంతము పలుకుబడులకు ప్రాణము**
**అమ్మభాష సుజలము చక్కెర పానీయము**
**అమ్మభాష సౌమ్యము పదలాలిత్యానికి ప్రఖ్యాతము**
**అమ్మభాష పలుప్రక్రియలకుస్థానము అవధానాలకు ఆలవాలము**
**అమ్మభాష ఆదర్శము అందరికీ అనుసరణీయము**
**అమ్మభాషకు అంకితమవుదాం అమ్మను ఆరాధించుదాము**
**అమ్మకుజేజేలు పలుకుదాము అమ్మభాషను వ్యాపిద్దాము**

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం

## కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడు

## శోభన్ బాబు - మార్చి 20.. శోభన్ బాబు వర్ధంతి

తెలుగు సినీ చరిత్రలో శోభన్ బాబు ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయన తన అభినయంతో, అందమైన ముఖ కాంతితో, మధురమైన మాటలతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా, మంచితనానికి మారుపేరుగా కూడా ఆయనకు గుర్తింపు ఉంది. శోభన్ బాబు అసలు పేరు ఉప్పలపు శోభనాచలపతి రావు. ఆయన 1937 జనవరి 14న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా చిన నందిగామలో జన్మించారు. చిన్ననాటి నుంచి నటనపై ఆసక్తి ఉన్న శోభన్ బాబు, తన విద్యలోనూ ఉత్తమ ప్రతిభను కనబరిచారు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ లో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన, న్యాయవాదిగా పనిచేయాలని కలలు కన్నారు. అయితే సినిమా రంగంపై మక్కువ కారణంగా తన ప్రయాణాన్ని మారుస్తూ నటన రంగంలో అడుగు పెట్టారు. శోభన్ బాబు 1959లో "దైవ బలం" అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయితే ఆయనకు గుర్తింపు తెచ్చిన చిత్రం 1965లో వచ్చిన "మనుషులంతా ఒకటే". ఈ చిత్రం ద్వారా ఆయన తండ్రి పాత్రలు, ప్రేమిక పాత్రలు, కుటుంబ కథా చిత్రాలకు అనువైన నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. శోభన్ బాబు దాదాపు 200కి పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాల్లో ఆయన పాత్రలు సున్నితమైన భావోద్వేగాలను పండించాయి. ప్రేమ కథా



చిత్రాలు, సాంఘిక చిత్రాలు, పౌరాణిక పాత్రలు ఇలా అన్ని విధాలుగా ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. తన చిత్రాల్లో ఉన్న సహజత్వం, వినమ్రత, నిగర్వం ఆయన నటనకు ప్రత్యేకతను తెచ్చింది. ముఖ్యంగా "సోగ్గాడు", "మనవూరు పాండవులు", "కాలం మారింది", "జీవన తరంగాలు", వీరాభిమన్యు, "వాల్తేరు మొనగాడు" వంటి చిత్రాలు శోభన్ బాబును అగ్రహీరోగా నిలిపాయి. శోభన్ బాబు నిష్కల్మషమైన వ్యక్తిత్వానికి ప్రసిద్ధి. సినిమా రంగంలో ఉన్నప్పటికీ ఆయన ఎల్లప్పుడూ సాధారణ జీవన శైలిని అనుసరించారు. సహ నటులతో మంచి అనుబంధం కలిగి, నిరాడంబర వ్యక్తిగా గుర్తింపు పొందారు. సినిమాలకు సంబంధించిన వ్యవహారాలు పూర్తయిన తర్వాత ఎక్కువ సమయం తన కుటుంబానికి కేటాయించేవారు. సినిమా రంగానికి వీడ్కోలు చెప్పిన తరువాత తన జీవితాన్ని పూర్తిగా కుటుంబానికి, ఆధ్యాత్మికతకు అంకితం చేశారు. శోభన్ బాబు తన నటనకు అనేక అవార్డులు పొందారు. నంది అవార్డు ద్వారా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఉత్తమ నటుడిగా గుర్తింపు, ఉత్తమ నటుడిగా నాలుగుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకున్నారు. భారత ప్రభుత్వం ద్వారా సినీ రంగానికి చేసిన సేవలకు ఆయనకు గౌరవం లభించింది 2008 మార్చి 20న చెన్నైలో గుండెపోటుతో శోభన్ బాబు మరణించారు. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. శోభన్ బాబు చిత్రాలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఆయన చిత్రాలు కుటుంబ విలువలు, అనుబంధాలను ప్రతిబింబించే చిత్రాలుగా నిలిచాయి. శోభన్ బాబు తెలుగు చిత్రసీమకు విలువైన ఆభరణం. ఆయన నటన, సౌమ్యమైన వ్యక్తిత్వం, జీవన విధానం ప్రతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. శోభన్ బాబు వంటి నటుడు మళ్లీ పుట్టడం అరుదు. **రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# మార్చి 20...అంతర్జాతీయ సంతోష దినోత్సవం ... ఆనందానికి అంకితమైన దినం

ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ సంతోష దినోత్సవం జరుపు కుంటారు. ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తు చేస్తూ, ప్రజల శ్రేయస్సు కోసం ప్రపంచ దేశాలను చైతన్య పరచడం ప్రధాన ఉద్దేశంగా జరుపుకుంటారు. భూటాన్ దేశం, "స్థూల జాతీయ ఆనందం" అనే భావనను ముందుంచిన మొదటి దేశం. ఆ దేశం అభిప్రాయంతో ప్రేరితమై, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2012 జూన్ 28న తీర్మానం A/RES/66/281ను ఆమోదించింది. దీని ప్రకారం మార్చి 20ను అంతర్జాతీయ సంతోష దినోత్సవంగా ప్రకటించింది. 2013 నుండి ఈ దినోత్సవాన్ని అధికారికంగా జరుపు కుంటున్నారు. ఈ దినోత్సవం ప్రాముఖ్యతను ప్రజల్లో విస్తృతంగా చైతన్యపరిచేలా ప్రభుత్వాలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. సంతోషంకు సంబంధించి, ప్రపంచ దేశాలలో భారత దేశం అట్టడుగున 136 వ స్థానం లో ఉండటం శోచనీయం. మనకంటే మన పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ లో కూడా ప్రజలు మనకంటే సంతోషంగా జీవిస్తున్నట్లు రిపోర్ట్ పేర్కొంది. ఫిన్ ల్యాండ్, డెన్మార్క్, స్విట్జర్లాండ్, ఐస్లాండ్, నెథర్లాండ్స్ దేశాలు వరుసగా టాప్ 5 లో ఉన్నాయి. భారత్ వంటి అత్యదిక జనాభా ఉన్న దేశంలో అసమానతలు, పేదరికం కూడా ఎక్కువే.. 161 దేశాల లో మన దేశం అసమానతల సూచీ లో 123 లో ఉండటం ఇందుకు నిదర్శనం. మన దేశం లో 22% దేశ సంపద 1% మందిచేతుల్లో ఉంది. 10% సంపన్నుల దగ్గర దేశంలో నే 57% సంపద ఉంది. దిగువ న ఉన్న 50% మంది దగ్గర 13% సంపద ఉందంటే ధనిక పెదల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో తెలుస్తుంది. మనిషి స్వతహాగా అన్ని ఉన్నా సంతోషంగా గడపడం మరచిపోవడం, ఉరుకుల పరుగుల జీవితంలో సగటు నిత్యం పనిలో డబ్బు సంపాదన లో నిమగ్నం కావడం, సంతోషంగా కుటుంబంతో గడపక పోవడం ఇటీవల ఎక్కువైంది. మనకున్న కాలాన్ని వ్యర్థం చేసుకోకుండా.. ప్రతి క్షణాన్ని ఆనందమయం చేసుకునేందుకు ప్రయత్నించాలి. మనతో పాటు మన చుట్టూ పక్కల వారు కూడా ఆనందంగా ఉండేలా ప్రేరేపించాలి. సంతోషాన్ని ప్రాథమిక మానవ హక్కుగా గుర్తించాలి. ఆర్థిక అభివృద్ధితో పాటు మానసిక శ్రేయస్సు, సామాజిక సమానత, పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా కీలకమైన అంశాలుగా పరిగణించాలి. ప్రజల జీవితాల్లో ఆనందాన్ని పెంచే విధానాలపై దృష్టి పెట్టాలి. అన్ని వయస్సుల ప్రజలు ఈ కార్యక్రమంలో భాగమవ్వాలని ప్రోత్సహించాలి. అనేవి ప్రధాన లక్ష్యాలు.




2015లో ఐక్యరాజ్య సమితి ప్రారంభించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ప్రపంచ ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు కోసం కీలకపాత్ర పోషిస్తున్నాయి. వాటిలో ముఖ్యంగా: పేదరిక నిర్మూలన, అసమానతల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ ముఖ్యమైన అంశాలు. జేమ్ ఇలియన్ అనే వ్యక్తి "హ్యాపీటలిజం (%ఝజూజూమ్ఘశ్రీఱంఎ%)" అనే భావనను ప్రతిపాదించారు. ఇది ఆనందం, ప్రజాస్వామ్యం మరియు శ్రేయస్సును ఆధారంగా చేసుకున్న సమగ్ర అభివృద్ధి సిద్ధాంతం. ఆయన ఐక్యరాజ్య సమితిలో ప్రచారం చేస్తూ, ఈ దినోత్సవ స్థాపనకు ప్రేరణగా నిలిచారు. ఈ రోజున...కుటుంబం, స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపే కార్యక్రమాలు, సంతోషం పంచే సామాజిక సేవా కార్యక్రమాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో సంతోషాన్ని ప్రోత్సహించే ప్రచారాలు, విద్యార్థులకు, యువతకు సంతోష ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు జరుగుతాయి. సంతోషానికి మార్గాలు: ధన్యవాద భావనను అలవాటు చేసుకోవడం, సానుకూల ఆలోచనలు పెంపొందించు కోవడం, సహాయం చేయడం, సేవా దృక్పథం అవలంబించడం, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం బంధుత్వాలను మరింత బలపరచడం. సంతోషం అనేది వ్యక్తిగత స్థాయిలో ప్రారంభమై, కుటుంబం, సమాజం, దేశం వరకు వ్యాపించగల శక్తివంతమైన భావన. ఈ దినోత్సవం ద్వారా మనం సంతోషాన్ని మన జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, ఇతరులతో పంచుకోవాలని గుర్తించాలి. చిన్న విషయాల్లో ఆనందాన్ని వెతకడం, సానుకూలతను అలవడించడం ద్వారా మన సమాజం మరింత ఆరోగ్యకర మైనదిగా మారుతుంది.

**రామ కిష్టయ్య సంగనభట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# సౌత్ వర్సెస్ నార్త్.. బీజేపీ పాలిటిక్స్!

దేశంలో బీజేపీ రాజకీయ క్రీడకు తెరదీసింది. త్వరలోనే జమిలి ఎన్నికల బిల్లును ఆమోదించేందుకు రెడీ అయిన కేంద్ర ప్రభుత్వం.. దీనిని అమలు చేసే విషయంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మరీ ముఖ్యంగా.. డీ లిమిటేషన్ ప్రక్రియ బీజేపీకి కలిసి వస్తోంది. 2004 తర్వాత.. తొలిసారి మళ్లీ ఇప్పుడే డీలిమి టేషన్ ప్రక్రియ ప్రారంభమవుతోంది. అయితే.. జన గణన చేపట్టకుండానే ఈ ప్రక్రియను ప్రారంభించడం వివాదానికి దారి తీస్తోంది. ఇదేసమయంలో ఉత్తరాది రాష్ట్రాలైన యూపీ, బిహార్ వంటి పెద్ద రాష్ట్రాల్లో జనాభా నియంత్రణపై స్పష్టత లేదు. దీంతో అక్కడ జనాభా విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఇటు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ గట్టిగా చేపట్టారు. వివిధ సంక్షేమ పథకాలను జనాభా నియంత్రణకు ముడిపెట్టి.. అమలు చేశారు. దీంతో జనాభా గణనీయంగా తగ్గిపోయింది. ఇప్పుడు ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాలకు ప్రాణ సంకటంగా మారగా.. ఉత్తరాదిరాష్ట్రాలకు పార్లమెంటు సీట్లు పెరిగేందుకు దోహద పడింది. వాస్తవానికి జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాలను పెంచాలని అనుకుంటే.. 2021లో జరగాల్సిన జనగణను ఇప్పటి వరకు చేపట్టలేదు. అప్పట్లో కరోనా నేపథ్యంలో వాయిదా వేసిన కేంద్రం.. ఇప్పటి దాకా ఆ ఊసు ఎత్తలేదు. ఇక, ఇప్పుడు.. జన గణనకు ముందే పార్లమెంటు స్థానాల పెంపు, తగ్గింపు అంశం చర్చకు వచ్చింది. ఇదే.. ఇప్పుడు సౌత్ వర్సెస్ నార్త్గా తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుని అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అయితే.. దీనికి బీజేపీ, బీఆర్ ఎస్ నాయకులు డుమ్మా కొట్టారు. మరోవైపు ఈ నెల 22న తమిళనాడు ప్రభుత్వం కూడా డీలిమిటేషన్పై అంతర్రాష్ట్ర సమావేశం ఏర్పాటు చేసింది. అయితే.. ఇది కూడా అంత తేలికగా తేలే వ్యవహారం కాదు. మొత్తంగా దక్షిణాదిలో సీట్లు ఇప్పుడు ఉన్నవి తగ్గకపోయినా.. ఉత్తరాదిలో భారీగా పెరుగుతుండడమే బీజేపీకి కలిసి వస్తున్న అంశం. ప్రస్తుతం ఉత్తరాదిపై పట్టు సాధించిన బీజేపీ.. దక్షిణాదిలో మాత్రం కొంత బలహీనంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఉత్తరాదిపై దక్షిణాది రాష్ట్రాలు దుమారం రేపుతున్నాయి. ఇది ఎప్పటికి తేలుతుందో చూడాలి.

# విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్ - మార్చి 20... సైన్స్ పితామహుడు సర్ ఐజాక్ న్యూటన్ వర్ధంతి

అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు. మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వ శాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్కు దగ్గర్లో గల ఉల్తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వ విద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచే వారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్,



జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీలో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారు చేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, fluxions యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు %-% ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాల మీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధి పత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి. (1).మొదటి సూత్రము... "బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉ ంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2).రెండవ సూత్రము... "ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3).న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది. మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్ను "భౌతిక శాస్త్ర పితామహుడు" అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటి నుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు. తరువాత కూడా ఎన్నో మైలు రాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మార్చి 20...ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20వ తేదీని పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ కోసం ఈ దినోత్సవాన్ని నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా.. ఫ్రాన్స్కు చెందిన ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్, ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అంతరించి పోతున్న సహజ జీవవైవిధ్యం, జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి, వాటిని కాపాడు కోవడానికి ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్యోద్దేశం. ఒకప్పుడు సూర్యోదయానికి పూర్వమే, ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తూ, గూళ్ళల్లో నుండి బయటకు వచ్చి, కళ్లు తెరవగానే కనిపించే ముద్దులొలికే పిట్టల కిచకిచల ధ్వనులు నేడు కరువయ్యాయి. పిచ్చుకలు ఒకనాడు పంట చేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. నాడు గ్రామాల లోని ఇళ్ల ముంగిట ఇవి గుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం వంటి దృశ్యాలు సందడిగా చూడముచ్చటగా ఉండేవి. చెట్లపై కట్టుకున్న గూళ్లు చాలా అద్భుతంగా ఉండేవి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి విషయాలలో ఇవి మెత్తని పీచు వట్టి వాటితో గూడు కట్టడం, గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని తెచ్చి పిల్లలకు అందించటం, ఆ పిల్లలు రెక్కలొచ్చి ఎగిరెంత వరకు జాగ్రతగా కాపాడటం మనకు తరచూ కనిపించే దృశ్యాలు, ఈ దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయి. జీవన శైలిలో పెనువేగంగా వచ్చిన మార్పే 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'గా పరిణమించింది. పిచ్చుక జాతి అంతరించనుంది. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పళ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి. పిచ్చుకలు అంతరించి పోవడానికి కారణాలు. ఒకప్పుడు చైనాలో పిచ్చుకలంటే చీడ పురుగులుగా భావించే వారట. పంటలను నాశనం చేస్తున్నాయని, ఆహార ధాన్యాలను అధికంగా తినేస్తున్నాయనే అపోహతో చైనాలో పిచ్చుకల జాతిని నాశనం చేయడానికి నడుం బిగించి, తగిన చర్యలు తీసుకున్నారట. ఫలితంగా చైనాలో అతి తక్కువ సమయంలో పిచ్చుకలు మొత్తం నశించాయట. వాస్తవానికి పిచ్చుకల ఆహారం పంట పొలాలపై దాడి చేసే చిన్న చిన్న పురుగులు, క్రిమికీటకాలు. ఈ సంగతి గ్రహించని చైనీయులు వాటిని వినాశాన్ని కోరుకున్నారు. పిచ్చుకలు లేని కారణంగా పంటలకు మరింతగా పురుగుపట్టి 1958-61 మధ్య కాలంలో చైనా తీవ్రమైన ఆహార కొరతను అనుభవించిందట. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా ఉ ంచిందని చెపుతుంటారు. గతంలో ఊర పిచ్చుకలు పల్లెటూర్లల్లో విరివిగా వుండేవి. రైతులు పిచ్చుకల ఆహారం కొరకు వరి కంకులను గుత్తులుగా కట్టి ఇంటి చూరుకు వేలాడ దీసే వారు. రైతులు జొన్న, సజ్జ తదితర సంప్రదాయ పంటలను సాగు చేస్తుండేవారు. వాటిని తిని పక్షులు జీవించేవి. అయితే ప్రస్తుతం పత్తి తరహా వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపిస్తుడడంతో పిచ్చుకలకు ఆహారం కరువైంది. ప్రస్తుతం పంటలు లేక ఆహారం కరువై, పూరిళ్ళ స్థానంలో సిమెంట్ గృహాలు, ఇంకా అనేక కారణాల వలన పల్లెల్లో అవి కనబడడం లేదు. పిచ్చుకలో ఇంచుమించు 35 జాతులు ఉంటే, అవి కాలక్రమేణ కనుమరుగు అవుతున్నాయి. పిచ్చుకల ఉనికికి ఏర్పడుతున్న ప్రమాదాల నివారణకు ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం మార్చి 20 న ప్రపంచ పిచ్చుకల దినోత్సవమును నిర్వహిస్తున్నాయి. అందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా ఈ బిళ్లను కూడా విడుదల చేసింది. పర్యావరణాన్ని కాపాడే ఈ పిచ్చుకల జాతిని సంరక్షించుకు నేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పల్లెల్లో నివసించే వారు ఊరపిచ్చుకల గూళ్లు కనబడితే వాటిని జాగ్రత్తగా సంరక్షించు కోవాలి. కృత్రిమమైన పిచ్చుకగూళ్లను ఏర్పాటు చేయడం ద్వారా పిచ్చుక జాతిని కొంతవరకు సంరక్షించ వచ్చని శాస్త్రవేత్తల సలహా. పిచ్చుకల సంరక్షణను ప్రోత్సహించేందుకు ఎన్ఎఫ్ఎస్ సంస్థ పిచ్చుకల అవార్డులను కూడా అంద జేస్తున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అలనాటి పౌరాణిక చిత్ర రాజం...భూకైలాస్ సినిమాకు 67ఏళ్లు

తెలుగు చిత్ర సీమలో అజరామరంగా నిలిచిన అలనాటి మేటి పౌరాణిక చిత్రం భూ కైలాస్ మార్చి 20కి 67 వసంతాలు పూర్తి చేసుకుంది. నేటికీ అద్భుత చిత్ర రాజంగా తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయింది. ఎ.వి.ఎం. సంస్థ నిర్మించిన ఎన్నో ఆణి ముత్యాల్లో అజరామరంగా నిలిచి పోయిన పౌరాణిక చిత్రం 1958లో విడుదలైన 'భూకైలాస్. అలనాటి తెలుగు సినీ అగ్ర కథా నాయకులు అయిన ఎన్టీఆర్, ఏఎన్నార్, కథా నాయిక జమున, బి. సరోజా దేవి, ప్రతి నాయకుడు ఎస్వీ రంగారావు, వృద్ధ పాత్రల స్పెషలిస్ట్ హేమలతల మేలు కలయికతో నిర్మితమైన పౌరాణిక చిత్ర రాజం "న భూతో న భవిష్యతి"గా నిలిచింది. భూకైలాస్ కథను 1958లో అదే ఏ.వి.యం. సంస్థ తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నిర్మించింది. తెలుగు చిత్రంలో యన్.టి.రామారావు (రావణా సురుడు), అక్కినేని నాగేశ్వరరావు (నారదుడు), జమున (మండోదరి), ఎస్.వి.రంగారావు (మండోదరి తండ్రి), హేమలత (కైకేయి) ప్రధాన పాత్రలు పోషించగా కన్నడ చిత్రంలో రాజ్ కుమార్, కల్యాణ్ కుమార్, బి.సరోజాదేవి, నటించారు. కన్నడ చిత్ర రంగంలో నటుడు, దర్శకుడుగా వినుతి కెక్కిన ఆర్.నాగేంద్రరావు ఆ రోజుల్లో విజయ వంతంగా ప్రదర్శించిన నాటకం 'భూకైలాస్', దాని ఆధారంగా ఏ.వి.మెయ్యప్పన్ 1940లో తెలుగులో 'భూకైలాస్' చిత్రాన్ని నిర్మించారు. దానికి మరాఠీ కి చెందిన సుందర రావు నడకర్ణి దర్శకుడు, నిర్మాత తమిళుడు, నటీనటులు కన్నడకు చెందిన ఆర్.నాగేంద్రరావు, యం.వి. సుబ్బయ్య నాయుడు, లక్ష్మీబాయి ప్రధాన పాత్రధారులు. కథను అత్యంత రసవత్తరంగా తెరకు అనువదించారు దర్శకుడు కె.శంకర్. 1940 నాటి చిత్రానికి ఆర్.సుదర్శనం, ఆయనతో బాటు ఆర్.గోవర్ధనం కూడా కలిసి సంగీతాన్ని అందించారు. రావణుని కాలం నాటి సెట్స్ ను అందంగా తెరపై ఆవిష్కరించిన ఘనత కెమెరామన్ మాధవ్ కే దక్కుతుంది. 1958 నాటి రెండవ సినిమాలో రావణా సురుడుగా ఎన్.టి.రామారావుబీ నారదుడుగా అక్కినేని నాగేశ్వర రావుబీ మండోదరిగా జమునబీ మయా సురుడు (మండోదరి తండ్రి)గా ఎస్.వి.రంగారావు కేకసి (రావణుని తల్లి)గా హేమ లతబీ పరమ శివుడుగా నాగ భూషణంబీ పార్వతీ దేవిగా బి.సరోజాదేవిబీ అద్భుత నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. సముద్రాల రాఘవాచార్య కథ, గీత, సంభాషణా రచయితగా చేసిన కృషి ఆయన ప్రతిభకు పరాకాష్టగా నిలిచింది. 'రాముని అవతారం రఘుకుల సోముని అవతారం' అనే ఒక్క పాట తార్కాణంగా నిలుస్తుంది. ఈ పాటలో రాముని అవతార వైశిష్ట్యాన్ని చూపించారు. 'దేవదేవ ధవళాచల మందిర', 'జయజయ మహాదేవా', 'తగునా వరమీయా ఈ నీతి దూరునకు..' వంటి పాటలు ఘంటసాల వెంకటేశ్వర రావు గళంలో జీవం పోసు కున్నాయి. 'సుందరాంగా అందుకోరా', 'మున్నీట పవళించు నాగశయనా' వంటి పాటలు కూడా




ఆణి ముత్యాలే. ఆర్.సుదర్శనం, ఆర్.గోవర్ధనం కలసి ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఈ చిత్రాన్ని మరపురాని మనోజ్ఞ దృశ్య కావ్యంగా మలచిన ఘనత దర్శకుడు కె.శంకర్కు దక్కుతుంది. 'భూకైలాస్' చిత్ర నిర్మాణం జరుగు తున్న సమయం లోనే ఎన్టీఆర్ కుమారుడు హరికృష్ణ పుట్టువు నొందడం గుర్తుండే విషయం. సుందరాంగా అందుకోరా పాటలో అప్సరసగా ప్రత్యేక పాత్రలో హిందీ చలన చిత్ర తార హెలెన్ నృత్య ప్రదర్శన చేసింది. యన్.టి. రామారావుకు అభిమానం పెంచిన మొదటి చిత్రంగా 'భూకైలాస్'ను పేర్కొనాలి. 20.3.1958న విడుద లైన ఈ చిత్రం ఉన్నత ప్రమాణా లతో కూడిన పౌరాణిక చిత్రంగా ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా రావణ బ్రహ్మ పాత్ర లో ఒదిగి పోయిన ఎన్టీయార్ ప్రతి నాయకునిగా విశేష ప్రజాదరణ పొంది, రావణుడు అంటే ఇలా ఉంటాడని ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకుని, అభిమాన నటుడినిగా మారింది ఈ చిత్రం తోనే అనేది నూటికి నూరు పాళ్ళు నిజం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నీటి వృధా నేరం.. చెల్లించాలి మూల్యం

సూర్యాపేట : పురపాలక చట్టం ప్రకారం వార్డుల్లో తనిఖీ చేసే సమయంలో నల్లా నీటిని ఇతరాలకు వాడినట్లు గుర్తిస్తే రూ.500లకు పైగా జరిమానా విధిస్తారు. నిత్యం ఈ తరహా నేరానికి పాల్పడితే నీటి చౌర్యం, ఉద్దేశపూర్వకంగా ఆస్తుల ధ్వంసం వంటి నేరాల కింద కేసులు నమోదు చేస్తారు.

పురపాలికల్లో నీటి వృథాకు పాల్పడితే పుర అధికారులు జరిమానా విధించే అధికారం ఉంది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నల్లా కనెక్షన్ తీసుకున్నవారు గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలి. ఇతరాలకు వాడి వృథా చేస్తే, తనిఖీలో బయటపడితే జరిమానా విధించే హక్కు సంబంధిత అధికారులకు ఉంది.

ఈ నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు 2020లో పురపాలకశాఖ 231 ఉత్తర్వు జారీ చేసింది.



**బాధ్యత పెంపునకే..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలున్నాయి. ఇక్కడ నీటి వృథాను అరికట్టడం లేదు. నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడిన సమయంలో రాజకీయ నాయకుల అండతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. నామమాత్రంగా జరిమానాలు వేసి వదిలేస్తున్నారు. ఇలాంటి వారికి 2019 చట్టంతో కఠినమైన చర్యలు తీసుకొనే అధికారం పుర అధికారులకు ఉంటుంది. ఇప్పటివరకు ఏ పురపాలికలోనూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నీటి ఎద్దడి తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెంచాలని చట్టం అమలుకు రాష్ట్ర పురపాలక శాఖ చర్యలు తీసుకుంటుంది. వేసవి నుంచి పట్టణ ప్రజలను గట్టెక్కించాలంటే ఇలాంటి చర్యలు తప్పవు. వీటిని పుర సిబ్బంది కఠినంగా అమలు చేస్తే ఎక్కడా ఒక్క నీటిచుక్క కూడా వృథా కాదు.

**తనిఖీలు చేస్తాం(శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట)** వేసవి దృష్ట్యా నీటి వృథాను అరికట్టేందుకు సిబ్బందితో వార్డుల్లో తనిఖీలు చేపడతాం. వృథా చేస్తూ పట్టుబడితే పుర చట్టం ప్రకారం జరిమానా విధిస్తాం. నీటి వృథాను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలి.

# తడారితేనే కోత.. రైతుకు చేయూత

భువనగిరి: వరి ధాన్యం నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. వరి కోతకు వచ్చి పూర్తిగా తడి ఆరాకే కోతలు మొదలు పెడితే గింజ ఎదిగి తాలు, నూక శాతం తగ్గుతుందన్న ఉద్దేశంతో ముందస్తు కోతలు చేపట్టకుండా వరికోత మిషన్ల యజమానులు, డ్రైవర్లు, ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.హనుమంతరావు సూచనలతో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వీరారెడ్డి ఈ నెల 18న భువనగిరిలో జిల్లా స్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటుకు నిర్ణయించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలను కూడా సదస్సుకు పిలుస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా రైతులందరూ వరికోత యంత్రాలపైనే ఆధారపడ్డారు. జిల్లాలో యంత్రాలు 60 వరకు ఉన్నాయి. కోతలు పుంజుకున్న



సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో జిల్లాకు వస్తుంటాయి. సాధారణంగా యాసంగి సీజన్లో 120 నుంచి 135 రోజులకు వరి కోతకు వస్తుంది. వరి కోత దశకు వచ్చాక పది రోజులు తడి ఆరాల్సి ఉంటుంది. వర్షాల ప్రభావం, ఇతర కారణాలతో కొందరు రైతులు తడి ఉన్న సమయంలోనే మిషన్లతో కోతలు నిర్వహిస్తున్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాల(ఎఫ్ఏక్యూ)పై ప్రభావం చూపి తాలు, తేమ, మట్టి అధికంగా వస్తుంది. మరాడించినప్పుడు నూకలు కూడా ఎక్కువగా వస్తున్నాయని అధికారులు దృష్టికి వచ్చింది.

**సూచనలు ఇలా..**

యంత్రం బెల్ట్లను గట్టిగా బిగించాలి.అప్పుడే పైరు కింది స్థాయి వరకు కోస్తుంది. మిషన్ ఆర్పీఎం 18 నుంచి 25 ఉండాలి. ఇలా చేస్తే తాలు, మట్టి శాతం చాలా వరకు తగ్గుతుంది. పోచంపల్లి, వలిగొండ, మోత్కూరు, రామన్నపేట మండలాల్లో వరి కోతలు ముందుగా ప్రారంభిస్తారు. అక్కడే యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నది అధికారుల లక్ష్యం.నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకుజి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్(రెవెన్యూ), యాదాద్రి భువనగిరి

ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పెంచడంతో పాటు రైతులకు కనీస మద్దతు ధర పొందేలా వరికోత యంత్రాల యజమానులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశాం. కోత దశకు రాకముందే కోతలు చేపట్టొద్దని ఆదేశిస్తాం.

# పారిశ్రామిక కేంద్రం... కరవైన ఆహ్లాదం



గోదావరిఖని : పరిశ్రమల కేంద్రంగా పేరుపొందిన రామగుండం ప్రాంతంలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. వివిధ పరిశ్రమల ఉద్యోగుల కాలనీల్లో ఆయా యజమాన్యాలు అత్యాధునిక ఉద్యానవనాలు, కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. కానీ నగరంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం ఆహ్లాదం మచ్చుకు కనబడటం లేదు. వివిధ కాలనీల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసిన అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. కొన్నింటిని ప్రహరీలకే పరిమితం చేశారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను ఆధునికీకరిస్తూ మినీ ట్యాంకుబండ్లుగా రూపుదిద్దిన ప్రభుత్వం.. రామగుండం ప్రాంతంలోని ఏకైక చెరువు అభివృద్ధిని అర్ధాంతరంగా వదిలేసింది. బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం కోసం నగరంలోని మొదటి సీనియర్ సిటీజన్ పార్కును తొలగించగా.. భవనాన్ని అసంపూర్తిగానే నిలిపివేశారు.

**నిధులు తగ్గించారు... నిర్మాణం మరిచారు**

మిషన్ కాకతీయ-2లో భాగంగా చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 1.92 కోట్ల అంచనాతో గోదావరిఖనిలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న మల్కాపూర్ చెరువుపై మినీ ట్యాంకుబండ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో నిధులను రూ. 1.01 కోట్లకు కుదించి టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించారు. 2017 ఫిబ్రవరి 4న పనులకు శంకుస్థాపన చేయగా చెరువు తూము, ఓ వైపు కట్ట మరమ్మతులు, బతుకమ్మ ఘాట్, పూడిక తీత పనులు పూర్తిచేశారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కట్టకు ఇరువైపులా తుమ్మలు పెరిగాయి. చీకటి పడిందంటే చాలు మందుబాబులకు అడ్డాగా మారుతోంది.చెరువు మత్తడి నుంచి మొదలకొని కట్టపై మీదుగా శిఖం పక్కనుంచి తిరిగి మత్తడి వరకు చుట్టూ వాకింగ్, సైక్లింగ్ కోసం ప్రత్యేకంగా ట్రాక్, గ్రిల్స్‌తో పాటు కంకర రోడ్డు నిర్మించాల్సి ఉంది. కానీ కేవలం ఒక వైపు మాత్రమే కట్టపై మట్టి పనులు పూర్తిచేశారు. మరో వైపు కనీసం రహదారి పనులు కూడా మొదలుకాలేదు. చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దాలంటే సుమారుగా మరో రూ. 2.5 కోట్లు అవసరం అనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. సిద్దిపేట కోమటి చెరువు, పెద్దపల్లి చెరువు తరహాలో మల్కాపూర్ చెరువును అభివృద్ధి చేసేలా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దేవదేవా..వసతులు కల్పించరా?




కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దేవాలయాల కార్యనిర్వహణ బాధ్యతలు చూసే కార్యాలయం వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. ఇదివరకు కరీంనగర్ కోర్టు చౌరస్తాలో ఉన్న శ్రీరాజరాజేశ్వర కల్యాణ మండప పైఅంతస్తులో కొనసాగింది. రూ.6 వేలు కిరాయి చెల్లించేవారు. వర్షాలు కురిసినప్పుడు పైకప్పు లీకేజీతో ఇబ్బందిగా ఉండేది. ఈ పరిస్థితుల్లో రూ. 14 వేల కిరాయితో ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపాన్నే సహాయ కమిషనర్ కార్యాలయంగా మార్చారు.

**దాతలు ముందుకొచ్చినా..**

కార్యాలయంలో వసతులు కల్పించడానికి కామన్ గుడ్ ఫండ్ వడ్డీలో నుంచి కొంత ఖర్చు చేశారు. సిమెంట్, గ్రానైట్, ఇసుకకు సంబంధించి దాతల సహకారంతో ఎట్టకేలకు ఒక రూపంలోకి తీసుకొచ్చారు. అయినా వసతులు కల్పించాల్సిన అవసరముంది. క్యాబిన్‌లు ఏర్పాటు చేసి శాఖ పుస్తకాలు, కాగితాలు భద్రపరిచేందుకు నిర్మాణాలు జరగాలి. కోర్టు నుంచి మంచిర్యాల చౌరస్తాకు వెళ్లే దారిలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయముంటుంది. ఇక్కడి నుంచి దేవాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లేందుకు వీలుపడదు. ఇందుకు మంచిర్యాల చౌరస్తా నుంచి చొప్పదండి రోడ్డులో ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది.

కార్యాలయ భద్రత విషయంలో.. ఇక్కడి పరిసరాలు చూస్తే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్కనే ఖాళీ స్థలం ఉండటం.. రాత్రి వేళలో ఆలయంలో ఎవరూ ఉండే పరిస్థితి లేదు. కార్యాలయంలో ఏ, బీ, సీ, డీ విభాగాలకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇవన్నీ హాలులోనే ఉన్నాయి. ప్రతి విభాగానికి కంప్యూటర్ అవసరముంది. అలాగే సీసీ కెమెరాలు అమర్చాల్సి ఉంది.

వేములవాడ, కొండగట్టు, ధర్మపురిలాంటి దేవస్థానాల నుంచి రూ. 5 లక్షల చొప్పున కేటాయించినా నిధుల సమస్యే ఉండదని ఆ శాఖకు చెందిన కొందరు అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం- సుప్రియ, జిల్లా సహాయ కమిషనర్

కార్యాలయంలో వసతుల కల్పనకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వారి ఆదేశానుసారం నడుచుకుంటాం.

# సహకారం.. తిరోగమనం




నల్గొండ : ప్రభుత్వం రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఏర్పాటు చేసింది. ఇవి పటిష్ఠంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి ఆరేళ్లకోసారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని సహకార సంఘాలు లాభాలు గడించగా మరికొన్ని దెబ్బతింటున్నాయని 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికలు చెబుతున్నాయి.

**ఇలా చేస్తే నయం..** ప్రాథమిక సహకార సంఘాలపై అధికారుల పర్యవేక్షణ పెరగాలి.నష్టాల్లో నుంచి గట్టేక్కేందుకు ఉన్న మార్గాలపై సంఘాల్లో అవగాహన పెంపొందించాలి.ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాల ఏర్పాటు చేసేందుకు అన్ని సంఘాలు ముందుకు రావాలి.రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా జరుగుతుందా లేదా అనేది పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఉండాలి.కారణాలు అనేకంసహకార సంఘాల్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటోంది. రుణాలు ఇప్పించే సమయంలో ఉన్న శ్రద్ధ తిరిగి చెల్లించే విషయంలో నేతలు చూపడం లేదు. పాలకవర్గ సభ్యులే రుణాలు తీసుకొని తిరిగి చెల్లించడం లేదు.పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు, విత్తనాలు, ఎరువులు ద్వారా లాభాలు ఆర్జించడమే కాకుండా సంఘంలోని సభ్యులందరికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. కొన్ని సంఘాలు మాత్రమే ఆ దిశగా ముందుకు సాగుతున్నాయి.కొందరు సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోవడం కూడా మరో కారణం. పీఏసీఎస్ సిబ్బందికి బదిలీలు లేకపోవడం వల్ల ఒకే చోట ఏళ్ల తరబడి ఉండటం కూడా ఓ కారణమని అధికారులు చెబుతున్నారు.రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో నష్టాల బాటలో ఉన్న సొసైటీల ను అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని జిల్లా సహకార అధికారి పత్యానాయక్‌తో తెలిపారు.

# ఇన్‌ఛార్జిలతో ఇంకెన్నాళ్లు!

భువనగిరి : ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరకులు అందజేస్తున్నా దాదాపు దశాబ్దన్నర కాలంగా ఖాళీలైన డీలర్ల నియామకాలు మాత్రం చేపట్టడంలేదు. పునర్ వ్యవస్థీకరణలో ఏర్పడిన కొత్త దుకాణాలకు కూడా సంవత్సరాల తరబడి డీలర్లు లేకుండా ఇన్‌ఛార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. పొరుగు గ్రామాల్లో ఉన్న డీలర్లకే బాధ్యతలు అప్పగించడంతో దుకాణం ఎప్పుడు తెరుస్తారో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.జిల్లా వ్యాప్తంగా 515 రేషన్ దుకాణాలు ఉండగా 90 ఖాళీలు ఉన్నాయి. డీలర్లను నియమించాలని ప్రజావాణిలో గ్రామస్థులు పలుమార్లు విన్నవించుకుంటున్నా వారి మొరను ఆలకించడం లేదు. గతంలో జరిగిన మండల పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేసి జిల్లా అధికారులకు పంపినా ఎలాంటి స్పందన లేదు. ఖాళీలను భర్తీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉన్నప్పటికీ దశాబ్దన్నరం కాలంగా వారు ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని రేషన్‌కార్డు లబ్ధిదారులు



వాపోతున్నారు. 2022 ఫిబ్రవరిలో జిల్లా వ్యాప్తంగా 34 కొత్త షాపులు ఏర్పాటు చేశారు. పొరుగు గ్రామాల డీలర్లకే అదనపు బాధ్యతలు ఇచ్చి కొనసాగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త డీలర్లను నియమించాల్సిన అవసరం ఉంది.త్వరలో నియామకాలు వీరారెడ్డి, అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా

జిల్లాలో రేషన్‌డీలర్ల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం. డీలర్లకు గిట్టుబాటు అయ్యే చోట ఖాళీలను భర్తీ చేస్తాం.

రేషన్ దుకాణాలు: 515

ఖాళీలు: 56, కొత్తవి : 34

# నైపుణ్య వృద్ధి.. ఉపాధి సిద్ధి

సంగారెడ్డి : పోటీ ప్రపంచమిది.. ప్రతిభ చూపితేనే ఉపాధి అవకాశాలు సొంతమవుతాయి. యువత నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)లను ఏర్పాటు చేసినప్పటికీ.. ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కోర్సు పూర్తి చేసినా.. నైపుణ్యాల లేమితో చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేక పోతున్నారు. కొందరికి అవకాశాలు దక్కినా.. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్(ఏటీసీ)ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాకు ప్రయోజనం చేకూరనుంది.

**ఆ మూడు నియోజకవర్గాల్లో..**

జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వ పరంగా మూడు ఐటీఐ కళాశాలలు మాత్రమే ఉండటం గమనార్హం. ఈ మూడింటిలో ఒకటి హత్నూర మండల కేంద్రంలో ఉంది. హత్నూర మండలం సంగారెడ్డి జిల్లాలోనే ఉన్నప్పటికీ.. అది మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. ఈ రకంగా చూస్తే జిల్లాలో రెండు నియోజకవర్గాల్లోనే ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఇవి ఉండగా.. వాటి ఆవరణలో ఏటీసీ కోర్సులను ప్రారంభించారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో లేకపోడంతో విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో ఆ మూడు నియోజకవర్గాల్లోని విద్యార్థుల ఆశలు చిగురించాయి. జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో పాటు బీహెచ్‌ఈఎల్, ఓడీఎఫ్, బీడీఎల్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమలు ఉండటం ఇక్కడి విద్యార్థులకు కలిసివచ్చే అంశం.

**ఇవీ కోర్సులు**

పరిశ్రమలచ్లి కొత్త యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ఏటీసీల్లో కోర్సులను ఇందుకు అనుగుణంగా ఎంపిక చేశారు. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో ఐటీఐ కళాశాలలు: 18

ఇందులో ప్రైవేటువి: 15

ప్రభుత్వ..: 3

విద్యార్థులు: 1,500

విద్యార్థులకు సదవకాశం

ఏటీసీలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు కల్పిస్తారు. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఆధునిక యంత్రాల వినియోగంపై శిక్షణతో సత్ఫలితాలు ఉంటాయి. కొత్త ఏటీసీల ఏర్పాటుపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది.

ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి.

# వనిత.. చేనేత

సిద్దిపేట: మహిళలు అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్వయం సమృద్ధి సాధనకు అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆర్థిక పరిపుష్టితో కుటుంబ బాధ్యతల్లో భాగస్వాములయ్యేందుకు శ్రమిస్తున్నారు. ఈ తరుణంలోనే చేనేత, జౌళి శాఖ నేతృత్వంలో ఫిక్కి (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) మహిళా విభాగం సహకారంతో చేనేత ఆధునికీకరణపై అందిస్తున్న తర్ఫీదును వినియోగించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గత జనవరి 30న ప్రారంభం కాగా, ముగింపు దశకు చేరింది.45 రోజుల శిక్షణ యాంత్రీకరణ ప్రభావం, మారుతున్న పరిస్థితులు, తగ్గుతున్న ఆదరణతో చేనేత రంగం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. గిట్టుబాటు లభించని పరిస్థితుల్లో ప్రస్తుత తరం చేనేత వృత్తి చేపట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ తరుణంలో మహిళలను ప్రోత్సహించడం ద్వారా అటు కార్మికుల సంఖ్య పెంపు, ఇట ఉపాధి కల్పన సాధ్యమన్న ఉద్దేశంతో చేనేత, జౌళి శాఖ వివిధ దశల్లో శిక్షణ అందిస్తోంది. ఈ నేపథ్యంలో సిద్దిపేటలోని ఇర్కోడు చేనేత సహకార సంఘంలో 45 రోజుల పాటు తర్ఫీదు కార్యక్రమం చేపట్టారు. గొల్లభామ, ముత్యంపేట, పటోళ చీరల తయారీని మూడు మగ్గాలపై శిక్షకుడి ద్వారా ఔపోసన పట్టిస్తున్నారు. ఆకృతుల తయారీ, నేసే విధానంపై వివరిస్తున్నారు. ఇప్పటికే ఈ రంగంపై అవగాహన ఉన్న 10 మంది మహిళలను ఎంపిక చేయగా నిత్యం హాజరవుతున్నారు. వీరిలో 40 ఏళ్లలోపు వయసు ఉన్న వారు ఉన్నారు. రోజుకు రూ. 300 చొప్పున భృతి చెల్లిస్తున్నారు. నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ సాగుతోంది.సంస్థల ద్వారా ప్రోత్సాహం..ఇన్నాళ్లు సదరు మహిళలు ఇర్కోడు సొసైటీ వద్ద పాఠశాలలకు సంబంధించిన ఏకరూప దుస్తులు తయారీ చేశారు.

చురకలు




# తలకెక్కించుకోవడం లే..!

నల్గొండ: జిల్లాలో సగటున కుటుంబంలో నలుగురు ఉంటే మూడు వరకు ద్విచక్ర వాహనాలు ఉన్న వారు 70 నుంచి 80 శాతం మంది ఉన్నట్లు ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. అధిక స్పీడు కలిగినవి (రూ.3 లక్షల విలువ చేసేవి) కొనుగోలు చేసేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. సొంత ఇల్లు లేని కుటుంబాల్లో సైతం 70 శాతం ద్విచక్రవాహనాలు ఉన్నట్లు సర్వే నివేదిక చెబుతుంది. ఇటీవల వివిధ రకాల విద్యుత్ వాహనాలు సైతం తక్కువ ధరల్లో అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఫలితంగా ట్రాఫిక్ అంతరాయంతో పాటు రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

**పదికి పైనే ప్రమాదాలు..**

జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో పదిలో ఆరు వరకు ద్విచక్ర వాహనాల ఘటనలే ఉంటున్నాయి. అర్హత లేనివారు డ్రైవింగ్ చేయడం, శిరస్త్రాణం ధరించకపోవడం, మద్యం తాగి నడపడంతో పాటు అధిక స్పీడు కారణంగా నిత్యం జిల్లాలో పదికి పైగా ప్రమాదాలు



జరుగుతున్నాయి. ఇద్దరు నుంచి ముగ్గురు మృత్యువాత పడుతుండగా ఎనిమిది మంది వరకు క్షతగాత్రులుగా మారుతున్నారు. వీరిలో 60 నుంచి 65 శాతం మంది 35-40 ఏళ్లలోపు యువకులే ఉంటున్నారు. తర్వాతి స్థానంలో మద్యం తాగి వేగంగా వాహనాలు నడిపేవారు ఉంటున్నారు. ప్రమాద ఘటనల్లో 5-10 శాతం వరకు పోలీస్‌స్టేషన్‌లో కేసుల వరకు వెళ్లకుండా స్థానిక పెద్దల సమక్షంలోనే నష్టపరిహారం చెల్లిస్తూ రాజీ కుదుర్చుకుంటున్నారు.

**చర్యలు తీసుకుంటున్నాం: శరత్‌చంద్ర పవార్, జిల్లా ఎస్పీ**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సమన్వయ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రమాదగుంతలు గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నాం. సీసీ కెమెరాలు, జీబ్రాగీతలు, రేడియం స్టిక్కర్లు, నామఫలకలతో పాటు అవసరం ఉన్న చోట స్పీడ్ బ్రేకర్లు, రింబర్స్ ఏర్పాటు చేస్తున్నాం. వాహన తనిఖీలతో పాటు జైలు, జరిమానాలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం.

# పల్లెల గొంతెండుతోంది

మంథని : మంథనిలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరందక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తగినంత సరఫరా కాకపోవడంతో గ్రామాల్లో బోర్లకు మోటార్లు బిగించుకొని నీటిని వినియోగించుకుంటున్నారు. మండలంలోని మైదుపల్లి, ఉప్పట్ల, వెంకటాపూర్, అడవిసోమన్‌పల్లి గ్రామాలకు భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో బోర్లకు మోటార్లు బిగించుకొని నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మంథని, ఎగ్లాస్‌పూర్, సూరయ్యపల్లి, గుంజపడుగు గ్రామాల్లో నీటిని అదనంగా వినియోగిస్తున్నట్లు తెలిసింది.

**మానేరు నుంచి పైపులైను..**మంథనిలోని మైదుపల్లిలో నాలుగు బోర్లకు మోటార్లు బిగించుకున్నారు. 4వ వార్డులో మోటారు చెడిపోయి రెండు నెలలవుతున్నా.. మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు దూర



ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఉప్పట్లలో మూడు బోర్లకు మోటార్లు బిగించుకున్నారు. వెంకటాపూర్‌లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో మానేరునుంచి పైపులైన్ ద్వారా ట్యాంకులోకి ఎక్కించి వినియోగించుకుంటున్నారు. ఆ నీరు కూడ సరిపోక ఆరు బోర్లకు మోటార్లు బిగించారు.

**పది బోర్లకు మోటార్లు..**అడవిసోమన్‌పల్లిలో పది బోర్లకు మోటార్లు బిగించి నీటిని వినియోగిం చు కుంటున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ కింద ఇచ్చిన నీటి కనెక్షన్లకు బిరడాలు బిగించకపోవడంతో నీరంతా వృథా అవుతుంది. అధికంగా నీటిని వినియోగించుకుంటున్న మంథని, ఎగ్గాస్‌పూర్, సూరయ్యపల్లి, గుంజపడుగు గ్రామాల గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని మిషన్ భగీరథ డీఈఈ కిరణ్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి నీటి కనెక్షన్లకు బిరడాలు బిగించే పనులు చేస్తున్నారు. నీరు వృథా కాకుండా అరికడితే అన్ని గ్రామాలకు సరిపడా భగీరథ నీరు సరఫరా అవుతుందని డీఈ తెలిపారు.

# సరఫరా తక్కువ.. బిల్లు ఎక్కువ

హైదరాబాద్: జలమండలికి అత్యధిక ఆదాయాన్ని అందించే నీటి కనెక్షన్లకు సంబంధించిన మీటర్లపై యంత్రాంగం పటిష్ఠ విధానం రూపొందిస్తోంది. నగరంలో 13.5 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నా.. 80 శాతం ఆదాయం 72 వేల కనెక్షన్ల నుంచి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల రాబడులను సమీక్షించిన ఉన్నతాధికారులు వినియోగానికి సంబంధించి మీటర్ రీడింగ్‌వివరాలు పక్కాగా అందడం లేదని గుర్తించారు. ఇందులో 12 వేలు ఆటోమేటిక్ మీటర్లు, 12 వేలు బల్క్ మీటర్లు, 48వేలు 15ఎంఎం కమర్షియల్ మీటర్లు ఉన్నాయి.

**సగటు ఆధారంగా బిల్లుల జారీ**ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) మీటర్లు భారీ పరిమాణంలో నీటిని సరఫరా చేస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలకు సరఫరా చేసే ఈ బల్క్ మీటర్ల రీడింగ్‌లను జలమండలి కార్యాలయం నుంచే గుర్తించేలా విధానం ఉంది. ఇవి పూర్తిగా పని చేయని పరిస్థితి. మరోవైపు పని చేస్తున్న మీటర్ల నుంచి రీడింగ్ వివరాలు అందడం లేదు. దీంతో సగటు వినియోగం ఆధారంగా బిల్లులను జారీచేస్తున్నారు. ఈ కారణంగా సరఫరా తక్కువగా ఉన్నా.. ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు కూడా వినియోగం మేరకు రాబడి రావడం లేదని చెబుతున్నారు. దీనిపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మీటర్ల విధానంపై అధికారులతో ఇటీవల సమీక్షించారు. త్వరలో జలమండలి రాబడికి నష్టం లేకుండా, అపోహలకు తావులేకుండా పటిష్ఠ మీటరింగ్ విధానం అందుబాటులోకి తీసుకొస్తామని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# ఆకాశాన్నంటింది..' అందుకే ఎగిరొస్తోంది



హైదరాబాద్ : రోజురోజుకు పసిడి ధర పెరుగుతోంది. భవిష్యత్తులో ఇంకెంతకు చేరుతుందో అంచనా వేయటం సవాల్‌గా మారింది. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు స్మగ్లర్లు సిద్ధమయ్యారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత, మధ్యవయస్కులను లక్ష్యంగా చేసుకొని పావులు కదుపుతున్నారు. గల్ఫ్‌దేశాల నుంచి నగరానికి పెద్దఎత్తున బంగారం స్మగ్లింగ్ జరుగుతోంది. ఏజెంట్లుగా పనిచేసిన వారికి కమీషన్ ఇచ్చి దొంగ బంగారం అధిక ధరకు విక్రయిస్తుంటారనేది బహిరంగ రహస్యం. మామూళ్లకు అలవాటుపడిన కొందరు అధికారులు స్మగ్లర్లకు సహకరిస్తుంటారనే ఆరోపణలున్నాయి.

నగర శివారున ఉండే ఆటోడ్రైవర్. కొద్దిరోజుల క్రితం ఏజెంట్ సాయంతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేశాడు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన పోలీసులు ఆరా తీసినపుడు అసలు విషయం గుర్తించారు. తాను చెప్పిన ప్రాంతానికి వెళ్లి.. అట్నుంచి ప్యాకెట్ తీసుకొచ్చి ఇస్తే ప్రయాణ ఖర్చులు, కమీషన్ ఇస్తానని ఆటోడ్రైవర్‌కు ఆశచూపినట్టు తేలిందని పోలీసు అధికారి ఒకరు తెలిపారు.


**ఇప్పుడేం జరుగుతోందంటే..**

శంషాబాద్ విమానాశ్రయంలో ఏటా రూ.కోట్ల విలువైన బంగారం పట్టుబడుతుంది. తీసుకొచ్చిన వారిని ప్రశ్నిస్తే తమకేం తెలియదంటూ సమాధానమిస్తుంటారు. నగరంలోని దళారులకు గల్ఫ్‌దేశాల్లోని ట్రావెల్ ఏజెంట్లతో పరిచయాలున్నాయి. దీంతో దుబాయ్‌లో తక్కువ ధరకు పసిడి కొనుగోలు చేసి ఇక్కడకు తరలిస్తుంటారు. ఇందుకు అవసరమైన ఏజెంట్లను స్థానిక దళారులు ఎంపిక చేసుకుంటారు. విదేశాలకు వెళ్లొచ్చేందుకు ప్రయాణ ఖర్చులు, రోజుకు రూ.2-3వేలు, సురక్షితంగా బంగారం తీసుకొస్తే రూ.10-50వేల వరకూ కమీషన్ ఇస్తామని ఎర వేస్తారు. ఏజెంట్లుగా మారే వారిలో ఆటోడ్రైవర్లు, చిరువ్యాపారులు, కూలీలు, యువకులు అధికశాతం ఉంటారని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

**తనిఖీలు తప్పించి..**

హైదరాబాద్ నుంచి విమానంలో గల్ఫ్‌దేశాలకు పంపించి.. ఏజెంట్ల వివరాలను అక్కడి ట్రావెల్ ఏజెంట్లకు పంపుతారు. అక్కడి ముఠా తాము సేకరించిన బంగారాన్ని వివిధ రూపాల్లోకి మార్చి ఏజెంట్లకు ఇస్తారు. అక్కడి విమానాశ్రయాల్లో తనిఖీల నుంచి తప్పించి విమానం ఎక్కిస్తారు. ఇక్కడి ఎయిర్‌పోర్టు సమీపంలో దళారుల ముఠా ఏజెంట్ల నుంచి పసిడి స్వాధీనం చేసుకొని కమీషన్ ఇచ్చి ఇంటి వద్దకు చేర్చుతారు. ఏజెంట్లు పట్టుబడినా తమ వివరాలు బయటపడకుండా దళారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

# అమర్చి.. ఏమార్చి



హైదరాబాద్: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ అధ్వానంగా మారుతోంది. మెహిదీపట్నం, కార్వాన్, ఖైరతాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, యూసఫ్‌గూడ.. తదితర సర్కిళ్ల పరిధిలో 10 శాతానికిపైగా కాలనీల్లో.. చెత్త సేకరణ మూడు, నాలుగు రోజులకో సారి జరుగుతోంది. 2 నుంచి 3 శాతం కాలనీల్లో వారానికోసారి కూడా వ్యర్థాలను తరలించడం లేదు. 'స్వచ్ఛ భారత్ మిషన్' త్వరలో నిర్వహించే సర్వే కోసం అధికారులు ప్రాథమికంగా చేపట్టిన పరిశీలనతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోలకు అమర్చిన జీపీఎస్ పరికరాలను కొందరు తొలగిస్తున్నారని, వాటితో ఎలాంటి ప్రయోజనం ఉండట్లేదని తేలింది.

**ట్రాకింగ్ లేకుండానే..**

కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే 'స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే'లో.. జీపీఎస్ పరికరాల వినియోగానికి మార్కులు ఉంటాయి. ఇందుకోసమే జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం.. వాహనాలన్నింటికీ జీపీఎస్ పరికరాలను అమర్చిందనే విమర్శలూ ఉన్నాయి. ఆ పరికరాలను ట్రాకింగ్ చేసే సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం(ఐసీసీసీ) ఏడాదైనా ఏర్పాటు కాకపోవడం, జీపీఎస్ సమాచారాన్ని మరో విధంగానూ బల్దియా ఉపయోగించుకోకపోవడమే ఇందుకు కారణమని పలువురు ఉదహరిస్తున్నారు.


**చేయాల్సిన పనులివీ..**

నగరంలోని 4,648 కాలనీలను జీహెచ్ఎంసీ కొన్నేళ్ల కిందట జియో మ్యాపింగ్ చేసింది. వాటిల్లోని జనావాసాలను, కాలనీ రోడ్లవారీగా మార్కింగ్ చేసుకుని.. స్వచ్ఛ ఆటోలవారికి సంబంధిత జనావాసాలను కేటాయిస్తే.. ప్రతిరోజూ ఆటోలు ఆయా మార్గాల్లోని వ్యర్థాలను సేకరించాయా?లేదా? అనే ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

గతంలో ఇంటింటి చెత్త సేకరణను 'క్యూఆర్ కోడ్ స్కానర్' ద్వారా ధ్రువీకరించుకునే విధానం ఉండేది. తొలుత ప్రతి ఇంటికి బల్దియా ఓ క్యూఆర్ కోడ్ కేటాయిస్తుంది. అక్కడి నుంచి వ్యర్థాలు సేకరించాక.. ఆటో కార్మికుడు దాన్ని స్కాన్ చేసేవారు. ఈ విధానం ప్రస్తుతం అమలవట్లేదు.నిత్యం చెత్త సేకరణ జరిగే ఇళ్లు ఎన్ని? ఆటోలు వెళ్లని కాలనీలు ఎన్ని.. అనే ప్రశ్నలకు జీహెచ్ఎంసీ వద్ద సమాధానం లేదు. జీపీఎస్ పరికరాలను ఉపయోగించుకుంటేనే ఆ విషయం తెలుస్తుంది. అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవట్లేదు.

స్వచ్ఛ ఆటోల హాజరును తనిఖీ చేయాలని సర్కిళ్ల సహాయ వైద్యాధికారులు(ఏఎంవోహెచ్), డిప్యూటీ ఇంజినీర్లకు మొబైల్ యాప్ లాగిన్లు ఇచ్చింది. అధికారులు మాత్రం వాటిని ఉపయోగించడం లేదు.

# నిర్లక్ష్యం చేస్తే తప్పదు భారీ మూల్యం



మెదక్ : నాయకుల పేరు చెప్పి, బంధుత్వాలను గుర్తుచేసి కొందరు మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అలాంటి వారిపై పురపాక శాఖ చర్యలు చేపట్టింది. వారి నుంచి ఆస్తి పన్ను విభాగం అధికారులు జీవిత కాలం జరిమానాలు విధిస్తూ వసూలు చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో నమోదైతే..**

జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పురపాలికలు ఉన్నాయి. వీటి పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వందల సంఖ్యలో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు చేపడుతుండగా ఆస్తిపన్ను విభాగం వారు పన్నులు విధిస్తున్నారు. గతంలో 2005 కంటే ముందు.. అనుమతి పొందిన గృహాలకు మాత్రమే పన్నులు వసూలు చేసే వారు. ఆ తరువాత కాలంలో ఆదాయం సమకూర్చుకునేందుకు అనుమతితో సంబంధం లేకుండా పురపాలికల్లో ప్రతి నిర్మాణానికి పన్నులు విధించాలని నిర్ణయించారు.

**భువన్ యాప్ ద్వారా సర్వే...**

అక్రమ నిర్మాణాలను గుర్తించడంతో పాటు పురపాలిక ఆదాయాన్ని పెంచేందుకు భువన్ యాప్ ద్వారా భవనాలు, వాణిజ్య దుకాణాల కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గతంలో చేసిన ఈ సర్వేలో కొన్ని తప్పిదాలు జరిగాయని గుర్తించి పురపాలిక శాఖ ఇటీవల మరోమారు సర్వే చేయించింది. దీని ద్వారా భవనం విస్తీర్ణంతో పాటు అది నివాసమా? లేక వాణిజ్య అనేది గుర్తించి కొలతలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అనుమతి లేకుంటే 'అనధికారిక నిర్మాణం' పేరుతో జరిమానా విధిస్తున్నారు. ఇళ్లు ఉన్నంత వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అనుమతి తప్పనిసరి- భవాని, ఆర్వో, మెదక్ పురపాలికఅనుమతులు లేని నిర్మాణాలకు 'అనధికారిక నిర్మాణం' పేరుతో ఆస్తిపన్నులో కలిపి అదనంగా జరిమానాలు వసూలు చేసేలా పురపాలిక శాఖ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసింది. తద్వారా ఎవరికీ మినహాయింపు ఉండదు. ఇతరుల మాటలు నమ్మి అనుమతులు తీసుకోకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. లేకపోతే జీవితకాలం జరిమానా కట్టాలి.

# చేరువలో వైద్య సేవలు

వట్‌పల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వట్‌పల్లిలో 30 పడకల ప్రభుత్వ సముదాయ ఆసుపత్రి(సీహెచ్‌సీ), ఐదు పడకల డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.11.20 కోట్లు మంజూరు చేసింది. ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే సంగారెడ్డి జిల్లా పరిధిలోని వట్‌పల్లి, రాయికోడ్, మనూరు, మెదక్ జిల్లా పరిధిలోని రేగోడ్, అల్లాదుర్గం మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం.. దూరాభారం వట్‌పల్లితో పాటు పరిసర ప్రాంత ప్రజలు ప్రస్తుతం మెరుగైన వైద్య సేవల కోసం సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని జోగిపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసరంలో సకాలంలో వైద్య సేవలందక రోగులు మృతిచెందిన ఘటనలున్నాయి. ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు ఇకమీదట తీరే అవకాశం ఉంది. వట్‌పల్లిలో 30 పడకల ప్రభుత్వ సముదాయ ఆసుపత్రి, ఐదు పడకల డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ఇటీవల రూ.11.20 కోట్లు మంజూరయ్యాయి. పనుల పర్యవేక్షణ బాధ్యతను టీజీఎంఎస్ఐడీసీకి అప్పగించింది. ప్రస్తుతం పనులు పిల్లర్ల దశలో ఉన్నాయి.

# ఉపాధికి బాసట.. రైతులకు ఊరట

కనగల్ : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్‌ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. వరి, పత్తి, మిరప తదితర పంటల్లో ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. డ్రోన్లతో పలువురు యువకులు స్వయం ఉపాధి పొందుతుండగా.. పురుగు మందుల పిచికారీతో రైతులు ఊరట చెందుతున్నారు.

డబ్బు, సమయం ఆదా..

రైతులు స్ప్రేయర్‌తో పురుగు మందు పిచికారీ చేయాలంటే సుమారు రూ.1,000 వరకు ఖర్చయ్యేది. డ్రోన్‌తో కూలీల బెడద తప్పింది. ఖర్చు కూడా సగానికి సగం తగ్గింది. మందు పిచికారీ ఎకరాకు ఐదు, ఆరు నిమిషాలు సరిపోతుంది. దీంతో రైతులకు సమయంతో



పాటు సొమ్ము ఆదా అవుతోంది. డ్రోన్ బ్యాటరీ కొనుగోలు, వాహనం, నిర్వహణకు రూ.10 లక్షల వరకు అవుతోంది. ఇది రైతులకు భారం కావడంతో ఆసక్తి గల యువకులు డ్రోన్లను కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు.

శ్రమ తగ్గింది

సుంకిరెడ్డి జితేందర్‌రెడ్డి, రైతు, పగిడిమర్రి

డ్రోన్‌తో పిచికారీ వల్ల ఐదెకరాల పొలం అరగంటలో పూర్తైంది. డ్రోన్‌తో అయితే పురుగు మందు పైరు మొదలు వరకు చేరుతోంది. తెగుళ్లు, చీడపీడల నియంత్రణ కొంత వరకు ఆశాజనకంగా ఉంది.

రూ.30 వేల వరకు..

చెదురుపల్లి నాగరాజు, డ్రోన్ నిర్వాహకుడు

పత్తి, వరి, మిర్చి పంటలకు మందులు పిచికారీ చేస్తూ అద్దె ద్వారా ఆదాయం పొందుతున్నా. ఖర్చులు పోనూ నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది.

# 'అమృత్'తో కొత్త రూపు

మెదక్: మెదక్‌కు రెండేళ్ల క్రితం రైల్వేలైన్ అందుబాటులోకి రాగా... ఇటీవల విద్యుత్తు లైన్ ద్వారా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. టికెట్ల ద్వారా నిత్యం రూ.వేలల్లో ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పనులు ప్రారంభమయ్యాయి. రెండేళ్లలో పనులు పూర్తి కానున్నాయి.

ప్యాసింజర్ రైలు నడుస్తూ..

కేంద్ర ప్రభుత్వం 2012-13లో రామాయంపేట మండలం అక్కన్నపేట మంచి మెదక్ వరకు 17.2 కి.మీ. మేర రైల్వేలైన్ నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. 2014 జనవరిలో శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.210 కోట్లతో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం కాచిగూడ వరకు ప్యాసింజర్ రైలు నడుస్తోంది. పలుమార్లు గూడ్స్ ద్వారా ఆయా ప్రాంతాలకు బియ్యం చేరవేశారు. యూరియా సైతం గూడ్స్ ద్వారా మెదక్‌కు చేరుతోంది.



**అవసరాలకు అనుగుణంగా..**

కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ కోసం అమృత్ భారత్ పథకం చేపట్టింది. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌లో సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేస్తోంది. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 10 స్టేషన్లను ఎంపిక చేయగా, ఈ జాబితాలో మెదక్‌కు చోటు దక్కింది. గతేడాది ఫిబ్రవరి 26న ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా పనులకు శంకుస్థాపన చేశారు. రూ.15.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

సమకూరనున్న సదుపాయాలు

పార్కింగ్ షెడ్లు

సెల్ఫీ పాయింట్

ముఖ్యమైన సమాచార బోర్డులు

ప్రవేశ మార్గాల ఆధునికీకరణ

లిఫ్ట్ సౌకర్యం ల్యాండ్ స్కేపింగ్ ప్లాట్ ఫాం ఉపరితలాన్ని తీర్చిదిద్దడం

దివ్యాంగులకు ప్రత్యేక శౌచాలయాలు, ర్యాంపులు,

టేక్ టైల్ ఫ్లోరింగ్, జనరేటర్ సౌకర్యం

విద్యుత్తు దీపాలు, సంకేతాల ఏర్పాటు

# చకాచకా కనెక్షన్.. బిరబిరా సాగు

సిద్దిపేట : ఒకవైపు నీటి వసతి, మరోవైపు ఉచిత విద్యుత్తు, ఇంకోవైపు వివిధ రకాల పంటల సాగు వైపు అన్నదాతల ఆసక్తి, బీడు భూములను సాగులోకి తేవడం.. వెరసి వ్యవసాయ కరెంటు కనెక్షన్లు పెరుగుతున్నాయి. వ్యవసాయ బావి, బోరు మోటారు కనెక్షన్ అడిగిన వెంటనే విద్యుత్తు శాఖ అధికారులు అవసరమైన చోట నియంత్రికలను మంజూరు చేస్తూ కనెక్షన్ ఇస్తున్నారు. జిల్లాలో 1,76లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. గతంలో విద్యుత్తు కనెక్షన్ల కోసం అన్నదాతలు దరఖాస్తు చేసి ఏళ్ల తరబడి ఎదురు చూసేవారు. ఆన్‌లైన్ విధానం, ఏడీఏ ఆధ్వర్యంలో వినియోగదారుల సేవా కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాలను అందించే ఏర్పాటు చేయడంతో కర్షకులకు వెసులుబాటు అయింది. దరఖాస్తు చేసిన తర్వాత ఏ దశలో ఉంది, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది అనేది పారదర్శకంగా తెలుస్తుంది. పెండింగ్ పెడితే కారణాలను వివరిస్తున్నారు. రెండేళ్లలో 20 వేల వ్యవసాయ కనెక్షన్లు పెరిగినట్లు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. యాసంగిలో సాగు తీరు4.50 లక్షలు: వివిధ పంటలు3.50 లక్షలు: వరి 23 వేలు: మొక్కజొన్న12 వేలు: పొద్దుతిరుగుడు65 వేలు: కూరగాయలు, ఆరుతడి పంటలునెలాఖరులోగా పెండింగ్ లేకుండా మంజూరు- చంద్రమోహన్, ఎస్ఈ, సిద్దిపేట వ్యవసాయ కనెక్షన్ల కోసం ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి కనెక్షన్‌కు అవసరమైన ప్రణాళిక (ఎస్టిమేషన్) పూర్తి చేసి విద్యుత్తు నియంత్రికలు అవసరమైతే కావాల్సిన సామగ్రి వచ్చిన వెంటనే మంజూరు చేస్తాం. పెండింగ్ ఉన్న వాటిని ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

చురకలు



## పాతవని పడేయకండి.. అమ్మేద్దాం

హైదరాబాద్: ప్రస్తుత డిజిటల్ కాలంలో చరవాణి మనిషికి మరో అవయవంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దానితోనే కాలక్షేపం. ఆఫీస్ అవసరాలు, పాఠశాల, కళాశాలకు సంబంధించిన నోట్స్ కూడా అందులోనే లభ్యమవుతున్నాయి. దీంతో ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ చరవాణి తప్పనిసరి అయింది. వాటితో పాటు ల్యాప్‌టాప్‌లు, టీవీలు, కెమెరాలు, ప్రింటర్లు ఇలా ఎన్నో రకాల ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను నిత్య జీవితంలో వినియోగిస్తున్నాం. ఏ పని కావాలన్నా ఎలక్ట్రానిక్ వస్తువులపైన ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని రోజులు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవడం, కొత్త వర్షన్ అందుబాటులోకి రావడంతో వాటిని ఇంట్లో ఓ మూలన పడేస్తున్నారు.

**పనిచేయని గ్యాడ్జెట్లని అమ్మేయవచ్చు**

పనిచేయని పాత సెల్‌ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులతోనూ



డబ్బు సంపాదించొచ్చు. ప్రస్తుతం ఈ-వేస్ట్‌ని కొనుగోలు చేసే పలు సంస్థలున్నాయి. వస్తువుకు సంబంధించిన పూర్తి సమాచారం, ఇంటి చిరునామా ఇస్తే వాళ్లే ఇంటికి వచ్చి మరీ కొనుగోలు చేస్తారు. ఆ వస్తువు స్థితిని బట్టి డబ్బు చెల్లిస్తారు.

**వాటితో వాళ్లేం చేస్తారంటే..**

ఆయా ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయకపోయినా అందులోని భాగాలను రీసైకిల్ చేసుకోవచ్చు. అవి కొత్త వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. ఇతర ప్లాస్టిక్, మెటల్ పరికరాలను రీసైకిల్ చేస్తారు.

**సేకరించని ఈ-వేస్ట్ 57 శాతం..**

దేశంలో 2023-24లో సుమారు 57 శాతం ఈ-వేస్ట్ సేకరించలేదని ఓ సర్వేలో తేలింది. ఇది 9.9 లక్షలమెట్రిక్ టన్నులతో సమానం. వాటిని సేకరించని కారణంగా రీసైక్లింగ్‌కి అవకాశం లేకుండా పోయింది. దీంతో కొత్త ఎలక్ట్రానిక్ వస్తువుల కొరత ఏర్పడుతోంది.

**మచ్చుకు కొన్ని వెబ్‌సైట్లు..**

ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలు అనేకం ఉన్నాయి. అందులో ఎన్విరోకేర్, క్యాషిఫై, జోలోపిక్, ఐటీపికప్, రీసెల్‌ఫోన్. వెబ్‌సైట్‌లోకి వెళ్లి అమ్మేయాలనుకుంటున్న వస్తువు వివరాలను, చిరునామాని ఎంటర్ చేయాలి. వాళ్లకు రిక్వెస్ట్ వెళ్లగానే మనల్ని సంప్రదిస్తారు.

## బెట్టింగ్ వల.. యువత విలవిల

కరీంనగర్ : కష్టపడకుండా సులభంగా సంపాదించాలనే తాపత్రయంతో యువత ఆన్‌లైన్ రమ్మీ.. క్యాసినో.. రౌలట్ ఆటలకు అలవాటవుతున్నారు. నిర్వాహకులు మొదట చిన్న మొత్తంలో డబ్బుల ఆశ చూపి నెమ్మదిగా పెట్టుబడులు పెట్టేలా ఆకర్షిస్తున్నారు. ఉన్నదంతా కోల్పోవడంతో.. అప్పులు చేసి మరీ పెట్టుబడి పెడుతున్నారు. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముతుండగా మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 20 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉండటం కలవరపెడుతోంది.

**సరదాగా ఆడి.. వ్యసనంగా మారి..**

ఉమ్మడి జిల్లాలోని టీనేజర్లలో సుమారు 70 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. వీరిలో 40 శాతానికి పైగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. మొదట సరదా ఆటలు.. వ్యసనంగా మారుతున్నాయి. స్నేహితులు, బంధువులు, సహోద్యోగుల నుంచి ఇలా అందినకాడికి డబ్బులు తెచ్చుకొని జూదంలో నష్టపోతున్నారు. మరికొందరు రుణ యాప్‌ల్లో అప్పులు తీసుకొని ఆన్‌లైన్ మోసాల్లో చిక్కుకుంటున్నారు.

**ఎక్కడిదో లింకు.. ఇక్కడ ఆటలు..**

ఆన్‌లైన్ జూదంపై తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించింది. పేకాట, జూదం బయట కాదు.. ఆన్‌లైన్‌లో ఆడినా నేరమే.. అయినా ఆన్‌లైన్ జూదం నడిపించేందుకు ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) అడ్రస్‌ను తారుమారు చేస్తూ ఎక్కడో ఉన్న లింకుతో ఇక్కడా ఆడేస్తున్నారు. ఐపీ అడ్రస్ వేరే రాష్ట్రంలో ఉన్నట్లు కనిపించేలా చేస్తారు.

**అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు..**

రాష్ట్రంలో ఆన్‌లైన్ జూదం నిర్వహించినా, ఆడినా తెలిసేలా ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ రూపొందిస్తోంది. నీ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్లను ప్రమోట్ చేసే సామాజిక మాధ్యమాలపై నిఘా పెడుతోంది. నీ ఆన్‌లైన్ బెట్టింగ్ నియంత్రణకు ప్రకటనలు, హెచ్చరికలు జారీ చేస్తోంది.



శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన మధు(35) అనే యువకుడు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి రూ.లక్షలు పోగొట్టుకొని వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన కార్తిక్ (25) ఆన్‌లైన్ రమ్మీ ఆడి సుమారు రూ.5 లక్షలకు పైగా నష్టపోయి మనస్తాపంతో పురుగుల మందు తాగి జనవరి 30న చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరీంనగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ జూదానికి బానిసయ్యాడు. అప్పులు తెచ్చి, క్రెడిట్ కార్డు డబ్బులతో ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి సుమారు రూ.70 లక్షలు నష్టపోయాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలిసి ధైర్యం చెప్పారు. అప్పులు కట్టేందుకు ఆస్తులను అమ్మాల్సి వచ్చింది.

గుర్తించండి.. రక్షించండి.. ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడిన వారు ఒంటరిగా ఫోన్‌లోనే గడుపుతుంటారు. పిల్లల బ్యాంకు ఖాతాలను తల్లిదండ్రులు తరచూ తనిఖీ చేయాలి. అనుమానాస్పదంగా డబ్బులు వచ్చినా, పోయినా బ్యాంకుకు వెళ్లి ఖాతాను బ్లాక్ చేయించాలి.

స్నేహితులు, సహోద్యోగులను ఎక్కువసార్లు డబ్బులు అడిగితే సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోరాలి.

నష్టపోయిన వారిని కోపగించడం, సూటిపోటి మాటలు అనకుండా భవిష్యత్తు గురించి ధైర్యం చెప్పాలి.

## కొలువుల వేట.. నైపుణ్యాలకే పెద్దపీట



హైదరాబాద్ : నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల కేంద్రంగా హైదరాబాద్ నగరానికి ఎంతోకాలంగా గుర్తింపు ఉంది. రెండు దశాబ్దాలుగా ఐటీని అందిపుచ్చుకుని పది లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు దశాబ్దాలపాటు నిలకడగా ఉన్న సాంకేతికతలు.. ఇప్పుడు వేగంగా మారుతున్నాయి. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలు పెంచుకోవడంలో యువత కొంత వెనకబడుతోంది. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా), కేపీఎంజీతో కలిసి ఇటీవల విడుదల చేసిన నివేదిక ఇదే స్పష్టం చేస్తోంది. నూతన నైపుణ్యాల అవసరం పెరుగుతోందని సంస్థలు చెబుతున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ పరంగా మెరుగ్గా ఉన్నారు. ఏఐ/ఎంఎల్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ నైపుణ్యాలు ఉన్నవారికి డిమాండ్ పెరుగుతోంది. వీరికి మధ్య, సీనియర్ లెవెల్స్‌లో అవకాశాలు వేగంగా లభిస్తున్నాయి. తక్కువ, ఒక మోస్తరు నైపుణ్యాలకే పరిమితమైన వారు 74 శాతం ఉన్నారు. ప్రాబ్లం సాల్వింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటికల్‌పరంగా మెరుగుపడాల్సి ఉంది. అధిక నైపుణ్యాలు కలిగినవారు 50 శాతం కంటే తక్కువే. బిజినెస్ లీడర్లు వెల్లడించిన అభిప్రాయాల ప్రకారం.. క్లౌడ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్ నైపుణ్యాలకు డిమాండ్ ఎక్కువ. అత్యధికంగా 62 శాతంతో రెగ్యులర్ టెక్ స్కిల్స్‌కు గిరాకీ ఉంది. విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం సంయుక్తంగా ఉద్యోగార్థుల్లో నైపుణ్యాల పెంపునకు శిక్షణ ఇస్తున్నాయి. ప్రత్యేకించి ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాయి. అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే కొత్తగా సాంకేతికతలపై పట్టు అవసరమని సూచిస్తున్నారు.

మొదటి ఉత్తమ 10 నైపుణ్యాలు ఏవంటే?

డేటా సైన్స్
ప్రొడక్ట్ డెవలప్‌మెంట్
క్లౌడ్ డెవలప్‌మెంట్
అప్లికేషన్ డెవలప్‌మెంట్
ఆటోమేషన్ ఆర్కిటెక్చర్
ఏఐ/ఎంఎల్ లెర్నింగ్
డేటా అనలిటిక్స్ అండ్ రిపోర్టింగ్
బిజినెస్ ఇంటలిజెన్స్
సొల్యూషన్ ఆర్కిటెక్చర్

కొత్తగా ఉద్భవిస్తున్న రంగాలు

కృత్రిమమేధ(ఏఐ)/ మిషన్ లెర్నింగ్ (ఎంఎల్)
సొల్యూషన్ ఆర్కిటెక్చర్
క్లౌడ్ డెవలప్‌మెంట్
బిజినెస్ ఇంటలిజెన్స్ (బీఐ)
డేటా సైన్స్
జెనరేటివ్ ఏఐ

## ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్.. సోలార్ స్మార్ట్ బిన్



హైదరాబాద్: ఇంజినీరింగ్ విద్యార్థులంటే కంప్యూటర్లు.. ల్యాప్‌టాప్‌లతో కసరత్తులు... కృత్రిమమేధ సాయంతో ప్రణాళికలు మాత్రమే కాదు.. దైనందిన జీవితాల్లో ఉపయోగపడే పరికరాలు.. వస్తువులను కొత్తగా రూపొందించడమని నిరూపిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. తేజస్-2025 పేరుతో అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన ఇంజినీరింగ్ కళాశాలల సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన 600 మంది మంది విద్యార్థులు, 30 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పార్కింగ్ సమస్యకు పరిష్కారానికి 'స్మార్ట్ పార్కింగ్ సిస్టమ్', రిఫ్రిజిరేటర్‌లో పండ్లు, కూరగాయల వివరాలను ఫోన్‌లో తెలిపే స్మార్ట్ ఫ్రిజ్ యాప్.. స్మార్ట్ డస్ట్‌బిన్.. ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్ వంటివి ఆకట్టుకున్నాయి. వీటితోపాటు 7 ఆవిష్కరణలకు పేటెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.


**సోలార్ స్మార్ట్‌బిన్ పనిచేస్తుందిలా..**

పాతబస్తీ నుంచి హైటెక్ సిటీ వరకూ ఏర్పాటు చేసిన చెత్తకుండీలు (స్మార్ట్ బిన్‌లు) నిండిపోతుంటే వాటిని సకాలంలో ఖాళీ చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటికి పరిష్కారంగా అనురాగ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస రావు నేతృత్వంలో ఎనిమిదిమంది పరిశోధక విద్యార్థులు సోలార్ స్మార్ట్‌బిన్‌ను తయారు చేశారు. సౌరవిద్యుత్తుతో పనిచేసే ఈ చెత్తకుండీలో 80 శాతం చెత్త నిండితే అధికారులు, సిబ్బంది చరవాణులకు సంక్షిప్త సందేశాలు పంపుతుంది. ఇంతేకాదు.. ఒక ప్రాంతంలోని స్మార్ట్‌బిన్లలో ఎన్ని నిండుతున్నాయో చెప్పడంతో పాటు చెత్తను తీసుకెళ్లే వాహనాలు ఎలా తీసుకెళ్లాలో గూగుల్ మ్యాప్ ద్వారా వివరిస్తుంది. ప్రయోగాత్మకంగా ఉప్పల్-హబ్సిగూడ ప్రాంతాల్లో ఈ స్మార్ట్‌బిన్‌ల పనితీరును పరిశీలించామని అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. తయారీకి రూ.8 వేలు ఖర్చయిందని వివరించారు. వర్షాలు కురిసి ఎండ కాయకపోయినా స్మార్ట్‌బిన్ పనిచేస్తుందన్నారు. తమ క్యాంపస్, ఐటీ కారిడార్‌లో కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థల్లో తాము తయారు చేసిన స్మార్ట్‌బిన్‌లను ఉపయోగిస్తున్నామని వివరించారు.

**ప్లాస్టిక్ సీసాలు..కొబ్బరిపీచుతో టైల్స్..**

వాడిన ప్లాస్టిక్ వస్తువులు, సీసాలను ఎక్కడ పడితే అక్కడ పారేస్తే పర్యావరణానికి ప్రమాదం. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను టైల్స్, ప్యానల్స్‌గా మార్చితే.. ఇలా మెకానికల్ విభాగంలోని 8 మంది విద్యార్థులు ఆలోచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభ ఆధ్వర్యంలో పరిశోధనలు ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరిపీచు, లొజును కొనుగోలు చేశారు. వాటిసాయంతో 3 రకాల టైల్స్‌ను తయారు చేశారు. పార్కులు, రహదారులకు అటూఇటూ ఉన్న ఫుట్‌పాత్‌లు, ఇళ్లు, బాత్‌రూమ్‌ల్లో టైల్స్, కార్యాలయాల్లో డోర్ ప్యానళ్లను రూపొందించారు. పార్కులు, ఫుట్‌పాత్‌లకు వినియోగించే టైల్స్‌ను తయారు చేసి కొన్నిచోట్ల వాటిని ఏర్పాటు చేశారు. నడిచినా, ద్విచక్రవాహనాలు వెళ్లినా తట్టుకున్నాయని ప్రొఫెసర్ ప్రతిభ తెలిపారు.

## రయ్ రయ్.. హాయ్ హాయ్




హైదరాబాద్: వాహన రద్దీని కట్టడి చేసే పైవంతెనలు.. ఆటపాటలకూ నెలవు కాబోతున్నాయి. అందుకు ఎక్కువ వెడల్పు ఉన్న పైవంతెనలను జీహెచ్ఎంసీ ఎంపిక చేస్తోంది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఇప్పటికే షేక్‌పేట పైవంతెనను క్రీడా మైదానంలా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామంటున్నారు. అదే మాదిరి.. మిగిలిన ప్రాంతాల్లోని పైవంతెనలను కూడా ఉభయతారకంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.

**సీఎం రేవంత్‌రెడ్డి సూచనతో..**

పేద, మధ్య తరగతి ప్రజలు నివాసముండే కాలనీలకు పార్కులు, ఆట స్థలాల కొరత ఉంది. ఈ లోటును కొంత వరకైనా భర్తీ చేసేందుకు.. పైవంతెనల కింద ఉండే స్థలాన్ని ఉపయోగించుకోవాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీకి సూచించారు. ఆ మేరకు కమిషనర్ ఇలంబర్తి గ్రేటర్‌లోని ఆరుగురు జోనల్ కమిషనర్లకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని ఆదేశాలిచ్చారు.

షేక్‌పేట పైవంతెన 2.5కి.మీ పొడవు, 24మీటర్ల వెడల్పుతో నిర్మాణమైంది. 24 మీటర్ల వెడల్పుతో పైవంతెన కిందనున్న రోడ్డు మార్గాన్ని అనేక రకాలు సద్వినియోగం చేసుకోవచ్చని క్షేత్రస్థాయి పరిశీలనలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఓ నిర్ణయానికి వచ్చారు. అయితే.. అప్పటికే ఆ ప్రాంతంలో పిల్లలు ఆడుకుంటున్నారని, వారిని పలకరించగా.. ఇక్కడికి రోజూ వచ్చి ఆడుకుని వెళుంటామని ఆయనకు బదులిచ్చారు. సీఎం ఆదేశాల ప్రకారం.. ఇంజినీరింగ్ విభాగానికి డిజైన్లు రూపొందించాలని ఆదేశాలిచ్చారు.

**త్వరలో ఇతర ఫ్లైఓవర్ల కింద..**

ఆరాంఘర్-జూపార్కు పైవంతెన, జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ పైవంతెన, కొత్తగూడ కూడలి పైవంతెన, లాలాపేట, నాగోల్, కామినేని కూడళ్ల పైవంతెనలు ఎక్కువ వెడల్పుతో ఉన్నాయి. వాటి కింద క్రీడా వసతులు కల్పించేందుకు పరిశీలిస్తున్నామని జీహెచ్ఎంసీ చెబుతోంది.

**ఒకటో పిల్లర్ల మధ్య సౌకర్యాలు ఇలా..**

ఒకటో పిల్లరు నుంచి రెండో పిల్లరు మధ్య మొక్కలు, వాటి చుట్టూ కుర్చీలు, నడక మార్గం

రెండు, మూడో పిల్లర్ల మధ్య కార్లు, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ వసతి. మూడు, నాలుగో పిల్లర్ల మధ్య యోగా కేంద్రం, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్.

నాలుగు, ఐదో పిల్లర్ల మధ్య స్కేటింగ్ రింగ్.

ఐదు, ఆరో పిల్లర్ల మధ్య బ్యాడ్మింటన్ కోర్టు, సీటింగ్ ఏరియా

ఆరు, ఏడో పిల్లర్ల మధ్య బాక్స్ క్రికెట్.

ఏడు, ఎనిమిదో పిల్లర్ల మధ్య మొక్కలు, కుర్చీలు.

ఒకటో పిల్లరు నుంచి ఎనిమిదో పిల్లరును కలుపుతూ అంచుల్లో నడక దారి, సైకిల్ ట్రాక్ .

మొత్తం ఏర్పాటుకు రోడ్డుపై ప్రయాణించే వాహనాలతో ఇబ్బంది కలగకుండా దళసరి జాలితో రక్షణ.

## పాతవి అపరిష్కృతం.. కొత్త దరఖాస్తులెలా!

హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన ఒకరు నాలుగేళ్ల క్రితం తన కుమారుడి పేరు రేషన్‌కార్డులో చేర్చాలని మీ-సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో కుమారుడి వివరాల నమోదుకు మీ-సేవ కేంద్రానికి వెళ్లగా.. పాతది పెండింగ్‌లో ఉన్నందున దరఖాస్తు తీసుకోవడంలేదు. తాజాగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులతోపాటు పాతవాటిలో కుటుంబసభ్యుల పేర్ల నమోదుకు మీ-సేవలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. కానీ ఈ దరఖాస్తులను ఆమోదించేందుకు ఇటు తహసీల్దార్, అటు జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో)కి లాగిన్ అవకాశం కల్పించకపోవడంతో సభ్యుల నమోదుకు అవకాశం లేకుండా పోయింది.

**9,663 మందికి మాత్రమే..**

పాత దరఖాస్తులను పరిశీలించకుండానే కొత్తవాటిని స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో 2016 తర్వాత కుటుంబ సభ్యుల వివరాల నమోదుకు చేసుకున్న దరఖాస్తులే పెండింగ్‌లో ఉండటంతో.. తాజాగా అదనపు సభ్యులకు సంబంధించి మీ-సేవ కేంద్రాలకు వెళితే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో



వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ప్రతి మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి రేషన్‌కార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీటిని ఆమోదించేందుకు ఈ నెల మొదటివారంలో తహసీల్దార్లు, డీఎస్‌వోలకు లాగిన్ అవకాశమివ్వడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,608 మందికి కొత్త రేషన్‌కార్డులు జారీచేసి.. వాటిలో 9,663 మంది పేర్లను నమోదు చేశారు. ఆ తర్వాత లాగిన్‌కు అవకాశమివ్వలేదు.

**ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..**

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 9,78,921 రేషన్‌కార్డులుండగా.. 28,16,436 మంది సభ్యులున్నారు. తమ పిల్లల పేర్లను రేషన్‌కార్డులో నమోదుకు మీ-సేవ కేంద్రాల్లో 1.78 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రేషన్‌కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యుల పేర్లను చివరిసారిగా 2016లో చేర్చారు. ఆ తర్వాత మీ-సేవ ద్వారా దరఖాస్తుల్ని స్వీకరించినప్పటికీ.. గత ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో చేరని కుటుంబ సభ్యులకు రేషన్, ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు.

**1,01,103 దరఖాస్తులు**

ఉమ్మడి జిల్లాలో 704 మీ-సేవ కేంద్రాలున్నాయి. గత నెలలో నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం 1,01,103 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోగా.. ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన నేటికి జారీ కాలేదు. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావును సంప్రదించగా.. పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు ప్రభుత్వం ఇంకా తమకు లాగిన్ అవకాశం కల్పించలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నూతన సభ్యుల పేర్లను చేర్చుతామన్నారు.

## సాగు లెక్క.. ఇక పక్కా

కరీంనగర్ మంకమ్మతోట: పంటల సాగు నమోదును మరింత కచ్చితంగా లెక్కించేందుకు జిల్లా వ్యాప్తంగా డిజిటల్ పంటల సర్వే ప్రారంభమైంది. ముందుగా జిల్లాలోని 76 వ్యవసాయ క్లస్టర్లలోని 98 గ్రామాల్లో రెండు వేల ఎకరాల సాగు వివరాల నమోదుకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో డిజిటల్ సర్వేను ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యతో వివరాల నమోదు నత్తనడకన సాగుతోంది.

**ప్రయోజనాలు..**

సర్వే వివరాలు అన్నింటికీ ప్రయోజనకరంగా మారనున్నాయి. ఒకసారి సాగైన పంట ఆధారంగా తదుపరి సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పంట రుణాల విషయంలో ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశముంది. ఏ పంట ఎంత సాగైంది, దిగుబడులు, కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండి, అవసరమైన ముందస్తు చర్యలకు మార్గం సుగమం అవుతుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయినప్పుడు పరిహారం అందించేందుకు వివరాలు దోహదపడతాయి. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వేను అమలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఇంతకు ముందు వరకు మన రాష్ట్రంలో ఉన్న యాప్‌నకు, కొత్తగా చేపడుతున్న డిజిటల్ సర్వేకు పెద్దగా మార్పులు లేవు. డిజిటల్ సర్వేలో క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నమోదుతోపాటు కొత్తగా పంట రకం, రైతు ఫొటో సైతం తీసి సబ్మిట్ కొట్టాల్సి ఉంటుంది. యాసంగిలో సుమారు 2.7 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా. సుమారు రెండు లక్షల ఎకరాల్లో డిజిటల్ సర్వే చేయాలని నిర్ణయించారు. 76 క్లస్టర్లకు 76 మంది ఏఈవోలకు బదులుగా 66 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 10 చోట్ల ఖాళీలున్నాయి. ఇప్పటి వరకు 7 వేల ఎకరాల్లో మాత్రమే పంటల నమోదు పూర్తయింది.

**క్షేత్రస్థాయిలో ఇబ్బందులు..**

పలు గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతోపాటు సమయానికి సంబంధిత రైతులు అందుబాటులో ఉండడం లేదంటున్నారు. ఈ సర్వే కొరకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు ఇవ్వకపోడంతో ఏఈవోలు సొంత చరవాణుల్లో సర్వే పనులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు. మోకాపై ఉన్న భూమికి ఆన్‌లైన్ మ్యాపింగ్‌కు తేడాలుండటంతో వివరాలు నమోదుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**సమగ్రతకు ప్రయత్నాలు**

నిర్దేశిత ఎకరాల్లో డిజిటల్ సర్వే పూర్తికి ఏఈవోలు కృషి చేస్తున్నారు. నాతోపాటు డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు సర్వే తీరును పర్యవేక్షిస్తున్నాం. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులకు వివరించి, అధిగమించడానికి కృషి చేస్తున్నాం. డిజిటల్ సర్వే విధానంలో నమోదు కానీ పంటల వివరాలను క్రాప్ బుకింగ్ విధానంలో నమోదు చేస్తాం. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# తీరంలో ఘోరం!

విశాఖపట్నం : సముద్ర తీరానికి సమీపంలో విధ్వంసకర రీతిలో ఏ పనులు చేపట్టకూడదు. ఆ ప్రదేశం అతి సున్నితమైందే కాకుండా జీవ వైవిధ్యానికి నెలవుగా ఉంటుంది. అనేక సముద్ర జీవులకు ఆవాసం కల్పిస్తుంది. భవన నిర్మాణ వ్యర్థాలు వేయకూడదు, సిమెంటు నిర్మాణాలు అసలే చేపట్టకూడదు. అటువంటిది ఆర్‌కే బీచ్‌కు సమీపంలోని తీరాన్ని దారుణంగా ధ్వంసం చేశారు. ఎక్కడికక్కడ నిర్మాణ వ్యర్థాలను గుట్టలుగా పోసి తీరం ఆనవాళ్లు లేకుండా చేశారు. అక్కడ యథేచ్ఛగా ఆక్రమణలు చోటుచేసుకుంటే యంత్రాంగం కళ్లు మూసుకుంది. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టనట్లు ఉండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇష్టానుసారంగా కప్పేయడాన్ని పర్యావరణ వేత్తలు తప్పు పడుతున్నారు.

దర్జాగా ఆక్రమించేసి..: కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సముద్ర తీరాన్ని దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఆర్కే బీచ్ రోడ్డులో ఏకంగా అలలు తాకే వరకు స్థలాన్ని ఆధీనంలోకి తీసుకొని ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆల్‌ఎబిలిటీ పార్క్ నుంచి లైట్‌హౌస్ వరకున్న తీరాన్ని నామరూపాల్లేకుండా చేసేశారు. ఆ మధ్యలో సుమారు అర కిలోమీటరు మేర 20 అడుగులు ముందుకొచ్చి మరీ నిర్మాణాలు చేపట్టేశారు. ముందుగా బండరాళ్లను తీసుకొచ్చి గుట్టలుగా పోశారు. భవన నిర్మాణ వ్యర్థాలను భారీగా డంపు చేశారు. వాటి మీద సిమెంటు పునాదులు నిర్మించారు. అవి కనిపించకుండా వ్యర్థాలతో వాటిని పూడ్చేశారు. గతంలో తీరానికి కొంచెం దూరంలో



నిర్మాణాలుండేవి. ఇప్పుడు ఏకంగా అలలు తాకే వరకు వచ్చేశారు. ఉధృతంగా అలలు వస్తే నేరుగా ఆక్రమించిన స్థలాలను తాకుతున్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు. కొందరు తాత్కాలికంగా ఫెన్సింగ్ వేసి పూర్తిస్థాయిలో స్వాధీనంలోకి తీసుకోవాలని చూస్తున్నారు. ఓ హోటల్ వెనుక భారీగా మెట్ల నిర్మాణం చేపట్టేశారు. హోటల్ నుంచి నేరుగా బీచ్‌లోకి దిగేలా దాన్ని నిర్మించడం గమనార్హం.

**హైకోర్టు హెచ్చరించినా...**

విశాఖ తీరంలోని ఆక్రమణల మీద ఇటీవల హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎక్కడెక్కడ సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించారో వాటి మీద నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో అధికారులు ఆగమేఘాల మీద సర్వే చేపట్టి నివేదిక పంపారు. నగరం నడిబొడ్డున జరిగిన ఉల్లంఘనల గురించి మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి సీఆర్‌జెడ్ నిబంధనలు అమలయ్యేలా చూడాలి. ఇందుకోసం ఏపీ తీర ప్రాంత అభివృద్ధి నిర్వహణ సంస్థ (ఏపీసీజెడ్ఎంఏ) ఆధ్వర్యంలో గట్టి పర్యవేక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిర్మాణ వ్యర్థాలతో తీరాన్ని కప్పేయడం వల్ల సముద్ర జీవరాశులకు ముప్పుగా పరిణమిస్తుంది. గతంలో ఆ ప్రదేశం పచ్చిక, తీగ జాతి మొక్కలతో గుబురుగా సముద్ర జీవులకు ఆవాశంగా ఉండేది. ఇప్పుడు దరిదాపుల్లో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

# ‘ఉత్తి’పోతల పథకాలు!

ఏలూరు: వైకాపా అయిదేళ్ల పాలనలో జిల్లాలోని ఎత్తిపోతల పథకాలను గాలికొదిలేసింది. కొత్తవి పూర్తిచేయలేదు. ఉన్నవాటి నిర్వహణకు పైసా విదల్చలేదు. దీంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలకు పునరుజ్జీవం తీసుకురావాల్సి ఉంది.

**గిర్రమ్మ సంగతేమిటి?**

కామవరపుకోట మండలం రావికంపాడు సమీపంలో గిర్రమ్మ పథకం



పంపు హౌస్ ఏర్పాటు చేసి పంపులు అమర్చినా 30కి పైగా కల్వర్టులు, స్లూయిజ్‌లు, అండర్ టన్నెళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. 17 ఉపకాలువలు తవ్వాల్సి ఉంది. దీని కోసం వంద ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది.

**దీనస్థితిలో గాడిదబోరు**

బుట్టాయగూడెం మండలంలో ఏర్పాటు చేసిన గాడిదబోరు పథకం మోటార్లు మూలన పడ్డాయి. పైపులు పగిలిపోయాయి. 2016లో తెదేపా ప్రభుత్వం చేసిన మరమ్మతులు తప్ప వైకాపా సర్కారు రూపాయి ఇవ్వలేదు.

**గురుగుమిల్లి వైపు చూడాలి..**

బుట్టాయగూడెం మండలం గురుగుమిల్లిలో 300 ఎకరాలకు నీరిచ్చేందుకు ఏర్పాటు చేసిన పథకంలోని నాలుగు మోటార్లు కొద్ది రోజులకే మూలనపడ్డాయి. రైతులే సొంత సొమ్ముతో రెండు పాత మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. మరో రూ.20 లక్షలు ఖర్చు చేస్తే పథకం అందుబాటులోకి వస్తుంది. పట్టిసీమను పట్టించుకోలేదు

పోలవరం మండలంలో వెయ్యి ఎకరాలకు నీరందించే ఈ పథకాన్ని అసంపూర్తిగా వదిలేశారు. తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయినా వైకాపా పాలనలో 2 కి.మీ. మేర పైపులైను వేయలేక వదిలేశారు. దీంతో ప్రాజెక్టు మూలన పడింది.

**గాలికొదిలేశారు**

నిర్వహణ మరీ అధ్వానంగా ఉన్న పథకాలకు రూ.10 కోట్లు ఇవ్వాలని వైకాపా హయాంలో ప్రతిపాదనలు చేసినా పైసా విదల్చలేదు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న 24 పథకాల్లోనూ పంపులు, పైపులు, మోటార్లు తదితర సమస్యలు ఉన్నాయి.

రూ.78 కోట్లతో ప్రతిపాదనలు

‘కూటమి అధికారం చేపట్టిన తర్వాత రూ.78 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం’ అని ఏపీఎస్ఐడీసీ డీఈ దుర్గాగురవయ్య తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పథకాలు 29

ఎకరాలు నీరందే ఆయకట్టు 55,162

నిర్వహణ సమస్యలున్నవి 24

# రోడ్డున పడినా.. కరుణించరే



హిందూపురం : హిందూపురం పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం స్థలాలు కోల్పోయిన బాధితులకు నేటికీ పరిహారం అందలేదు. ఐదేళ్ల కిందట పట్టణంలోని రైల్వే రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. 70 అడుగుల వెడల్పుతో కిలోమీటరు పాటు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి నంది సర్కిల్ వరకు విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. విస్తరణకు అవసరమైన స్థలం కోసం అడ్డుగా ఉన్న భవనాల్లో 90 శాతం వరకు తొలగించారు. అయితే బాధితులకు నష్ట పరిహారం చెల్లించలేదు. రోడ్డుకు ఇరువైపులా దాదాపు 20 అడుగుల విస్తీర్ణంతో 200 మంది తమ స్థలాలను, భవనాలను కోల్పోయారు.

**టీడీఆర్ బాండ్లు అంటూ కాలయాపన**

రైల్వేరోడ్డులో సెంటు స్థలం రూ.కోటి పలుకుతోంది. రహదారి విస్తరణకు నష్ట పరిహారం చెల్లించాలంటే వందల కోట్లు రూపాయలు చెల్లించాల్సి ఉంది. అయితే సొమ్ముకు బదులుగా పరిహారంగా టీడీఆర్ బాండ్లను మున్సిపాలిటీ అందిస్తుంది. స్థలానికి ఉన్న ప్రభుత్వ విలువకు నాలుగు రెట్లు విలువైన బాండ్లను మున్సిపాలిటీ స్థల యజమానులకు ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. పట్టణాల్లో అదనపు అంతస్తులు, ఎత్తైన భవనాలు నిర్మించుకొనే వారు టౌన్ ప్లానింగ్ విభాగానికి చెల్లించాల్సిన రుసుముకు బదులుగా ఈ బాండ్లను వినియోగించుకోవచ్చు. వీటిని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల బిల్డర్లు కొనుగోలు చేస్తుంటారు. వాటి ముఖ విలువలో 30–40 శాతం మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తారు. దీంతో రూ.లక్ష విలువైన బాండుకు స్థల యజమానికి దక్కేది రూ.30–40 మాత్రమే.

**నాలుగేళ్లు దాటినా ..**

రోడ్డు విస్తరణతో వ్యాపారులు స్థలాలు, దుకాణాలు కోల్పోయి నాలుగేళ్లు దాటిపోయింది. అయినా వారికి ఎలాంటి న్యాయం జరగలేదు. స్థలాలను మున్సిపాలిటీ పేరుతో అధికారులే రిజిస్టర్ చేయించుకొని, యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి. వారు వాటిని విక్రయించుకొని సొమ్ము చేసుకోనేవారు. ఈ విషయంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. విస్తరణ చేపట్టినప్పటి నుంచి ఐదుగురు కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగంలో 10 మంది అధికారులు మారిపోయారు. వచ్చిన ప్రతి ఒక్కరూ న్యాయం చేస్తామని చెప్పడమే కానీ ఒరిగిందేమి లేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను సమావేశ పరుస్తాం. వ్యాపారులకు తక్షణం న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# చివరికి.. పెద్దల చేతుల్లోకి!



విశాఖపట్నం : గత వైకాపా ప్రభుత్వంలో విలువైన భూములపై కీలక నేతల కన్ను పడింది. ఇందుకు భూకేటాయింపుల నాటకానికి తెరతీశారు. నేరుగా పెద్దల చేతుల్లోకి వెళ్తే అనుమానం కలుగుతుందని మధ్యలో ఓ సంస్థను తీసుకొచ్చి వారితోనే దరఖాస్తు చేయించి... తరువాత కొట్టేసే వ్యూహం పన్నారు. అలాగే మరికొన్ని సంస్థలకు నగరం నడిబొడ్డున స్థలాలు కేటాయించి అందులో వాటాలకు ప్రయత్నించారు. వైకాపా నేతల సిఫార్సులతో కొన్ని కట్టబెట్టాలని చూశారు. ఇలా రూ.వందల కోట్ల ఆస్తులను దక్కించుకునేలా అడుగులు వేశారు. నిబంధనలు పాటించకపోవడంతో విశాఖలో ‘హయగ్రీవ’ ప్రాజెక్టు భూముల కేటాయింపును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో గత అయిదేళ్లలో సాగిన భూ కేటాయింపుల తీరుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరముంది.

**సేవ పేరుతో...**

ఎందుకంటే: హియరింగ్ కేర్ సెంటర్

విస్తీర్ణం : 88 సెంట్లు ప్రాంతం : ఎండాడలో

ప్రభుత్వ కేటాయింపు : ఉచితం

బహిరంగ మార్కెట్ విలువ : రూ.50 కోట్లు

ప్రస్తుత పరిస్థితి: ఆ భూముల ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.21.29 కోట్లని అప్పటి జిల్లా అధికారులు ప్రతిపాదించారు. ఆ తర్వాత ఓ నేత చక్రం తిప్పి ఉచితంగా కట్టబెట్టినట్లు సమాచారం. మొదట 2021లో ఆ సంస్థకు స్థలం కేటాయించారు. ఆ తర్వాత రద్దు చేసి మళ్లీ 2023లో కేటాయించారు. ఉచితంగా కట్టబెట్టిన నేపథ్యంలో సీఎంవో నివేదిక తెప్పించుకుంది. సీఎం చంద్రబాబు విశాఖలో భూఆక్రమాల గురించి వెల్లడించిన సమయంలోనూ దీని గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ స్థలాన్ని ఏవిధంగా వినియోగించడం లేదు.

**కేటాయించినా తీసుకోకుండా...**

ఎందుకంటే: విద్యాలయం నిర్మాణం

విస్తీర్ణం : 16 ఎకరాలు, ప్రాంతం : గాజువాక మండలం అగనంపూడి,

ప్రభుత్వ కేటాయింపు : ఉచితం

బహిరంగ మార్కెట్ విలువ : రూ.300 కోట్లు

ప్రస్తుత పరిస్థితి : 2023లో స్థలం కేటాయించగా వివాదాస్పదం అవ్వడంతో ఆ సంస్థ స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా వదిలేసింది. కొందరి నేతల ఒత్తిడితో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదని సమాచారం.

అప్పటి ఎమ్మెల్యే కోసం

ఎందుకంటే: విద్యా సేవల కోసం, విస్తీర్ణం: ఏడెకరాలు

ప్రాంతం : బక్కన్నపాలెం బాబా కళాశాల సమీపంలో అరెకరం. మిగిలింది ఆనందపురం మండలంలో

బహిరంగ మార్కెట్ విలువ : రూ.200 కోట్లుప్రస్తుత పరిస్థితి : 2019లో తెదేపాలో గెలిచి ఆ తర్వాత వైకాపాలోకి మారిన ఎమ్మెల్యే... కారు చౌకగా నగర పరిధిలో భూములు చేజిక్కించు కునే ప్రయత్నం చేశారు. ఉన్నత స్థాయిలో దక్కిన ఆమోదంతో కేటాయింపులు చకచకా సాగాయి. ఈ కేటాయింపులపైనా ప్రభుత్వం దృష్టిసారించాలి.

# ఆధార్‌కు బాలారిష్టాలు!

మార్టేరు: బాల ఆధార్ నమోదుకు బాలారిష్టాలు తప్పడం లేదు. ప్రతి నెలా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ప్రక్రియ సాగడం లేదు. ఓవైపు సాంకేతిక సమస్యలు, మరోవైపు గ్రామీణుల్లో కొరవడిన అవగాహనతో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి. ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించే బాధ్యతను ప్రభుత్వం సచివాలయాలు, మహిళా శిశు సంక్షేమ శాఖలకు అప్పగించింది. జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా.. 54,489 మంది పిల్లలు నమోదు చేయించుకున్నారు. ఇంకా 6 వేల మంది చిన్నారులు దూరంగా ఉన్నారు.

ముందస్తు ప్రచారం లేక.. గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నా.. ముందస్తు ప్రచారం చేయడం లేదు. ఈ ప్రక్రియను మండల స్థాయిలో ఎంపీడీవోలు పర్యవేక్షిస్తుండగా– వారే దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. కొన్నిచోట్ల సిబ్బంది ఉండడం లేదు. మరికొన్ని చోట్ల అంతర్జాలంలో అవాంతరాలు ఎదురవడం, పరికరాలు సరిగా పనిచేయకపోవడం తదితర సమస్యలు వెన్నాడుతున్నాయి. గంటల తరబడి పిల్లలను కేంద్రాల వద్ద పెట్టుకోలేక.. తల్లిదండ్రులు వెనుతిరుగుతున్నారు. ‘ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రుల పరంగా



ఏవైనా లోపాలుంటే, వాటిని సరిదిద్దేలా చైతన్యపరుస్తున్నాం’ అని ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి తెలిపారు. వెనుకబాటుకు కారణాలివే.. చిన్నారులకు జనన ధ్రువపత్రాలు లేకపోవడం, వివిధ కారణాలతో పేర్లు పెట్టకపోవడం, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల్లో వివరాలు సరిపోలకపోవడం, పుట్టిన బిడ్డకూ ఆధార్ నమోదు చేస్తారన్న విషయం తెలియకపోవడం.

జిల్లా వివరాలిలా..

అంగన్‌వాడీ కేంద్రాలు 1,626

ఆరేళ్లలోపు పిల్లలు 60,435

ఆధార్ నమోదుకాని వారు 5,946

# ఊరుతున్న అవినీతి ఊట

ఎమ్మిగనూరు : కురిసిన ప్రతి చినుకును నేలలో ఇంకించి భూగర్భ జలాలు పెంపొందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ‘వాటర్ షెడ్’ పథకంలో అక్రమాల ఊట పరవళ్లు తొక్కుతోంది. రూ.కోట్లు కరిగినా పథకం ప్రయోజనం దక్కలేదు. ఎమ్మిగనూరు మండలంలో కడివెళ్ల, కందనాతి, వెంకటగిరి గ్రామాల్లో 170 ఫారం పాండ్లు, ఆరు చెక్ డ్యాంలు, నాలుగు నీటికుంటలు గతేడాది నిర్మించారు. ఒక్కోవాటర్ షెడ్డు పథకానికి రూ.5 లక్షల వరకు వినియోగించారు. నాసిరకం పనులు చేపట్టడంతో ఏడాదికే కంకర రాళ్లుతేలి అధ్వానంగా మారాయి.

**సిమెంటు పూతలు**

ఈ ఏడాది కొత్తగా మరో ఎనిమిది వాటర్ షెడ్డు(చెక్ డ్యాం)లు



మంజూరయ్యాయి. ఒక్కోదానికి రూ.5 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇప్పటికే రెండు చోట్ల నిర్మాణాలు పూర్తి కావొస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో సిమెంట్, ఇసుక, కంకర మిశ్రమాన్ని సమపాళ్లల్లో వినియోగించడం లేదు. అప్పుడే కంకర రాళ్లు తేలాయి. అవి కనిపించకుండా సిమెంట్ పూత పూసి మమ అనిపిస్తున్నారు. క్యూరింగ్ చేయడం లేదు.

**పాత పనులకు మెరుపులు**

ఒక్కోఫారం పాండుకు పరిమాణాన్నిబట్టి రూ.50 వేల నుంచి రూ.80 వేలకుపైగా వెచ్చించారు. వంకల పొడవునా ఎక్కువగా తవ్వారు. చాలాచోట్ల పైపైన పనులు చేపట్టారు. గతంలోనూ వివిధ పథకాల కింద తవ్విన పాత ఫారం పాండ్లను కొత్తగా తవ్వినట్లు చూపి అధికారులు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామానికి దాదాపు 2 కి.మీ. దూరంలో వంకలు, వాగుల పొడవునా, బీడు భూముల్లో పనులు చేపట్టారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి క్షేత్ర స్థాయిలో సిబ్బంది నాసిరకంగా పనులు చేసి నిధులు కాజేశారు.

# ఎన్నాళ్లిలా..‘ఓటి’గట్టు

భీమవరరే: గోదావరి ఏటిగట్ల పరిరక్షణను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో విజ్జేశ్వరం బ్యారేజీ నుంచి నరసాపురం వరకు ఉన్న ఏటిగట్లు అక్కడక్కడా జారిపోతున్నాయి. వేసవిలో ముందస్తు పటిష్ఠ చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎక్కడైనా లీకేజీ వస్తే ఇసుక బస్తాలు, సర్వే కర్రలతో నెట్టుకురావడం తప్ప స్థానికులకు వేరే గత్యంతరం లేకుండా పోయింది. 2022లో వచ్చిన భారీ వరదకు నరసాపురం వద్ద ఏటిగట్టు 40 మీటర్లు కొట్టుకుపోయింది. అప్పట్లో దానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఇలాంటి ఘటనలు ఏ క్షణంలోనైనా ఎక్కడైనా జరగొచ్చు.

భయపెడుతున్న తవ్వకాలు.. నిబంధనల ప్రకారం ఏటిగట్టుకు సుమారు కి.మీ. దూరంలో ఎటువంటి తవ్వకాలు చేయకూడదు. వైకాపా హయాంలో లంక భూముల్లో ఇష్టారీతిన తవ్వకాలు జరిగాయి. ఏటిగ




ట్టును చేర్చి ఉన్న లంకల్లోనే మట్టిని మీటరు నుంచి మూడు మీటర్ల లోతు తవ్వేశారు. ఫలితంగా గట్లు అనేక చోట్ల జారి పోతున్నాయి.

అంచనాలున్నా మంజూరు లేదు

వైకాపా హయాంలో పటిష్ఠం చేయాల్సిన ఎనిమిది ప్రాంతాలను అధికారులు గుర్తించారు. నిపుణులు పరిశీలించి రూ.161 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పొన్నపల్లి గట్టు నిర్మాణం, కాజ, ఈస్ట్ కుక్కిలేరు, ముసికేపాలెం రెగ్యులేటర్లకు మాత్రమే అనుమతులిచ్చింది. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం నుంచి రాజుల్లంక వరకు, దొంగరావిపాలెం, కోడేరులంకలోని మిడ్‌స్ట్రీమ్‌లంకల్లో ఏటిగట్టు పటిష్ఠానికి రూ.36 కోట్లు, గోదావరి ఎడమగట్టు 20 కిలోమీటర్ల పటిష్ఠతకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఏటిగట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ కేవీ సత్యనారాయణ తెలిపారు.

# ‘మొక్క’జొన్నను తిన్న ఎండుతెగులు

కోవెలకుంట్ల: వర్షాకాలంలో లాభాలు తెచ్చిపెట్టడంతో రైతులు రెండో పంటా మొక్కజొన్న సాగు చేశారు. ఎండుతెగులు



ఆశించడంతో దిగుబడి రాక దిగాలు చెందుతున్నారు. వానాకాలంలో ఎకరాకు రూ.30 నుంచి రూ.35వేలు పెట్టుబడి పెడితే దిగుబడి ఎకరాకు 25 నుంచి 29 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటా ధర 2,250 నుంచి 2,280 వరకు ఉండటంతో ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు లాభాలు పొందారు. రబీలోనూ అదే పంట సాగు చేశారు. జిల్లాలోని 28 మండలాల్లో 10,591 హెక్టార్లు సాగు చేశారు. మొక్కదశలోనే ఎండుతెగులు సోకింది. ఒకచోట బిళ్లగా మొదలైన తెగులు క్రమంగా పంటంతా సోకి మొక్క ఎండిపోయేలా చేసింది. కంకిలో ఉండే గింజలు సాధారణం కంటే తక్కువై తాలు మాత్రమే మిగిలింది. ఎకరాకు దిగుబడి 12నుంచి 15 క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో పెట్టిన పెట్టుబడులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు దక్కలేదు – మిద్దె రామయ్య, అమడాల1.5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. మొత్తం రూ.35 వేలు పెట్టుబడి పెట్టా. మొక్క పెరుగుతున్న సమయంలో ఎండు తెగులు సోకి పంటంతా ఆశించింది. వానకారులో 44 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

# ప్రతి గొంతు తడిపేలా..

నర్సీపట్నం: పట్టణం విస్తరిస్తోంది.. తెల్లారిలేస్తూనే నీటి కోసం కుళాయిల వైపు చూసే జనాభా పెరుగుతోంది. కానీ ప్రతి గొంతునూ తడిపేంత నీరు కుళాయిల నుంచి రావడం లేదు. వేసవి వచ్చిందంటే దాహం కేకలు మరింత పెరుగుతూనే ఉన్నాయి. నర్సీపట్నం పురపాలికను ఏళ్ల తరబడి తాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నర్సీపట్నం నీటి సరఫరా, సెప్టేజ్ నిర్వహణ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. జిల్లాలో శరవేగంతో విస్తరిస్తున్న నర్సీపట్నంలో 2048 నాటి జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారీ తాగునీటి ప్రాజెక్టుకు 2012లోనే ప్రతిపాదన రూపొందించారు. నిధులు విడుదల కాకపోవడంతో అప్పట్లో పనులు మొదలు కాలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2018లో అప్పట్లో మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు రూ. 142.76 కోట్లు మంజూరు చేయించి ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. 2019లో అధికారానికి వచ్చిన వైకాపా ప్రభుత్వం తొలుత పనులపై దృష్టి పెట్టలేదు. దాంతో గుత్తేదారు దాదాపు రూ. 15 కోట్ల విలువైన పనులు మాత్రమే చేపట్టారు. కేవలం నాలుగు కిలోమీటర్లు పెద్దపైపులు, ఎనభై కిలోమీటర్లు చిన్నపైపులు వేశారు. బలిఘట్టంలో



కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి ఇనుప చువ్వలు అమర్చి పనులు ఆపేశారు. ఈ భారీ తాగునీటి ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నిర్ణయించారు. ఆయన ఆదేశం మేరకు ప్రజారోగ్యశాఖ అధికారులు ఇప్పుడు రూ. 185.29 కోట్ల ఖర్చుతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేశారు. రెండు రోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనుంది. అనుమతి రాగానే టెండరు ప్రక్రియ మొదలవుతుంది. ఈ ప్రాజెక్టు పనులు కొద్దిరోజుల్లోనే మొదలవుతాయని అయ్యన్న రెండు రోజుల క్రితం ప్రకటించారు. రోడ్లు వేయకముందే పైపులైన్ల పనులు పూర్తి చేయించాలని ఆయన మున్సిపల్ అధికారులకు సూచించారు.

**మనిషికి 135 లీటర్ల శుద్ధజలం**

ఈ పాజెక్టు కార్యరూపం దాల్చితే పట్టణంలో ప్రతి ఒక్కరికి మనిషికి 135 లీటర్ల చొప్పున శుద్ధజలం అందుతుంది. ప్రస్తుతం ఒక్కొక్కరికి 57 లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పొందుపర్చిన అంశాల ప్రకారం కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద ఏలేరు కాలువ నుంచి 0.3 టీఎంసీల నీటిని తీసుకుంటారు. దాన్ని జోగునాథునిపాలెం కొండపై నిర్మించిన ట్యాంకులకు చేర్చి అక్కడ నుంచి నర్సీపట్నం పెద్దచెరువులో ఏర్పాటు చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు పైపులైన్ ద్వారా పంపిస్తారు. ఇక్కడ నీటిని శుద్ధిచేసి పట్టణంలో ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లతో పాటు కొత్తగా నిర్మించబోయే మరో ఐదు రిజర్వాయర్లకు పంపిస్తారు. ఇంటింటికీ కుళాయిలు అమర్చి శుద్ధజలాన్ని అందజేస్తారు. పట్టణంలో ప్రస్తుతం 70 వేలకు పైగా జనాభా ఉంది. భారీ తాగునీటి పథకం డీపీఆర్ సిద్ధమైందని ప్రజారోగ్యశాఖ అనకాపల్లి డీఈఈ జానకి వెల్లడించారు. ఈ నివేదిక రాష్ట్ర ఇంజినీరింగ్ అధికారులకు రెండు రోజుల్లో పంపుతున్నామని తెలిపారు.

# కోలుకోని కోడి

నక్కపల్లి : చికెన్ ధరల్లో స్థిరత్వం లేకపోవడంతో ఇటు వ్యాపారులకు, అటు కోళ్ల పెంపకం రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. గతనెలలో బర్డ్‌ఫ్లూ ప్రభావం నుంచి మొదలైన పతనం తర్వాత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలతో కాస్త కోలుకున్నట్లు కనిపించినా, మళ్లీ యథాస్థితికి చేరింది. పౌల్ట్రీల్లో సరకు అధికంగా ఉండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా సుమారు 400 మంది వరకు రైతులు కోళ్ల ఫారాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పెంచే కోళ్లను స్థానికంగా వినియోగించడంతోపాటు పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. కాగా గతనెలలో ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ రావడంతో అక్కడితో పాటు, ఉత్తరాంధ్రలోనూ విక్రయాలపై ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా కొనుగోళ్లు తగ్గిపోగా, కేజీ రూ. 250 వరకు ఉన్న మాంసం ధర రూ. 150కి పడిపోయింది. ఇక విక్రయాల్లేక దుకాణాలు వెలవెలబోయాయి. ఫలితంగా రైతులకు ఆర్థిక నష్టాలు ఏర్పడగా, వీటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన అనేక మంది ఉపాధిపైనా ప్రభావం చూపింది. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఆ మేరకు అధికారులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయించింది. ఇదే సమయంలో కోళ్ల పెంపకాలను చేపట్టే సంస్థలూ ముందుకు వచ్చి ఉచితంగా చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించిన ప్రజలకు మాంసం వంటకాలను పంపిణీ చేశారు. దీంతో పరిస్థితి కాస్త కుదుటపడినట్లే కనిపించి. ఫలితంగా క్రమేపీ ధర పెరుగుతూ.. పది రోజుల కిందట కిలో మాంసం రూ. 210కి చేరింది. ఆ మేరకు వ్యాపారులతోపాటు రైతులు ఊపిరిపీల్చుకోగా, ఈలోగానే ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వ చర్యల కారణంగా చికెన్ వినియోగం పెరిగినప్పటకీ ఇదే సమయంలో పౌల్ట్రీల్లో ఉత్పత్తి అధికంగా ఉండటంతో సరిపడా డిమాండ్ లేక ఈ పరిస్థితి నెలకున్నట్లు వ్యాపారులు వివరిస్తున్నారు. పౌల్ట్రీల్లో సగటున రెండు కిలోల వరకు పెరిగేలా చూస్తారు, ప్రస్తుతం దాదాపు పౌల్ట్రీల్లోనే కోళ్లు మూడు కిలోల వరకు పెరిగిపోయాయి. దీనికి తోడు ఎండల ప్రభావం పెరగడంతో ఇవి త్వరగా మరణించే ప్రమాద భయం వెన్నాడుతోంది. దీంతో వినియోగానికి మించి కోళ్లు ఉండిపోవడంతో వీటిని విక్రయించడానికి వీలుగా ధరలు తగ్గించాల్సి వచ్చింది. దీంతో గడిచిన వారం రోజులుగా కేజీ రూ. 160కి పడిపోయింది. ఆ మేరకు ప్రస్తుతం ఉన్న సరకును అమ్మకం చేసిన తర్వాత కాస్త విరామంతో మళ్లీ పెంపకం చేస్తే ధర పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు యోచించి, ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ధర మరో వారం, పదిరోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని నక్కపల్లికి చెందిన వ్యాపారి నానాజీ వెల్లడించారు.

# నైపుణ్యాభివృద్ధి.. ఉద్యోగప్రాప్తి



అనంతపురం : డిగ్రీలు చేత పట్టుకుంటే ఉద్యోగాలు వచ్చే రోజులు పోయాయి. అదనపు నైపుణ్యాలు ఉంటేనే కొలువులు వస్తాయి. ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు అనువైన నైపుణ్యాలు లేనందువల్ల యువత నిరాశ, నిస్పృహలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన వారు ఉద్యోగాల దరఖాస్తు, ఇతరత్రా ఖర్చులకు సైతం సొమ్ము అందజేయనుంది. ముందుగా ఉమ్మడి జిల్లాలోని అనంతపురం నగరంతోపాటు పురపాలికల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. దీనికి నిరుద్యోగ యువత నుంచి మంచి స్పందన లభిస్తోంది.

**ఇంకెందుకు ఆలస్యం!**

ఏదేని డిగ్రీ పూర్తి అయిన యువత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతరుల కంటే డ్వాక్రా సంఘాల్లోని మహిళల పిల్లలకు కొంత ప్రాధాన్యం ఉంటుంది. మెప్మా, ఆశా సొసైటీ సహకారంతో శిక్షణ ఇస్తారు. 2021 తర్వాత రెగ్యులర్ విధానంలో డిగ్రీ పూర్తి అయిన వారు అర్హులు. జాతీయ అప్రెంటీస్‌షిప్ పథకం (ఎన్ఏటీఎస్) ద్వారా వృత్తి, జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఆధార్ లింకు అయిన బ్యాంకు ఖాతా, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ వివరాలతో సమీపంలోని నగర, పురపాలికల్లోని మెప్మా విభాగంలో నమోదు చేసుకోవచ్చు.

**ప్రతినెలా రూ.4,500 భృతి**

ఎంపికైన వారికి సంవత్సరం మొత్తంలో 150 గంటలు, వారానికి కేవలం 3 గంటలు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. పరిస్థితులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలు పెంచుకోవచ్చు. ఏడాదిపాటు ప్రతి నెలా రూ. 4,500 భృతి నేరుగా ఖాతాలో జమ అవుతుంది. ఇందులో ప్రతి నెలా నిర్వహణ ఖర్చుల కింద ఆశా సొసైటీకి రూ. 1,000 భృతి పొందిన తరువాత ఇవ్వాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయ్యేలోగా కేంద్ర మంత్రిత్వశాఖ, ఎన్ఎస్‌డీసీ, పరిశ్రమ నుంచి మూడు శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈనెల 20వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని, అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ విశ్వజ్యోతి తెలిపారు.

అనంత లక్ష్యం: 2,000

ఇప్పటిదాకా పేర్లు నమోదు: 2,077

ఆనందంగా ఉంది

ఆన్‌లైన్ శిక్షణతో ఉచితంగా నైపుణ్యాలు పెంచుకోవచ్చు. భృతి కూడా ఇస్తుండటంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. యువతలో ధైర్యం, భరోసా కల్పించడం ఆనందం ఉంది.

బిందుబాయి, బీకామ్ కంప్యూటర్స్

# పెన్నాలో ఇసుకాసురులు



తాడిపత్రి : ఇసుక అక్రమ రావాణ ఆగడం లేదు. అక్రమార్కులు తమకు అడ్డే లేదన్నట్లుగా రాత్రింబవళ్లు పెన్నానదిని తోడేస్తున్నారు. ఇసుకను తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. అధికారులు అడపా దడపా కేసులు నమోదు చేస్తున్నా.. ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడిపత్రి నియోజకవర్గంలో పెన్నానది సుమారు 64 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. నది పరిహాక ప్రాంతంలోని పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలించి పగలు ఒక చోట డంప్ చేస్తున్నారు. రాత్రివేళ టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లలో నంద్యాల, బనగానపల్లి, బళ్లారి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెన్నానది నుంచి రోజూ సుమారు 500 ట్రాక్టర్ల ఇసుక తరలిపోతున్నట్లు అంచనా.

**ఎక్కడెక్కడంటే..**

తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె నుంచి ఆలూరుకు వెళ్లే దారిలో పలుచోట్ల ముళ్లపొదలు, నాపరాళ్ల పరిశ్రమ, ఇటుక ఫ్యాక్టరీల వద్ద భారీగా ఇసుక నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి టిప్పర్లతో నంద్యాలకు తరలిస్తున్నారు. నందలపాడు వద్ద ఉన్న నదిలో నుంచి భారీగా ఇసుకను తోడి ఆదర్శ పాఠాశాల, భగత్‌సింగ్‌నగర్‌లోని ముళ్లపొదల్లో డంప్ చేసి పట్టణంలోనే విక్రయిస్తున్నారు. బీ చిన్నపొలమడ, పెద్దపొలమడ, హుస్సేనాపురం, ఇడుగూరు, చుక్కలూరు, అక్కన్నపల్లి గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

ప్రత్యేక బృందంతో నిఘా ఉంచాం

శివగంగాధర్‌రెడ్డి, గ్రామీణ సీఐ తాడిపత్రి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. రోజూ పెన్నానది పరివాహక ప్రాంతాల్లో తనిఖీలు చేసి పట్టుబడిన ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తున్నాం. ఆయా గ్రామాల్లో నిఘా పెంచి ఇసుక అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తాం.

# రెప్పపాటులో కాజేస్తారు!



అనంతపురం : కాదేదీ దోపిడీకి అనర్హం అన్న రీతిలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. చుట్టూ అలాంటి మాయగాళ్లున్నపుడు వినియోగదారుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే.. ఇటీవల పెట్రోలు బంకుల్లో మైక్రో చిప్స్ అమర్చి వినియోగదారుల నుంచి దోచుకున్న తీరు చూస్తే ఎవరైనా నివ్వరబోవాల్సిందే.. లీటరుకు పది మిల్లీలీటర్ల చొప్పున తక్కువ కొలతతో పెట్రోలు, డీజిల్ విక్రయించి దోచుకుంటున్న తీరు వెలుగులోకి వచ్చింది. వినియోగదారుల హక్కుల వారోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కథనం.. ఉప్పు, పప్పు, బియ్యం, తినుబండారాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు ఏవైనా కొనుగోలు సమయంలో తక్కువ తూకంతో మోసపోరాదని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తూనికలు, కొలతల చట్టం మేరకు మార్గదర్శకాలు రూపొందించి అమలు చేస్తున్నా యథేచ్ఛగా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మోసాలపై ఎంతో అవగాహన ఉన్న వారే పోరాడుతున్నారు. చాలామంది మనతో ఏమవుతుందిలే అని నిమ్మకుండిపోతున్నారు.

తూకాల్లో మోసాలపై అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ 9849095707, తనిఖీ అధికారి మహమ్మద్ గౌస్ 9398112675 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.కేసుల తీరు ఇలా..: బీమారంగంలో– 44 కేసులు, చిట్‌ఫండ్స్ 41, బ్యాంకులు 19, విద్యుత్ 11, ఫైనాన్సులు 07, వ్యవసాయ, గృహాలు 4 చొప్పున, మెడికల్ 3, రవాణా 2 , ఇతరులకు సంబంధించి 46 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తూకాల్లోనే అత్యధికంగా మోసాలు జరుగుతున్నా..కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

**వైద్యంలో నిర్లక్ష్యానికి రూ.10 లక్షల పరిహారం**

మూడో రోడ్డు (అనంతపురం): వైద్యసేవల్లో లోపానికి పరిహారం రాబట్టవచ్చు.. బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రికి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు ఇందుకు ఉదాహరణ. నగరానికి చెందిన అనిల్‌కుమార్ (38) వాంతులు రావడంతో బెంగళూరులోని సీఎంఐ ఆసుపత్రిలో చేర్పించారు. మూత్రపిండాల సమస్య ఉందని తేల్చి శస్త్రచికిత్స చేసి స్టంట్ వేశారు. అనంతరం 4 వారాల తర్వాత స్టంట్ తొలగిస్తామన్నారు. 2018 డిసెంబరు 28న స్టంట్ తొలగించామని చెప్పారు. రెండేళ్ల తర్వాత 2020 జులై 1న రోగికి కాలు నొప్పి రావడంతో తిరిగి అదే ఆసుపత్రికి వెళ్లారు. అప్పుడు ఈ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న మరో ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యులు పరీక్షించి.. స్టంట్ పొరపాటున మూత్రపిండంలోనే ఉందని చెప్పారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి స్టంట్‌ను తొలగించినా.. రోగి వాంతులలో బాధ పడుతూ 2020 డిసెంబరు 21న మృతి చెందాడు. ఇదంతా వైద్యుల నిర్లక్ష్యమేనని బాధితులు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించారు. కమిషన్ ఇరువర్గాల వాదనలను పరిశీలించి వైద్యసేవల్లో లోపానికి రూ.10 లక్షలు చెల్లించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించింది.

6,408 కేసులు నమోదు

1986 నుంచి ఇప్పటివరకు వినియోగదారుల కమిషన్‌లో కేసులు : 6,408 పరిష్కారం అయినవి: 6,227 పెండింగ్: 181

# మిరప రైతు డీలా!

అచ్యుతాపురం :గిట్టుబాటుకాని ధరలు మిరప రైతులకు మంట పుట్టిస్తున్నాయి. కష్టపడి పండించినా ఆశించిన ధరలేక లబోదిబోమంటున్నారు. పెట్టుబడులు దక్కక దిగులు చెందుతున్నారు. పంట ప్రారంభంలోనే ఆశించిన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. గత వారం కుంచం మిరప పళ్లు సన్నాలు రూ. 110, పొట్టికాయులు రూ. 140 వరకు ధర పలకగా శుక్రవారం జరిగిన వారపు సంతలో సన్నరకం రూ. 70–80, పొట్టిరకం రూ. 90–100కి పడిపోయింది. నాణ్యతను దృష్టిలో ఉంచుకొని ఏటా మొదటిసారిగా మార్కెట్‌కు వచ్చిన పండుమిరపను వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. ఈ ధరలు రైతులకు అనుకూలంగా ఉండేవి. గత ఏడాది మార్కెట్ అనుకూలించక నష్టపోయిన రైతులు ఈఏడాదైనా అనుకూలంగా ఉంటుందనే ఆశతో అప్పులు చేసి పండించినా ఫలితం లేకపోయింది. సన్నరకం మిరపపళ్లు కుంచం రూ. 80కే విక్రయించడానికి రైతులు ముందుకొచ్చినా కొనుగోలుదారులు లేకపోవడంతో రైతులు సంతలో దిగాలు చెందారు. అచ్యుతాపురంలో ప్రతి శుక్రవారం జరిగే వారపుసంత, సోమవారం, బుధవారం జరిగే మార్కెట్లలో పండు మిరప కాయలను విక్రయిస్తారు. ఫిబ్రవరి మొదటి నుంచి ప్రారంభమయ్యే విక్రయాలు మే వరకు కొనసాగుతాయి. జిల్లా



వ్యాప్తంగా పండు మిరప కావాలనుకునే వారు, అవకాయ వ్యాపారస్థులు వీటి కొనుగోలుకు అచ్యుతాపురం వస్తారు. నిత్యావసర ధరలు పెరిగిపోగా మిరపపండ్లు ధరలు తగ్గిపోవడంతో రైతులకు పాలుపోవడంలేదు. ఇప్పటికే తెగుళ్లతో సగం నష్టపోయామని ఇప్పుడు కొనుగోలుచేసే వారులేక రోడ్డున పడ్డామంటుని ఆవేదన చెందుతున్నారు.

**పెట్టుబడీ దక్కడంలేదు- కూండ్రపు శ్రీరామ్మూర్తి, రైతు, భోగాపురం**

మిరప సాగు ఒకప్పుడు లాభదాయకంగా ఉండేది. కోవిడ్ తరువాత వరసగా ప్రతి ఏడాది నష్టాలే వస్తున్నాయి. కూలీకి రోజుకు రూ. 500 ఇస్తే తప్ప పనికిరావడంలేదు. తెగుళ్లు, పెట్టుబడులు పెరిగిపోయి సాగు గిట్టుబాటు కావడంలేదు. ఇదే సమయంలో మిరపధరలు పడిపోయాయి. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకురావడంలేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

# పురాతన సమాధులు ధ్వంసం

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి గ్రామంలో పురాతన సమాధులను ఓ వైకాపా నాయకుడు ధ్వంసం చేసి భూమి కబ్జాకు యత్నిస్తున్నాడు. సర్వేనంబరు 441–5లో 1.78 ఎకరాల్లో మూడు సమాధులను, శాసనాలను 1995 సంవత్సరంలో కేంద్ర పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ అధికారులు గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు. కొన్నేళ్ల తర్వాత గుట్టుచప్పుడు కాకుండా కొందరు తవ్వకాలు జరపడంతో గోతులు ఏర్పడ్డాయి. వాటిని మట్టితో కప్పివేశారు. 2022లో వైకాపా నాయకుడు ఆ భూమి తమదేనంటూ తవ్వకాలు చేయగా జిల్లా అధికారులు అడ్డుకొన్నారు. మళ్లీ 2024లో రాత్రికిరాత్రే తవ్వకాలు చేసి బండరాళ్లు తొలగించి చదును చేసేందుకు యత్నించారు. అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి



ఎలాంటి తవ్వకాలు చేయరాదని హెచ్చరించారు. తాజాగా కొన్ని రోజుల నుంచి అదే ప్రాంతంలో సమాధుల గుట్టలను, శాసనాలను ఆనవాళ్లు లేకుండా చేసి పంటల సాగుకు సిద్ధం చేస్తున్నాడు. ఈ విషయమై పురావస్తు శాఖ ఏడీ రజితను వివరణ కోరగా ఆ ప్రాంతంలో బృహత్‌శిలాయుగపు నాటి మూడు సమాధులు ఉన్నాయి. అక్కడ తవ్వకాలు జరిపి సమాధులు, శాసనాలు లేకుండా చేయాలని చూశారు. అప్పట్లో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ ప్రాంతాన్ని చదును చేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయరాదని చెప్పినా వినడం లేదు. సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని చెప్పారు.

# గానుగాట మళ్లీ ఆగింది!

చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారంలో గానుగాటకు మళ్లీ బ్రేక్ పడింది. తరచూ యంత్రాలు మొరాయించడం ఒక కారమణమైతే.. రసం మరిగించేందుకు తగినంత ఆవిరి సామర్థ్యం లేకపోవడంతో తాజాగా గానుగాట ఆగింది. స్ప్రే పాండ్‌లో నీరు కలుషితం కావడంతో గానుగాడటం నిలిపివేశారు. స్ప్రే పాండ్‌ను పరిశుభ్రం చేసే కార్యక్రమం జరుగుతోంది.



**55 రోజుల్లో.. 189.20 గంటలు**

నిన్న, మొన్నటి వరకు బాయిలర్, టర్బయిన్, మిల్లు హౌస్‌ల్లో సాంకేతిక సమస్యలు తలెత్తేవి. బేగాస్ లేక గానుగాట నిలిచిన సందర్భాలున్నాయి. తాజాగా స్ప్రే పాండ్‌లో నీరు కలుషితమై ఆగిపోయింది. ఈ ఏడాది ఆలస్యంగా జనవరి మూడో వారంలో గానుగాట ప్రారంభించారు. 55 రోజుల్లో 189.20 గంటలపాటు కర్మాగారంలో అంతరాయాలవల్ల గానుగాట ఆగింది. ప్రారంభంలోనే బాయిలర్ డి ఫ్యాన్ దెబ్బతినడంతో ఏకంగా 23 గంటలు ఆగిపోయింది. ఇటీవల 36 గంటలు నిలిచిపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా గానుగాట నిలిచిన విషయాన్ని ఎండీ సన్యాసినాయుడు కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కర్మాగారం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయానికి సమస్యను పరిష్కరించి గానుగాటను పునః ప్రారంభిస్తామని ఎండీ సన్యాసినాయుడు పేర్కొన్నారు.

# అడ్డదారి హాజరుకు కళ్లెం!

అనంతపురం : సంక్షేమ వసతి గృహాల్లో బోగస్ హాజరుకు కళ్లెం వేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీసీ వసతి గృహాల్లో వేలిముద్ర, ఆధార్ ద్వారా హాజరు తప్పనిసరి లేదు. ఎవరైనా విద్యార్థులకు సాంకేతిక సమస్య ఎదురైతే మ్యానువల్‌గా హాజరు వేసుకొనే అవకాశం ఉండేది. మ్యానువల్‌గా హాజరు ఉండటంతో డైట్ బిల్లులు పొందే సమయంలో ఎక్కువ హాజరు చూపి అక్రమాలకు తెరలేపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలకు కళ్లెం వేసే దిశగా ఒక్కో అడుగు పడుతోంది. రాష్ట్రంలో అనంతపురం జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్రేషన్ సిస్టమ్) తీసుకుంటున్నారు. మార్చి నుంచి వంద శాతం అమలు చేయబోతున్నారు.

**ఒక్కరోజులోనే 1812 మంది తేడా..**

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేశారు. 7,379 మంది విద్యార్థులకు కేవలం 5,567 మంది మాత్రమే హాజరు నమోదైంది. ఈ లెక్కన ఒక్క రోజులోనే 1,812 మంది విద్యార్థుల హాజరు నమోదు లేకపోవడంతో సరాసరిగా రోజుకు రూ.90 వేలు వారికి డైట్ బిల్లులు అక్రమంగా పొందడానికి వీలుకాదు. ఎఫ్ఆర్ఎస్ లేని సమయంలో హాజరు కాని విద్యార్థులను కూడా ఏదో ఒక లెక్క



వేసి డైట్ బిల్లులు పొందే వెసులుబాటు ఉండేది.

**వేగం.. పారదర్శకం**

గతంలో విద్యార్థులు హాజరు వేయడానికి గంటల తరబడి వరుసలో ఉండాల్సి ఉండేది. 200 మంది విద్యార్థులు ఉండే వసతి గృహంలో కనిష్ఠంగా 2 గంటలు గరిష్ఠంగా 3 గంటలు హాజరు వేయడానికి సమయం పట్టేది. తాజాగా చరవాణితో ముఖ ఆధారిత హాజరు ఉండటంతో అందరూ ఒకేచోటకు వస్తే కేవలం అరగంటలోపే ప్రక్రియ పూర్తి అవుతోంది. ఒక్కోసారి అంతర్జాలం లేకున్నా సేవ్ చేసుకొని మళ్లీ అంతర్జాలం రాగానే అది ఆన్‌లైన్‌లో అనుసంధానం అవుతోంది. ఈప్రక్రియ వల్ల హాజరు పారదర్శకంగా ఉండటంతో పాటు వేగంగా పూర్తి అవుతుంది. వైకాపా హయాంలో 2023 సెప్టెంబరు 1 నుంచి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**మార్చి నుంచి అమలు చేస్తాం- ఖుష్బు కొఠారి, బీసీ సంక్షేమ సంచాలకులు**

బీసీ వసతి గృహాల్లో ప్రయోగాత్మకంగా హాజరు వేస్తున్నాం. ఇప్పటికే 7,290 మంది విద్యార్థులను నమోదు చేశాం. ప్రతి విద్యార్థి నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారానే హాజరు తీసుకుంటాం.

# కరవుసీమలో జలకళ

డోన్ : జీవకోటికి నీరు ప్రాణాధారం. ఒక్కనీటి చుక్క ఎంతో విలువైంది. నీటి కోసం ఎన్నో యుద్ధాలు జరిగాయని విన్నాం. కరవు సీమలో నీటి జాడలు లేక రైతుల కళ్లల్లో కన్నీటి ధారలు చూశారు. వేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నా చుక్కనీరు పంటలకు అందించలేని పరిస్థితులను చూసి ఆ రైతుల ఆశలు నింపేందుకు ఆర్డీటీ ముందుకొచ్చింది. సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను ఎంపిక చేసుకుని చెక్‌డ్యాం నిర్మాణాలకు నడుం బిగించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.3.27 కోట్లతో 38 చెక్‌డ్యాంలు నిర్మించింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరవు పరిస్థితులు ఎదుర్కొనే గ్రామాలను ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఎంపిక చేసుకుంది. ఇలా మొదటగా 2015లో తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లోని పలు గ్రామాలను ఎంపిక చేసుకుంది. తుగ్గలి మండలంలో 12, వెల్దుర్తి మండలంలో 2 చెక్‌డ్యాంలను నిర్మించింది. డోన్ మండలంలో 15, ప్యాపిలి మండలంలో 9 చెక్‌డ్యాంలను నిర్మించినట్లు ఆర్డీటీ అధికారులు తెలిపారు. డోన్, పత్తికొండ ప్రాంతాలు కరవు ప్రాంతాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.




ఇలాంటి పరిస్థితుల్లో ఆర్డీటీ సంస్థ ముందుకు వచ్చి నీటి నిల్వచేస్తేనే రైతులకు ఉపయోగం ఉంటుందనే భావనతో చెక్‌డ్యాంల నిర్మాణం పలు చెక్‌డ్యాంలకు హంద్రీనీవా నీరు నింపటంతో జలకళలు సంతరించుకుంది.

**రూ.3.27 కోట్ల ఖర్చు**

నాలుగు మండలాల్లో మొత్తం 38 చెక్‌డ్యాంలను నిర్మించేందుకు ఆర్డీటీ సంస్థ ద్వారా రూ.3.27 కోట్లు ఖర్చుచేశారు. వీటిలో పలు చెక్‌డ్యాంలకు పత్తికొండ, డోన్ మీదుగా వెళ్లే హంద్రీ నీవా కాల్వ నుంచి నీటిని ఎత్తిపోసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం చెక్‌డ్యాంలలో 1023.17 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉంది. చెక్‌డ్యాంల పరిధిలో 457 బోర్లలో, 19 బావుల్లో నీటి నిల్వలు పెరిగినట్లు గుర్తించారు. వీటి పరిధిలో 2,569 ఎకరాల్లో పంటల సాగు చేపడుతున్నారు.

**సాగుకు ఉపయోగం - పరమేష్, కొత్రాయి**

మా పొలం పక్కనే ఆర్డీటీ సంస్థ చెక్‌డ్యాం నిర్మించింది. ఈ కట్టడంతో వర్షాలకు నీరు నిలిచి నిండుగా ఉంది. చెక్‌డ్యాంలో నీటితో కళకళలాడుతుండటంతో నీటి కష్టాలు తీరేందుకు అవకాశం ఏర్పడింది. సమీప ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయి.

**భూగర్భజలాలు పెరిగాయి లక్ష్మణమూర్తి, కొత్రాయి**

మా పొలం పక్కనే చెక్‌డ్యాంను నిర్మించారు. దీంతో నీరు నిలిచి మా పొలంలో ఉన్న బోర్లలోనూ నీరు పుష్కలంగా ఉంది. వేసవి వస్తే బోర్లు అడుగంటిపోతాయనే ఆందోళన ఉండేది. కానీ ఈ ఏడాది ఆ ఆందోళన లేదు. చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భజలాలు పెరుగుతాయి.

అన్నదాత సంక్షేమానికి సంస్థ కృషి

ఆంథోనిరెడ్డి, ఆర్డీటీ ఏటీఎల్, డోన్.

రైతుల బాగుకోసం విశేష ఆర్డీటీ కృషి చేస్తోంది. కరవు పరిస్థితులు ఎదుర్కోవాలంటే వర్షం నీటిని ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి. నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం ఉంటే భూగర్భజలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. చెక్‌డ్యాం నిర్మాణంతో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి.

# పౌష్టికాహారం.. ఆరోగ్యం



అనంతపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్నంగా అమలు చేస్తున్న 'పోషణ వాటిక' (పెరటి తోట) ఆలోచన సత్ఫలితాన్ని ఇస్తోంది. కేంద్రాల ఆవరణాల్లోనే తాజా ఆకుకూరలు.. కూరగాయలు పండిస్తుండటంతో నిరుపేద బాలింత/గర్భిణులు, పిల్లల ఆరోగ్యానికి దోహదం చేస్తోంది. ఈ పోషణ వాటికల ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలన్నీ తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రాలుగా రూపాంతరం చెందుతుండటం ప్రస్తావనార్హం. రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేతపట్టిన తర్వాత గతేడాది అక్టోబరులో ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పెరటి తోటల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 'సక్షం' పథకం ద్వారా నిధులు సమకూరుస్తోంది.

**ఒక్కో వాటికకు రూ.10 వేలు**

అనంత జిల్లాలో మొత్తం 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,73,579 మంది లబ్ధిదారులు ఉన్నారు. పక్కా భవన సదుపాయం, తగిన స్థలం కలిగిన 185 కేంద్రాలకు 'సక్షం' కింద పోషణ వాటికలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు చొప్పున నేరుగా సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇలా 185 కేంద్రాలకు మొత్తం రూ.18.50 లక్షలు గతేడాది అక్టోబరులోనే మంజూరు చేశారు. అలాగే నీటి సంరక్షణ కేంద్ర నిర్మాణానికి రూ.16 వేలు, ఆట బొమ్మలకు రూ.19,800 ప్రకారం కూడా మంజూరయ్యాయి. ఇప్పటికే నీటి సంరక్షణ కేంద్రాల నిర్మాణం కొనసాగుతోంది. త్వరలోనే ఆటవస్తువులు సరఫరా అవుతాయి.

**ఏమేం పండిస్తున్నారంటే..!**

అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పెరటి తోటలు పెంచుతున్నారు. ఎక్కువగా తోటకూర, గోంగూర, చుక్కకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమేర, బెండకాయ, వంకాయ, గోరుచిక్కుడు, బీరకాయ, సొరకాయ.. వంటి వాటిని పండిస్తున్నారు. వీటిని క్రమంగా తీసుకుంటే రక్తహీనత, పోషణ లోపం.. వంటి రుగ్మతలు దరిచేరవు. ఆసక్తి కలిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక అడుగు ముందుకేసి.. అదే పెరటి తోటల్లోనే నిమ్మ, తులసి, అరటి, దానిమ్మ, వంటి పండ్ల మొక్కలు కూడా పెంచుతున్నారు.

**ప్రతిష్టాత్మకంగా పెంచుతున్నాం**

– వనజా అక్కమ్మ, పీడీ, ఐసీడీఎస్

సక్షం పథకం ద్వారా ఒక్కో కేంద్రానికి రూ.45,800 ప్రకారం నిధులు వచ్చాయి. ఇవన్నీ గతేడాది అక్టోబరులోనే క్షేత్రస్థాయికి వెళ్లాయి. తొలి విడతగా పోషణ వాటికలు పెంచుతున్నాం. తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వాలన్నదే సంకల్పం. ఇప్పటికే కోడిగుడ్లు, పాలు, కిట్లు, బాలామృతం.. వంటి పౌష్టికాహారంతోపాటు ఈ కూరగాయలు, ఆకుకూరలను ఇస్తున్నాం.

# జీతం దూరం.. జీవనం భారం



కళ్యాణదుర్గం : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు సక్రమంగా అందడం లేదు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు వాపోతున్నారు. కనీసం అప్పులు కూడా పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఈ నెల 18 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. దీంతో పథకం పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. ఈ పథకం ద్వారా కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. పథకంలో ప్రస్తుతం 630 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నారు.

**అందాల్సిన జీతాలు, పీఎఫ్ వివరాలు**

ఫేస్-1, 4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈ పథకం కింద 292 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నెలకు జీతం రూ.16,200 ప్రకారం ఆరు నెలలకు సంబంధించి రూ.2,83,82,400, 30 నెలల పీఎఫ్ రూ.2,400 ప్రకారం రూ.2,10,24,000 రావాల్సి ఉంది.

ఫేస్-2 పరిధిలో హిందూపురం నియోజకవర్గంలో 52 మంది కార్మికులకు నెలకు రూ.14 వేల ప్రకారం 10 నెలల జీతం రూ.72.80 లక్షలు, రూ.1,230 ప్రకారం 10 నెలల పీఎఫ్ రూ.6.39 లక్షలు. పరిగి పరిధిలో 14 మందికి 30 నెలల పీఎఫ్ రూ.5,16,600 రావాల్సి ఉంది.

ఫేస్-3 పరిధిలో మడకశిర నియోజకవర్గంలో 172 మంది కార్మికులు పని చేస్తున్నారు. నెలకు రూ.14 వేలు ప్రకారం ఐదు నెలలకు రూ.12.40 కోట్లు, రూ.2,400 ప్రకారం పీఎఫ్ 10 నెలలకు రూ.41.28 లక్షలు రావాల్సి ఉంది.

**అప్పులు పుట్టడం లేదు**

– నరసింహులు, లైన్‌మెన్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

శ్రీరామిరెడ్డి నీటి పథకంలో పని చేస్తున్న కార్మికులంటే అప్పులు పుట్టడం లేదు. నేను 14 ఏళ్లుగా లైన్‌మెన్‌గా పని చేస్తున్నా. నా భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా నెలకు రూ.5 వేలు ఖర్చు అవుతోంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణకు మరో రూ.8 వేలు అవసరం. రూ.1.10 లక్షల వరకు అప్పు చేశాను. అవసరానికి ఇతరులతో అప్పు అడిగితే ఇవ్వడం లేదు. కుటుంబాన్ని నెట్టుకు రావడం భారమవుతోంది. ప్రతి నెలా జీతం వచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

**కుటుంబ పోషణ కష్టంగా ఉంది**

– సోమశేఖర్, ఫిట్టర్, పరిగి మండలం

శ్రీరామిరెడ్డి నీటి పథకంలో పదేళ్లుగాపని చేస్తున్నా. జీతంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వయస్సు మీదపడ్డ తల్లిదండ్రులు, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నా. ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు అప్పు చేశా. 11 నెలల నుంచి జీతం రాలేదు. మా బాధలు ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు. సమ్మె చేస్తే తప్పా వేతనం వచ్చే పరిస్థితి లేదు.

**నెలాఖరు వరకు జమ అవుతాయి**

– సురేశ్, ఎస్ఈ, నీరుపారుదలశాఖ

ఈ నెలలో బిల్లులకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయి. గుత్తేదారుల వివరాలు సేకరించాం. కార్మికులకు ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పాం. ఈ నెలాఖరు వరకు జీతాలు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి.

# పెద్దాసుపత్రికి అనారోగ్యం



హిందూపురం : హిందూపురం జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు, సిబ్బంది ఉన్నప్పటికీ ఆ మేరకు బాధితులకు వైద్యసేవలు అందటం లేదు. ఈ ఆసుపత్రికి వెళితే వైద్యం అందుతుందన్న విశ్వాసం సన్నగిల్లింది. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటం, స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రి బాగోగుల గురించి ఆలోచించక, స్థానిక అధికారి పర్యవేక్షణ సమర్థంగా లేక సామాన్యులకు వైద్యం దూరం అయిందనే ఆరోపణలున్నాయి. గతంలో సేవల్లో ఎంతో ఘనత సొంతం చేసుకొన్న ఈ ఆసుపత్రి నేడు ఈ దుస్థితికి చేరడంపై పట్టణ, సమీప ప్రాంతాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మాసం ఆసుపత్రిని సందర్శించి వైద్యసేవలు పరిశీలించేందుకు నియమించిన ఉన్నతాధికారి కనీసం ఇక్కడికి రాకపోవడం గమనార్హం.

**ఏడేళ్లుగా పనిచేయని సిటీ స్కాన్‌యంత్రం**

ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ యంత్రం ఏడేళ్లుగా మూలన పడింది. రోజూ 100 మందికి పైగా స్కానింగ్ అవసరం ఉంటుంది. దీంతో వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతుండటంతో సామాన్య ప్రజలు రూ.800 నుంచి రూ.6 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పాడైన ఈ యంత్రం మరమ్మతులకు పెద్ద మొత్తం వ్యయం అవుతుండటంతో కొత్తయంత్రానికి అధికారులు ప్రతిపాదనలు చేసినా ఇప్పటి వరకు మంజూరుకు నోచుకోలేదు.

సిఫార్సుల్లో రికార్డు: కేంద్రంలో నలుగురు గైనకాలజిస్టులున్నప్పటికీ ఇద్దరు సెలవుల్లో ఉన్నందున ప్రస్తుతం ఇద్దరితో నెట్టుకొస్తున్నారు. సాధారణంగా ప్రసవాలు అయ్యే పరిస్థితి ఉన్నా రెఫర్ పేరుతో అనంతపురం, బెంగళూరుకు పంపుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం కన్నా వారి సొంత ఆసుపత్రిలో పనిచేయడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. గత సంవత్సరం 4,902 మంది ప్రసవాల కోసం ఆసుపత్రిలో చేరగా సిజేరియన్, సాధారణ ప్రసవాలు 2,691 జరుగగా మిగిలిన 2,211 కేసులు వివిధ ప్రాంతాలకు రెఫర్ చేసినవే.

**సమయపాలన పాటించని వైద్యులు**

వైద్యుల్లో ఒకరిద్దరు మినహా అందరికీ సొంత క్లినిక్‌లు ఉన్నాయి. దీనివల్ల వీరు వాటిపై చూపుతున్న శ్రద్ధ ఇక్కడి సేవలపై చూపడం లేదనే ఆరోపణలున్నాయి. వీరు సమయపాలన పాటించకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన బాధితులు గంటలకొద్దీ నిరీక్షిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. **మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు –** లింగన్న, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రికి వచ్చే వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకొంటున్నాం. సిటీ స్కానింగ్ యంత్రం, వైద్యుల ఖాళీలు భర్తీ చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఈ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి.

# పేదల విద్యావికాసానికి ఆర్డీటీ ఆసరా

అనంతపురం : స్పందించు.. సాయం అందించు అనే నినాదంతో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థ నిరుపేద విద్యార్థుల విద్యావికాసంతో పాటు, గూడు లేని పేదలకు పక్కా గృహాలు నిర్మించి వారికి ఆసరగా నిలుస్తోంది. స్పెయిన్, జర్మనీ దేశాలకు చెందిన దాతల నుంచి సేకరించిన నిధులతో పరిగి మండలంలోని ఎస్.బీరేపల్లి, పైడేటి, కొడిగెనహళ్లి తదితర గ్రామాల్లో విద్యామందిరాలు నిర్మించింది. అంతేగాక పక్కాగృహాలు నిర్మించి విద్యార్థులు, పేదలకు అండగా నిలుస్తోంది. సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పైడేటీ ఎస్సీ కాలనీలో ఆర్డీటీ వ్యవస్థాపకులు డా.విన్సెంట్ పెర్రర్ పేరుతో



రూ.12.95 లక్షల వ్యయంతో విద్యామందిరాన్ని నిర్మించారు. ఇటీవలే ఈ విద్యామందిరం నిర్మాణానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన స్పెయిన్, జర్మనీ దేశాలకు చెందిన దాతలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. గతంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో పి.నరసాపురం పంచాయతీ పరిధిలోని ఎస్.బీరేపల్లిలో నిర్మించిన పాఠశాల తరగతి గదుల సముదాయంలో విద్యార్థుల విద్యాభ్యాసం కొనసాగుతోంది. పాఠశాలల భవన నిర్మాణాలతో ఎటువంటి ఆసరా లేని పేదలకు పక్కాగృహాలు నిర్మించింది. మండల పరిధిలోని యర్రగుంట, శాసనకోట, ఎస్.బీరేపల్లి గ్రామాల్లో ఇళ్లులేని నిరుపేదలకు పక్కాగృహాలను కట్టించి ఇచ్చింది.

**సామాజిక సేవా కార్యక్రమాలివి..**

కొడిగెనహళ్లిలో ఏఎం.లింగన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆడిటోరియం నిర్మాణం.

కొడిగెనహళ్లిలోని ఎస్సీ కాలనీలో పాఠశాల భవన సముదాయాలు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఎస్.బీరేపల్లిలో నూతనంగా 20 పక్కాగృహాల నిర్మాణ పనులు చేపడుతున్నారు.

**భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు**

– రఘురాం, ఏటీఎల్ మడకశిర. ఆర్డీటీ

పరిగి మండలంలో సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో విద్యార్థుల విద్యావికాసంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నాం. గూడు లేని పేదలను గుర్తించి వారికి సంస్థ ఆధ్వర్యంలో పక్కాగృహాలను నిర్మించి ఇస్తాం. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి చేయూత నందిస్తోంది.

# మగ్గానికి మంచి రోజులు

ఎమ్మిగనూరు : గద్వాల పట్టుచీరలకు ప్రసిద్ధిగాంచిన చేనేతపురి ఎమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.. పక్క రాష్ట్రం కర్ణాటకకు చెందిన పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి చేనేత, జౌళి శాఖ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. పార్కు వస్తే సుమారు 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభించనుంది. ఎమ్మిగనూరులో చేనేత పార్కు ఏర్పాటుకు గతంలోనే పునాది వేశాం.. వైకాపా రద్దు చేసింది.. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే అమలుకు అడుగులు పడ్డాయి.

**2014లో తెదేపా పునాది**

చేనేతలకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి శంకుస్థాపన చేశారు.బనవాసి ఫారంలో సర్వే నంబర్లు 343, 244లో 91.31 ఎకరాలు కేటాయించారు.

రూ.44 కోట్లతో అభివృద్ధి చేయాలని, తుంగభద్ర దిగువ కాల్వ నుంచి



నీటిని మళ్లించాలని నిర్ణయించారు.

డిజైన్లు, ప్రముఖ వస్త్ర పరిశ్రమ, గార్మెంట్స్ వస్త్ర ఉత్పత్తి పరిశ్రమల యజమానులతో చర్చించారు.

2019లో వైకాపా రద్దు

2019లో వైకాపా అధికారంలోకి రావడంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్కు ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. పార్కుకు కేటాయించిన స్థలంలోని 9 ఎకరాల్లో 550 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాన్ని ప్లాట్లుగా మార్చారు. తెదేపా నాయకులు కోర్టుకు వెళ్లడంతో ఇది నిలిచిపోయింది.

**ప్రస్తుతం రూ.700 కోట్ల వ్యాపారం**

ఎమ్మిగనూరు, కోడుమూరు, గూడూరు, ఆదోని, నాగలదిన్నె, నందవరం గ్రామాల్లో చేనేత కార్మికులు ఉన్నారు.

గతంలో 23 వేల మగ్గాలు ఉండగా.. సరైన ఉపాధి లేకపోవడంతో మగ్గాలు నేసేవారు తగ్గిపోయారు.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 వేల పట్టు మగ్గాల ద్వారా 17 వేల మంది కూలీలు, చేనేత సొసైటీ 44 ఉండగా, వాటి పరిధిలో 1,200 మంది ఉపాధి పొందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ సుమారు 800 మంది ఉండగా, వీరి పరిధిలో సుమారు రూ.700 కోట్ల (ఏడాదికి) విలువ చేసే పట్టు వస్త్రాలు తయారు చేస్తున్నారు.

చురకలు



# తుడా.. మనుగడెలా?

తిరుపతి : తుడాలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు సమగ్ర వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు కంగుతినే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అందులో ముఖ్యమైనదే తుడా మనుగడ. స్వయం సమృద్ధితో నడిచే సంస్థకు ప్రస్తుతం అప్పులు తప్ప ఆస్తులు కనిపించడం లేదని, ఉన్న ఆస్తులన్నీ గత పాలనలోనే తెగనమ్మడంతో భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రెండున్నరేళ్లలో 113 పర్యాయాలు వేలం**

2021 ఆగస్టులో ప్రారంభమైన తుడా ఆస్తుల విక్రయాలు 2024 ఫిబ్రవరి వరకు నిరంతరాయంగా కొనసాగాయి. మొత్తం 113 పర్యాయాలు తుడా ప్లాట్ల విక్రయాలు చేపట్టగా.. ప్రతి వేలంలో సగటున 10-30 ప్లాట్లు విక్రయానికి ఉంచారు. మధ్యతరగతి, ఉన్నత వర్గాలు, వ్యాపారవేత్తలను దృష్టిలో ఉంచుకుని మంగళం, వేదాంతపురం,



చెన్నాయగుంట పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎంఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ, ప్రీమియం లేఅవుట్లలో ఖాళీగా ఉన్న వందలాది పాట్లను విక్రయించేశారు. భవిష్యత్ అవసరాల కోసం రిజర్వు చేసుకున్న రేణిగుంట మండలంలోని సూరప్పకశం వద్ద గల 145 ఎకరాల స్థలాన్ని లేఅవుట్లుగా మార్చి విక్రయాలు ప్రారంభించి రూ.345 కోట్ల ఆదాయ అంచనాలతో విక్రయాలు చేపట్టారు. చివరకు రూ.400 కోట్ల నిధులను ఎన్నికల ప్రయోజనాలే లక్ష్యంగా గత పాలకులు ఇష్టానుసారం ఖర్చు చేయడంతో చివరకు తుడా దివాలా తీయాల్సి వచ్చింది.

**సంపాదన వేటలో..**

తుడాకు సాధారణంగా అద్దెలు, భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ల అనుమతుల రూపేణ వచ్చే ఆదాయం రూ.15 కోట్ల వరకు ఉండగా వాటితో చేపట్టే అభివృద్ధి పనుల్లో మిగిలేది శూన్యమని భావించారు గత పాలకులు. అందుకే తుడా ఆస్తులపై పడ్డారు. ప్రజల్లో ఉన్న నమ్మకం, సౌలభ్యం కారణంగా వాటికి గిరాకీ కనిపించడంతో సులువుగా సంపాదించేందుకు వాటి విక్రయాలే శరణ్యమని భావించి ఆచరణలోకి పెట్టారు.

**ల్యాండ్ బ్యాంక్ ప్రతిపాదనలు**

తుడా మనుగడ సాగించేందుకు స్థలాలు కొనుగోలు చేసి వాటిని లేఅవుట్లుగా మార్చి మధ్య, ఎగువ తరగతి ప్రజలకు విక్రయించడం తప్పనిసరి. ఈ క్రమంలో ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేయాలన్న ప్రతిపాదనలున్నాయి. గత ప్రభుత్వంలో వడమాలపేట సమీపంలోని ఎస్వీనగర్ వద్ద ప్రభుత్వ భూమిని తుడా స్వాధీనం చేసుకోగా.. మిగిలిన నియోజకవర్గాల్లో అడుగు ముందుకు పడలేదు. వీటిని లేఅవుట్లుగా మార్చి ప్రజలకు విక్రయిస్తే తప్ప తుడా మనుగడ సాగించే పరిస్థితి కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సాంకేతిక బలం.. కొలువుల నెలవు


ఏర్పేడు : ఐఐటీలో విద్యనభ్యసించాలన్నది ప్రతి విద్యార్థి కల. అయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టాలను అధిగమించి ఐఐటీలో గుర్తింపు పొంది సాంకేతిక నిపుణులుగా స్థిరపడి ఆదర్శంగా నిలుస్తున్నారు. తిరుపతి ఐఐటీ నుంచి పట్టా పొందిన పూర్వ విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో కొలువులు సంపాదించారు.

**అక్షరాల అరకోటి సంపాదన**

మాది హైదరాబాద్ నాన్న రైల్వే ఉద్యోగి, అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి ఐఐటీ చదవాలన్నదే తమ కల. ఈ క్రమంలోనే తిరుపతి ఐఐటీ నుంచి రెండేళ్ల కిందట పట్టా పొం దాను. విద్యనభ్యసిస్తున్న సమయంలోనే ప్రాంగణ ఎంపికల్లో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ లో ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ఏడాదికి రూ.50లక్షలు సంపాదిస్తుండటంతో ఆనందానికి హద్దుల్లేవు.

**వ్యవసాయ కుటుంబం నుంచి**

విజయనగరంలోని కొర్లాం గ్రామంలో వ్యవసాయ కుటుంబం మాది. అమ్మ, నాన్నలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ ఐఐటీ చదివించాలన్నదే వారి కల. ఆశయాలకు తగ్గట్లుగానే నేను కష్ట పడటంతో తిరుపతి ఐఐటీలో గత ఏడాది విద్యను పూర్తి చేశాను. ప్రాంగణ ఎంపికల్లో గురుగ్రామ్‌లోని సంస్థలో ఉద్యోగం లభించడంతో అమ్మ, నాన్నల కష్టానికి ప్రతి ఫలం దక్కింది.



**హైదరాబాదీగా గుర్తింపు**

మాది రాజస్థాన్ అయినప్పటికీ తిరుపతి ఐఐటీలో సీటు రావడంతో ఇక్కడే చదువు పూర్తిచేశా. రెండేళ్ల కిందట బీటెక్ చదువుతున్న సమయంలోనే ప్రాంగణ ఎంపికల్లో హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సంస్థలో ఉద్యోగం వచ్చింది. దీంతో ఏడాదికి రూ.35లక్షలకు పైగా సంపాదిస్తున్నా. నేను హైదరాబాద్ కుర్రాడిగా గుర్తింపు పొందా.

**రాష్ట్రాలు వేరైనా స్నేహం ఒక్కటే**

మాది ప్రయాగ్‌రాజ్ ఐఐటీలో చదువు పూర్తికాగానే గురుగ్రామ్‌లోని సంస్థలో ఉద్యోగం వచ్చింది. మా స్నేహితులంతా ప్రాంగణ ఎంపికల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడి నప్పటికీ నిత్యం ఆన్‌లైన్ వేదికగా విద్యార్థి దశలోని తీపి గుర్తులను స్మరించుకుంటూ ఉంటాం. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థు లైనప్పటికీ ఐఐటీలో ఏర్పడిన స్నేహబంధం మరువలేనిది.

# 'భూ'దస్త్రం.. కాసుల అస్త్రం



కర్నూలు : రెవెన్యూ అధికారులు భూ యజమానుల అవసరాలను బట్టి ఒక్కో పాసు పుస్తకానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. నగర పరిధిలో, జిల్లా కేంద్రం సమీపంలో, పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములైతే పట్టాదారు పాసు పుస్తకాలకు భారీగా వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే తిరస్కరిస్తున్నారు. ఇదంతా తహసీల్దార్ల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

**ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో డిజిటల్ కీ**

తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అయితే వారిని కాదని కొందరు తహసీల్దార్లు తమ వ్యక్తిగత సహాయకులుగా కొందరు ప్రైవేటు కంప్యూటరు ఆపరేటర్లను పెట్టుకున్నారు. వారి చేతుల్లోనే తహసీల్దారు డిజిటల్ కీ ఉంటుంది. బేరం కుదిరి పైకం చేతికందితే ఆయన ఫోన్లు సమాచారం చేరవేస్తుంటారు. ఆపరేటర్ పనిచేసి పెడుతుంటారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి డిజిటల్ కీ ఉంటుండటంతో ఆన్‌లైన్‌లో భూ రికార్డులను మార్చేస్తున్నారు.

**మ్యుటేషన్లకు ముడుపులు**

మ్యుటేషన్లకు దరఖాస్తు చేసుకున్న తర్వాత 24 గంటల్లోనే ఫారం-8 జనరేట్ చేయాలి. ఆ వెంటనే వీఆర్వో అమ్మకందారులు, కొనుగోలు దారులతోపాటు గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాల యం బోర్డులో నోటీసులు ప్రదర్శించాలి. నోటీసులు ఇవ్వడం లేదు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించడం లేదు ముడుపులిస్తే చాలు ఒక్కరోజులోనే పని చేసిపెడుతున్నారు.పూర్వీకుల పేర్లపై ఉన్న భూములను తమ పేరిట మ్యుటేషన్ చేయాల ంటూ పలువురు రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతు న్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించడం లేదు. తన తండ్రి పేరుతో ఉన్న రెండెకరాలను ఓ రైతు తన పేరుపై మార్చుకున్నారు. పాసు పుస్తకం కోసం వీఆర్వోను కలిశారు. దరఖాస్తు చేసి పాసు పుస్తకం ఇప్పిస్తానని.. దరఖాస్తు చేశాక రూ.10 వేలు, పని పూర్తైన వెంటనే మరో రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరికి రాజకీయ నాయకుడితో చెప్పిస్తే రూ.10 వేలు తగ్గించారు. ఇలా రెవెన్యూ శాఖలో అక్రమాలు వెళ్లూనుకుపోయి ంది. పాసు పుస్తకాలు, భూ కొలతలకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు దారుడికి ప్రభుత్వం ఫోన్ చేయించి సమస్యలు తెలుసుకుంటోంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల తీరు వెలుగులోకి వచ్చింది.

# పార్కింగ్ సిద్ధం.. భద్రత కట్టుదిట్టం




శ్రీశైలం : జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం వేడుకలకు లక్షలాదిమంది భక్తులు కార్లు, జీపులు, బస్సులు, ఇతర వాహనాల్లో శ్రీగిరికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో వచ్చే వాహనాలను ప్రణాళికాబద్ధంగా పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. బస్సులకు, కార్లకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

**3,640 బస్సులకు చోటు**

బస్సుల పార్కింగ్ కోసం మొత్తం 13.80 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. ఇందులో 3,640 బస్సులను నిలిపేందుకు అవకాశం ఉంది. గణేశ్ సదన్ ఎదురుగా ఏపీఎస్ ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీ, కర్ణాటక ఆర్టీసీ బస్టాపులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించారు.శ్రీశైలం వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించడంతో పాటు ట్రాఫిక్‌జామ్ కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి క్రేన్లు, మూవింగ్ వాహనాలను సిద్ధం చేశారు.శ్రీశైల క్షేత్రంలో 6 కి.మీ మేర రెండు వరుసలున్న వలయ మార్గంలో ఒక వరుసలో కార్లు నిలిపేందుకు అవకాశం కల్పించనున్నారు.వాహనాలు క్రమపద్ధతిలో రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రీకాస్ట్ డివైడర్లను ఏర్పాటు చేశారు.

**కార్లు.. జీపులకు**

కార్లు, జీపుల పార్కింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 25.20 ఎకరాల స్థలాలు గుర్తించారు. ఇందులో 5,050 వాహనాలు నిలిపే అవకాశం ఉంది. గణేశ్ సదన్ పశ్చిమం వైపు, సెంట్రల్ పార్కింగ్ కేంద్రం, ఫిల్టర్‌బెడ్ వద్ద, హెలిప్యాడ్, విభూతి మఠం, మల్లమ్మ కన్నీరు, గురు సదన్ సమీపంలో, ఆగమ పాఠశాల ఎదురుగా, ఆర్టీసీ బస్టాండు వెనుక, వాసవీ విహార్ పక్కన పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద హైమాస్ట్ విద్యుద్దీపాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించారు.


**అన్నివైపులా నిఘా**క్షేత్రంలో బందోబస్తు పర్యవేక్షణకు 581 సీసీ కెమెరాలను అమర్చారు. అన్నపూర్ణ భవన్ వద్ద ఉన్న దేవస్థానం సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను ఆధునీకీకరించారు. 21 ఎల్ఈడీ తెరల ద్వారా అన్ని సీసీ కెమెరాల దృశ్యాలను వీక్షించే ఏర్పాట్లు చేశారు. పీటీజెడ్ కెమెరాలు 20, భక్తుల సంఖ్య (ఆలయం లోపల)ను లెక్కించే కెమెరాలు 5, స్టాటిక్ టైప్ సీసీ కెమెరాలు 553, వాహనాల నంబర్లను గుర్తించే సీసీ కెమెరాలు 3 ఏర్పాటు చేశారు. శిఖరేశ్వరం, ముఖద్వారం, కైలాస ద్వారం, హఠకేశ్వరం, సాక్షి గణపతితో పాటు పాతాళగంగ స్నానఘాట్ల వరకు అన్ని ప్రదేశాలను సీసీ కెమెరాలు బిగించారు.

# సొంత ఆదాయ వనరులేవీ?

విజయనగరం : జిల్లా పరిషత్తుకు సాధారణ నిధులే ప్రధాన ఆదాయ వనరు. ప్రభుత్వం నుంచి వచ్చే తలసరి గ్రాంటు, సీనరేజీ, స్టాంప్‌డ్యూటీ వీటిలో ప్రధానమైనవి. పెరిగిన జనాభాకు అనుగుణంగా వీటి కేటాయింపు లేక ఆదాయంలో ఏటా హెచ్చుతగ్గులు వస్తున్నాయి. ఉన్న వనరుల్లో స్టాంప్‌డ్యూటీ సర్‌ఛార్జి స్థిరాస్తి వ్యాపారంపై ఆధారపడుతోంది. గడిచిన రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తంలో గ్రామ పంచాయతీలకు 50 శాతం, మండల, జడ్పీలకు 25 శాతం చొప్పున సమకూరే అవకాశముంది. గత ప్రభుత్వ విధానాలు నిధులపై తీవ్ర ప్రభావం చూపాయి. 2011 జనాభా ప్రాతిపదికగా నిధుల కేటాయిస్తున్నారు. అప్పటి గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 28.56 లక్షలు కాగా ఇప్పుడు 33 లక్షలకు చేరుకుందని అంచనా. పెరిగిన జనాభా బట్టి కేటాయిస్తే గానీ ఆదాయం పెరిగే పరిస్థితి లేదు. అయిదేళ్లలో సగటు ఆదాయం రూ.7.83 కోట్లు మాత్రమే. ప్రభుత్వ పరంగా వచ్చే గ్రాంట్లు మినహాయిస్తే స్థానికంగా ఉన్న అతిథి గృహం, సమావేశమందిరం, కొత్తవలస దుకాణ సముదాయం, వారపు సంత వేలం ద్వారా వచ్చిన ఆదాయమే దిక్కువుతోంది. జడ్పీ ప్రవేశద్వారం ముందు గత ప్రభుత్వంలో రెండు దుకాణాల నిర్మాణ ఆదాయం తప్ప సొంత ఆదాయ వనరులు పెంచేందుకు ఎలాంటి తీసుకోలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

**ఆదాయమొస్తేనే కేటాయింపులు..**

ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తాగునీరు, ప్రోత్సాహకాలు, నిర్వహణ ఖర్చులు, విరాళాలకు మొత్తం తొమ్మిది రకాల పద్దుల కింద బడ్జెట్‌ను ఖర్చుచేసేలా ప్రతిపాదిస్తారు. ఆదాయంపైనే వీటికి కేటాయింపులు ఆధారపడి ఉన్నాయి.



కరోనాతో రెండేళ్లు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. తర్వాత స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో 2022-23లో రికార్డుస్థాయిలో రూ.17,27,07,740 ఆదాయం లభించింది. ఈ మొత్తంలో రూ.14.55 కోట్లు స్టాంప్‌డ్యూటీ రూపంలో వచ్చింది. తర్వాత మళ్లీ తగ్గుముఖం పట్టింది. 2024-25లో రూ.2.41 కోట్లు మాత్రమే వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గత ప్రభుత్వం ఇసుక అమ్మకాలు చేపట్టింది. సీనరేజీ రూపంలో స్థానిక సంస్థలకు ఆదాయం రావాలి. ఇవి నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లిపోవడంతో ఎంత అమ్మకాలు జరిగాయి? సీనరేజీ ఎంత అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది. **కూటమి సర్కారులో..**కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో ఇప్పటివరకు రూ.7.75కోట్లు ఆదాయం వచ్చింది. స్టాంపు డ్యూటీ రూ.2.41కోట్లు, సీనరేజీల రూపంలో రూ.4.39 కోట్లు, తలసరి గ్రాంటు రూ.89.77 లక్షలు విడుదల చేసింది. మిగిలినది కొత్తవలస దుకాణ సముదాయం, సంత, జడ్పీ అతిథిగృహం, సమావేశమందిరం అద్దె రూపేణా వచ్చినట్లు జడ్పీ ఉప సీఈవో వెంకటరామన్ తెలిపారు. మార్చి నెలాఖరుకు మరో రూ.కోటి వచ్చే అవకాశముందని భావి స్తున్నారు.

# కూడలిలో కుంపటి

కర్నూలు : ఫిబ్రవరిలోనే సూర్యుడు మండిపోతున్నాడు.. ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటింది.. ఎండ తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం పది గంటలకే బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి సూచనలు జారీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్క సమీక్ష నిర్వహించలేదు.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదు. గతేడాది రికార్డు స్థాయిలో 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు



నమోదయ్యాయి. ఏటా వడదెబ్బతో పదుల సంఖ్యలో జనం మృతి చెందుతున్నారు.ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వైద్య, ఆరోగ్య శాఖ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా షేడ్ నెట్‌లు, ప్రథమ చికిత్స కిట్లు సరఫరా చేయాల్సి ఉంది. గనులు తవ్వే ప్రాంతంలో కార్మికులకు అవగాహన కల్పించాలి. ఇప్పటి వరకు చేపట్టలేదు.కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీలు చొరవ తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రణాళిక రూపొందించలేదు. రోడ్లపై ఉంటున్న అవగాహన కల్పించి వసతి కల్పించాలి.

# జొన్న రైతుల వెలవెల

నంద్యాల : జొన్న ధరలు పతనం కావడం.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది కేసీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి. రైతులు వరితోపాటు జొన్న సాగు చేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 30,230 హెక్టార్లు కాగా ప్రస్తుతం 23,207 హెక్టార్లలో సాగైంది. ఈ ఏడాది క్వింటాకు మద్దతు ధర రూ.3,370 ప్రకటించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఎకరాకు 25- 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2,400 ధర పలుకుతోంది. ప్రభుత్వం కొనుగోళ్లు చేస్తే క్వింటాకు రూ.1000 ధర అధికంగా వస్తుంది. ఎకరాకు రూ.20 వేల చొప్పున



ఐదు ఎకరాలకు రూ.1 లక్ష అదనంగా ఆదాయం వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విన్నవిస్తున్నారు. " జిల్లాలో 50 వేల క్వింటాళ్ల జొన్న దిగుబడులు కొనుగోళ్లు చేయాలని జేసీ విష్ణుచరణ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే కొనుగోళ్లు చేపడతామని" మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కె.హరినాథరెడ్డి పేర్కొన్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి : బాలన్న, కోవెలకుంట్ల**

తుపాను కారణంగా మూడుసార్లు విత్తనం వేయడంతో పెట్టుబడి పెరిగింది. దిగుబడి తగ్గింది. సరైన ధర లేదు. బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయట్లేదు. ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి.

# రండి.. గురుకులాలు పిలుస్తున్నాయ్!

నెల్లిమర్ల : ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 10 మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి అయిదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 5 బాలికలు, 5 బాలుర పాఠశాలల్లో 680 మంది ప్రవేశాలకు అవకాశాలు కల్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులు. ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

అర్హతలు..: బీసీ, ఈబీసీ ఇతర విద్యార్థులు 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలు 12 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి. అభ్యర్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆ జిల్లాలోనే చదువుతూ ఉండాలి.

**దరఖాస్తు విధానం..:** అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుం చెల్లించాలి. %https://mjpapbcwreis.apcfss.in% వెబ్‌సైట్‌లో 2025 ఫిబ్రవరి 15 నుంచి మార్చి 15 లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

**సదుపాయాలు..:** ఉచిత వసతి, గురుకుల విధానంలో చదువుకునే అవకాశం. పౌష్టిక విలువలతో కూడిన భోజనం. మూడు జతల ఏకరూప దుస్తులు. దుప్పటి లేక జంకాన. బూట్లు, సాక్స్‌లు, టై, బెల్టు, నోట్, పాఠ్య పుస్తకాలు. కాస్మోటిక్ ఛార్జీలు. సమీకృత పౌష్టికాహారంలో భాగంగా రోజూ వేరుసెనగ చిక్కీ. వారానికి ఆరు రోజులు గుడ్లు. రెండు రోజుల పాటు భోజనంలో చికెన్ ఉంటుంది.

**ఆంగ్ల మాధ్యమంలో విద్య..**

జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉన్నతమైన బోధనాభ్యాసాలు ఉంటాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంచి పౌష్టికాహారం అందజేస్తాం. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అందించేందుకు ఉత్తమమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. బీబీ.రావు, మహాత్మా జ్యోతిబాపులే జిల్లా కన్వీనర్

## చీర కట్టి, పూలు పెట్టిన ఈమె ఎవరో తెలుసా?

కమర్షియల్ హీరోయిన్ అంటే స్కిన్ షో చేయడంతో పాటు, మోడ్రన్ డ్రెస్‌ల్లో తళుక్కున మెరవాలి. కానీ ఈమె ముతక చీరలో, మెడలో మల్లెపూలు పెట్టుకుని కనిపించడం చాలా అరుదుగా మనం చూస్తూ ఉంటాం. ఇక్కడ చీర కట్టి మల్లె పూలు పెట్టి సంసార పక్షంగా ఉన్న ఈ హీరోయిన్‌ను గుర్తు పట్టారా... తమిళ్‌తో పాటు మలయాళం లో పలు సినిమాలు చేసిన ఈమె తెలుగులో త్వరలో ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయింది. ఏకంగా ప్రభాస్‌కి జోడీగా ఈమె ఒక సినిమాలో నటిస్తుంది. ఆ సినిమా విడుదల అయితే టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఈమె పేరు సొంతం చేసుకుని, వరుసగా తెలుగు సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈమె ఎవరు అనే విషయంలో మీకు క్లారిటీ వచ్చి ఉంటుంది. అవును ఈ అమ్మడు మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈమె తెలుగులో ప్రభాస్ రాజాసాబ్ సినిమాలో నటించి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతోంది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ సినిమాల్లోనూ ఈమె నటిస్తూ బిజీ బిజీగా ఉంది. సాధారణంగా మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. కానీ ఈసారి మాళవిక ఇలా చీర కట్టులో గుర్తు



పట్టనంత సింపుల్‌గా ఉండటం వల్ల వార్తల్లో నిలిచింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ మాళవిక సొంతం అంటూ నెటిజన్స్ తెగ కామెంట్ చేస్తూ ఉంటారు. మాళవికను ఇలా చూస్తూ ఉంటే ఇంకా బాగుందని అనిపిస్తుంది అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సాధారణంగా కొందరు హీరోయిన్స్ మోడ్రన్ డ్రెస్‌ల్లో మాత్రమే చూడ్డానికి చక్కగా ఉంటారు, వారిని ఆ డ్రెస్‌ల్లో మాత్రమే చూడగలం. కానీ మాళవిక మోహనన్ మాత్రం ప్రతి ఔట్ ఫిట్‌లోనూ ఆకట్టుకుంటూనే ఉంది. ముఖ్యంగా ఇలా చీర కట్టులోనూ మాళవిక ఆకట్టుకుంటూ ఉందని, ఇంతటి అందం కేవలం మాళవిక మోహనన్‌కే సాధ్యం అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. చీర కట్టులో ఇంత సింపుల్‌గా ఉన్నా పద్దతి అయిన లుక్‌లో భలే ఉంది అంటూ ఫ్యాన్స్ ఈమె ఫోటోలను తెగ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. గత ఏడాది ఈమె ముఖ్య పాత్రలో నటించిన తంగలాన్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఆ సినిమా మిశ్రమ స్పందన దక్కించుకున్నా విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకునే విధంగా మాళవిక మోహనన్ నటించి మెప్పించింది. ఇక ఈ ఏడాదిలో ఈమె నటించిన రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో వైపు సర్దార్ 2 సినిమాలోనూ మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. మాళవిక మోహనన్ రాబోయే రోజుల్లో మరింత బిజీగా టాలీవుడ్‌లో సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈమె నటిస్తున్న రాజాసాబ్ సినిమా వచ్చే నెలలో విడుదల కావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తారేమో చూడాలి.

## అలాంటి వారిని కళ్యాణ్ రామ్ ఎక్కడ్నుంచి పట్టుకొస్తాడో తెలీదు

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా అర్జున్ సన్నాఫ్ వైజయంతీ. కళ్యాణ్ రామ్ కెరీర్లో 21వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయశాంతి కీలక పాత్రలో నటిస్తోంది. విజయశాంతి ఈ సినిమాలో వైజయంతి ఐపీఎస్ పాత్రలో నటిస్తోంది. ఆమె కొడుకుగా కళ్యాణ్ రామ్ ఈ సినిమాలో కనిపించనున్నాడు. టాలీవుడ్ లో లేడీ పోలీసాఫీసర్ పాత్ర అనగానే ముందు గుర్తొచ్చేది విజయశాంతినే. కర్తవ్యం సినిమాలో ఆమె చేసిన వైజయంతి అనే పాత్ర అందరికీ గుర్తుండిపోయింది. ఆ పాత్రకు విజయశాంతి ఏకంగా నేషనల్ అవార్డు అందుకుందంటే ఆమె నటన, ఆ పాత్ర స్థాయి అర్థం చేసుకోవచ్చు. ఆ పాత్రను దృష్టిలో పెట్టుకునే ఈ సినిమాలో కూడా ఆమె పేరు వైజయంతి అనే పెట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



ఇప్పటికే టాకీ పార్టు పూర్తి చేసుకున్న అర్జున్ సన్నాఫ్ వైజయంతి రిలీజ్ డేట్ ను త్వరలోనే మేకర్స్ అనౌన్స్ చేయనున్నారు. ఏప్రిల్ 17 లేదా 18న సినిమాను రిలీజ్ చేయడానికి దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను స్టార్ట్ చేసింది. అందులో భాగంగానే కళ్యాణ్ రామ్, విజయశాంతి ఓ ఈవెంట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ పై విజయశాంతి కీలక వ్యాఖ్యలు చేశారు. బాబు మంచి కథలను, డైరెక్టర్లను ఎక్కడి నుంచి పట్టుకొస్తాడో కానీ ప్రతీ సినిమా హిట్ అవాలనే పట్టుదల, కసితో చేస్తాడని, ఈ సినిమాలో కూడా కళ్యాణ్ రామ్ చాలా కష్టపడ్డాడు అని విజయశాంతి తెలిపారు. సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో సోహైల్ ఖాన్ విలన్ పాత్రలో నటిస్తుండగా శ్రీకాంత్, పృథ్వీరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు కాంతార ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నాడు




## పుష్ప 2తో వచ్చిన లాభాలు.. వీళ్ళు పోగొట్టరు కదా?






తెలుగు సినీ పరిశ్రమలో స్టార్ ప్రొడక్షన్ హౌస్‌గా ఎదిగిన మైత్రి మూవీ మేకర్స్ ఇప్పుడు తమ వ్యాపారాన్ని ఇతర భాషలకు విస్తరించేందుకు భారీ ప్రయోగాలు చేస్తున్నారు. ఈ సంస్థ గత కొంతకాలంగా వరుసగా తెలుగులో సక్సెస్ అందుకుంటూ, భారీ లాభాలు సాధించింది. ముఖ్యంగా పుష్ప 2 సినిమా కోసం పెట్టిన పెట్టుబడులు అంచనాలకు మించి ఫలితాలు అందించాయి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1800 కోట్లకు పైగా వసూలు చేసి, మైత్రికి బిగ్గెస్ట్ ప్రాఫిట్స్ ఇచ్చిన చిత్రంగా నిలిచింది. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు హిందీ, తమిళ పరిశ్రమల్లో కూడా తమదైన ముద్ర వేయాలని మైత్రి పెద్ద స్కెచ్ వేసింది. కానీ ఈసారి మాత్రం రిస్క్ ఎక్కువగానే ఉందనే చెప్పాలి. ప్రస్తుతం మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న హిందీ సినిమా జాట్ పై మంచి అంచనాలు ఉన్నాయి. బాలీవుడ్ యాక్షన్ హీరో సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. గతేడాది గదర్ 2 భారీ విజయం సాధించడంతో, అదే క్రేజ్‌ను క్యాష్ చేసేందుకు మైత్రి ఈ సినిమాను భారీ స్థాయిలో ప్లాన్ చేసింది. కానీ సన్నీ డియోల్ సక్సెస్ ట్రాక్ ఎక్కువ కాలం నిలవకపోవడం, హిందీ మార్కెట్‌లో మాస్ సినిమాలకు ఆదరణ తక్కువగా ఉండటం కొంత కలవరపెడుతున్న అంశాలు. జాట్ కు సరైన ప్రమోషన్ లేకపోతే, మైత్రికి భారీ నష్టాలు తప్పవు. ఇదే కాకుండా మైత్రి మరో రిస్కీ ప్రాజెక్ట్‌ను చేతిలో పెట్టుకుంది. తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా కూడా అదే ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. అజిత్ సినిమాలు ఇటీవల పెద్దగా సక్సెస్ కాకపోవడం, ముఖ్యంగా నిర్మాతలకు భారీ నష్టాలను మిగిల్చిన పరిస్థితి మైత్రిని కొంత రిస్క్‌లోకి నెట్టింది. అజిత్ సినిమాల మీద తమిళ మార్కెట్‌లో భారీ అంచనాలు ఉంటాయి కానీ, గత రెండు సినిమాలకంటే ఈ సినిమా సురక్షితంగా ఉంటుందా అన్నది ప్రశ్నార్థకమే. ఇప్పుడు సమస్య ఏమిటంటే, మైత్రి రెండు భారీ బడ్జెట్ సినిమాలను ఒకే రోజు రిలీజ్ చేయాలని నిర్ణయించుకోవడం. రెండు ప్రాజెక్టులు భారీ స్థాయిలో విడుదల కావాలి, మంచి బజ్ క్రియేట్ కావాలి. కానీ ఒకే రోజు రిలీజ్ అవడం వల్ల ఒకదానికొకటి పోటీగా మారే ప్రమాదం ఉంది. జాట్ బాలీవుడ్ మార్కెట్ టార్గెట్ చేయగా, గుడ్ బ్యాడ్ అగ్లీ తమిళ మార్కెట్‌లో హిట్ కావాలి. కానీ ఈ రెండు సినిమాల బాక్సాఫీస్ రన్ ఎలా ఉండబోతోందనే విషయంపై భారీ అనుమానాలు ఉన్నాయి. మైత్రి గతంలో తెలుగులో వరుసగా మంచి లాభాలు అందుకున్నా, పరభాషా మార్కెట్‌లో ఇలాంటి భారీ ప్రయోగం చేయడం చాలా ప్రమాదకరమని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పుష్ప 2తో వచ్చిన లాభాలతో సంస్థ ప్రాఫిట్ లోకి ఉంచింది. ఇక ఈ రెండు తేడా కొడితే మాత్రం ఆ వచ్చినవి కూడా పోయే 0ప్రమాదం ఉంది. ఏప్రిల్ 10 మైత్రి మూవీ మేకర్స్ భవిష్యత్తుకు కీలకమైన రోజు అవ్వబోతోంది. ఒకవేళ రెండు సినిమాలు హిట్ అయితే, ఇది ఈ బ్యానర్‌ను బాలీవుడ్, కోలీవుడ్‌లో టాప్ లీగ్‌కి తీసుకెళ్లే అవకాశం. మరి ఈ భారీ రిస్క్ లో మైత్రి ఎంత వరకు విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## మిడ్ రేంజ్ హీరోల పాట్లు.. హిట్టు దక్కేదెప్పుడో?



టాలీవుడ్‌లో చిన్న కథల సినిమాలు హిట్ అవుతున్నాయి, భారీ బడ్జెట్ చిత్రాలు కూడా సక్సెస్ సాధిస్తున్నాయి. కానీ మిడ్ రేంజ్ హీరోలు మాత్రం ఈ రెండు మధ్య చిక్కుకుని సతమతమవుతున్నారు. విజయ్ దేవరకొండ, గోపీచంద్, నితిన్, వరుణ్ తేజ్, అక్కినేని అఖిల్.. వీరందరూ హిట్ కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. వీరి సినిమాలు ఫ్లాప్ అవడంతో మార్కెట్ కూడా తగ్గుతోంది. విజయ్ దేవరకొండ: అర్జున్ రెడ్డి, గీత గోవిందం.. లాంటి హిట్స్‌తో దూసుకెళ్లిన విజయ్, ఆ తర్వాత డియర్ కామ్రేడ్, లైగర్, ఫ్యామిలీ స్టార్ లాంటి ఫ్లాప్‌లతో ఇబ్బంది పడ్డాడు. ఖుషి కాస్త ట్రాక్ లోకి తెచ్చినప్పటికి 'ఫ్యామిలీ స్టార్' (2024) బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. ఇప్పుడు అతని నెక్స్ట్ మూవీ 'కింగ్‌డమ్' (మే 30, 2025) స్పై థ్రిల్లర్‌గా రాబోతోంది. దీనిపై భారీ ఆశలు పెట్టుకున్నాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఈ సినిమా పాన్ ఇండియా మార్కెట్ లో నిలబెడుతుందని అతను ఆశిస్తున్నాడు. గోపీచంద్: లక్ష్యం, శౌర్యం, లౌక్యం లాంటి హిట్స్‌తో ఒకప్పుడు మంచి గుర్తింపు తెచ్చుకున్న గోపీచంద్ ఇటీవల 'రామబాణం' 'భీమా' సినిమాలతో నిరాశపరిచాడు. ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విఫలమయ్యాయి. అయితే రీసెంట్ గా 'విశ్వం' సినిమా కమర్షియల్ గా కొంత ఊరట కలిగించింది. ఇప్పుడు తన 33వ చిత్రం 'గోపీచంద్ 33'తో బిజీగా ఉన్నాడు. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఈ హిస్టారికల్ డ్రామా ఇటీవల ప్రారంభమైంది. నితిన్: 'భీష్మ' (2020) తర్వాత నితిన్ సినిమాలు 'మాచర్ల నియోజకవర్గం, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, రంగ్ దే.. వరుసగా ఫ్లాప్ అయ్యాయి. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' (2025)తో రాబోతున్నాడు. ఈ సినిమా అతని కెరీర్‌ని మళ్లీ ట్రాక్‌లో పెట్టాల్సి ఉంది. భీష్మ దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నాడు కాబట్టి మంచి అంచనాలు ఉన్నాయి. వరుణ్ తేజ్: గని, ఆపరేషన్ వాలెంటైన్, మట్కా లాంటి ఫ్లాప్‌లతో వరుణ్ తేజ్ సంకటంలో ఉన్నాడు. 'మట్కా' భారీ బడ్జెట్‌తో తీసినా విఫలమైంది. అతని తదుపరి కథల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ప్రస్తుతం మెర్లపాక గాంధీ దర్శకత్వంలో ఒక హారర్ కామెడీ సినిమా చేస్తున్నాడు. అలాగే మరో రెండు కథలపై చర్చలు జరుపుతున్నారు. అక్కినేని అఖిల్: అఖిల్ ఇప్పటివరకూ బాక్సాఫీస్ వద్ద సాలీడ్ హిట్ ఒక్కటి కూడా చూడలేదు. 'ఏజెంట్' (2023) డిజాస్టర్ అయ్యింది. ఇప్పుడు అతని ఫోకస్ కొత్త సినిమాలపై ఉంది, కానీ ఇంకా క్లారిటీ లేదు. వినరో భాగ్యము విష్ణు కథ మురళి కిషోర్ తో ఒక మాస్ సినిమాను లైన్ లో పెట్టాడు. అలాగే మరికొందరు దర్శకులు కూడా లైన్ లో ఉన్నారు. మరి అఖిల్ బిగ్ హిట్ ఎప్పుడు అందుకుంటాడో చూడాలి.

## కాక పుట్టించిన బ్యూటీ మరో బిగ్ ఆఫర్!

కోలీవుడ్ స్టార్ శింబు సోలో గా సినిమాలు చేస్తూనే స్టార్ హీరోల చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే. అయితే గత ఏడాది మాత్రం ఒక్క సినిమా కూడా రిలీజ్ చేయలేదు. ప్రస్తుతం కమల్ హాసన్ తో కలిసి థగ్ లైఫ్ లో నటిస్తున్నాడు. అధికారికంగా చేతిలో ఉంది ఈ సినిమా ఒక్కటే. ఈనేపథ్యంలో తాజాగా శింబు 49వ చిత్రం ఖరారైంది. పార్కింగ్ ఫేం రామ్ కుమార్ బాలకృష్ణన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దావన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. ఇది ఒక డిఫరెంట్ స్టోరీతో తెరకెక్కుతోందని చిత్ర వర్గాలు అంటున్నాయి. ఇందులో హీరోయిన్ గా డ్రాగన్ బ్యూటీ కయాదు




లోహర్ ని ఎంపిక చేసారు. దీంతో అమ్మడికిది బిగ్ ఛాన్స్ గా మారింది. డ్రాగన్ విజయంతో కోలీవుడ్ సహా టాలీవుడ్ లో సంచలనమైన సంగతి తెలిసిందే. అందం.. అభినయం బోల్డ్ అప్పిరియన్స్ తో ఇప్పటికే యువత అటెన్షన్ డ్రా చేసింది. ఇంటర్నెట్ సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో హీటెక్కిస్తుంది. దీంతో ఇప్పటికే రెండు తెలుగు సినిమాలకు కూడా సైన్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఆ రెండు డ్రాగన్ తర్వాత వచ్చిన అవకాశాలే. తాజాగా శింబు సినిమాలో ఛాన్స్ రావడంతో? కయాదు కెరీర్ టర్నింగ్ ఛాన్స్ గా మారే అవకాశం లేకపోలేదు. శింబుతో హీరోయిన్ గా చేసిన భామలు కాలక్రమంలో అగ్ర హీరోయిన్లుగా ఎదిగారు.

ఈ నేపథ్యంలో కయాదు కూడా ఆ రేంజ్ కి చేరుకోవాలని నెటి జనులు కోరుకుంటున్నారు. కయాదు లోహర్ తెలుగులో మూడు ఏళ్ల క్రితమే శ్రీవిష్ణు హీరోగా తెరకెక్కిన అల్లూరి లో నటించింది. కానీ ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కయాదు పేరు వెలుగులోకి రాలేదు. ప్రస్తుతం అనుదీప్ కేవి దర్శకత్వంలో రూపొందుతున్న ఫంకీ సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక అయింది.

## టాలీవుడ్ లో శ్రీలీల చుట్టరికం!

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్లు అంటే? ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే ఉంటారు. అడపా దడపా మాత్రం తెలుగు హీరోయిన్లు అప్పుడప్పుడు కనిపిస్తుంటారు. ఇలాంటి వారికి ఇండస్ట్రీలో కూడా ఎలాంటి చుట్టరికాలు కూడా ఉండవు. అయితే తెలుగు హీరోయిన్ శ్రీలీల కు మాత్రం మంచి చుట్టరికాలే ఉన్నట్లు కనిపిస్తుంది. నటుడు రానా, దర్శకుడు అనీల్ రావిపూడికి శ్రీలీల దూరపు బంధువులా కనిపిస్తుంది. ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో రానా తాను తన ఫ్యామిలీలో ఏ ఫంక్షన్ కు వెళ్లిన అక్కడ శ్రీలీల కనిపిస్తుందన్నాడు. తాను వెళ్లి అడిగితే వాళ్లు మా చుట్టాలనేని శ్రీలీల చెబుతుందట. అంటే రానాకి-శ్రీలీలకు దూరపు బంధుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే అనీల్ రావిపూడికి కూడా శ్రీలీలకు బంధుత్వం



ఉన్నట్లు తెలుస్తోంది. వాళ్లు ఇద్దరు ఎక్కడికక్కడ ఫ్యామిలీ ఈవెంట్లలో తారస పడుతున్నారట. ఇదంతా బాగానే ఉంది. మరి వాళ్లతో కలిసి పనిచేసే అవకాశం శ్రీలీలకు ఎప్పుడు వస్తుందో చూడాలి. రానా ఇప్పటికే కొత్త సినిమా ప్రయత్నాల్లో ఉన్నాడు. కొంత కాలంగా ఆయన కూడా నిర్మాతగా బిజీగా కనిపి స్తున్నాడు. నటుడిగా కంటే? నిర్మాణంలో దూకుడు చూపిస్తున్నాడు. కానీ ఈ ఏడాది మాత్రం వెండి తెరపై మెరవాలని చూస్తున్నాడు. రానిని తెరపై చూసి అభిమానులకు చాలా రోజులైంది. వాళ్ల కోరిక మేరకు ఈ ఏడాది మాత్రం కొత్త సినిమాతో రావాలని చూస్తున్నాడు. మరి అందులో చుట్టాల మ్మాయికి ఛాన్స్ ఇస్తే సరి. అటు అనీల్ రావిపూడి డైరెక్టర్ గా బిజీ. స్టార్లతోనే సినిమాలు చేస్తున్నాడు. ఇప్పటికే ఆయన తో కలిసి శ్రీలీల 'భగవంత్ కేసరి'లో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికిప్పుడు అనుకుంటే చిరంజీవి సినిమాలోనైనా మరో అవకాశం ఇవ్వగలడు. మరి అనీల్ ఏమంటాడో.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536